


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

**ఆసియా క్రీడల్లో భారత్‌కు రెండో పసిడి**

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి - కమల్‌జీత్ జోడి అద్భుత ప్రదర్శన


09

సంపుటి 09, సంచిక: 296 | శనివారం | 26-09-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# వెళ్లి మళ్లీ రా!

- గంగమ్మ ఒడికి గణపతులు
- వైభవంగా ముగిసిన వినాయక నిమజ్జనోత్సవాలు
- 'జై బోలో గణేశ్ మహారాజ్ కీ జై' నినాదాలతో హోరెత్తిన హుస్సేన్ సాగర్ పరిసరాలు

**కన్నుల పండువగా సాగిన ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర**

ప్రజాపక్షం/హైదరాబాద్

భాగ్యనగరాన్ని 11 రోజుల పాటు భక్తి పారవశ్యంలో ముంచెత్తిన వినాయక నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం ఖైరతాబాద్ శ్రీ పంచముఖ సంకటహర మహాగణపతి, బాలాపూర్, నగర వ్యాప్తంగా మంటపాల్లో నెలకొల్పిన గణేశుల నిమజ్జనంతో అత్యంత వైభవంగా, ప్రశాంతంగా ముగిశాయి. లక్షలాది మంది భక్తుల జయజయధ్వానాలు, డప్పుల మోతలు, 'గణపతి బప్పా మోరియా', 'జై బోలో గణేశ్ మహారాజ్ కీ జై' నినాదాలతో హుస్సేన్ సాగర్ పరిసరాలు హోరెత్తాయి. శోభాయాత్రగా సాగిన ఖైరతాబాద్ బడా గణేశుడు ఈ ఏడాది 69 అడుగుల భారీ ఎత్తుతో భక్తులకు దర్శనమిచ్చిన ఖైరతాబాద్ 'పంచముఖ సంకటహర మహాగణపతి' శోభాయాత్ర ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైంది. బాహుబలి క్రేన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రారంభంలో మూడు గంటలు ఆలస్యమైనప్పటికీ, అధికారుల సమన్వయంతో ఊరేగింపు వేగంగా కొనసాగింది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ నృత్యం చేసి భక్తులలో ఉత్సాహాన్ని నింపారు. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్‌టిఆర్ మార్గ్‌కు చేరుకుంది. మధ్యాహ్నం 2:15 గంటల సమయంలో ఎన్‌టిఆర్ మార్గ్ వైపు ఉన్న క్రేన్



నంబర్4 వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, భారీ క్రేన్‌ల సహాయంతో మహాగణపతిని గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. అశేష భక్తజనం భావోద్వేగాల నడుమ స్వామివారికి వీడ్కోలు పలికారు. ఈ శోభాయాత్రలో మహారాష్ట్ర సంస్కృతికి చెందిన 'మిత్రాంగన్ ఢోల్ తాషా పథక్' ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట ఈసారి రికార్డు స్థాయి ధర పలికింది. వనస్థలిపురం సాహెబ్ నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు దక్కించుకున్నారు. వేలం ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రారంభమైన 16 కిలోమీటర్ల బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర తరువాయి 12లో

## బాలాపూర్ లడ్డూ @ రూ.39 లక్షలు

ప్రజాపక్షం/రంగారెడ్డి

ఉత్కంఠగా సాగిన వేలంపాటలో రంగారెడ్డి జిల్లా బాలాపూర్ గణేష్ లడ్డు ఆల్‌టైమ్ రికార్డు ధర పలికింది. శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో హైదరాబాద్ వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన "అర్బన్ గ్రూప్స్ "అధినేతి సామ ప్రణీత్ రెడ్డి అత్యంత పోటీ మధ్య రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. గతేడాది బాలాపూర్ లడ్డూ పాట రూ.35 లక్షలకు ముగిసింది. ఈసారి ఆ రికార్డును చెరిపివేస్తూ మరో రూ.4 లక్షలు అధికంగా పలికింది. బాలాపూర్ లడ్డూ వేలం పాటకు సుదీర్ఘ చరిత్ర,ప్రత్యేక విశిష్టత ఉంది. 1994లో కేవలం రూ.450 తో ప్రారంభమైన ఈ లడ్డూ వేలం సంప్రదాయం, తరువాయి 12లో

## సిఇసి జ్ఞానేశ్‌కుమార్ తీరుపై సుప్రీంకోర్టులో పిటిషన్

ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు చెల్లవని ప్రకటించాలని అభ్యర్థన



**న్యూఢిల్లీ :** ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ తీసుకున్న నిర్ణయాలు, మార్గదర్శకాలు, సాఫ్ట్‌వేర్ మార్పులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఇటువంటి చర్యలు సామూహిక నిర్ణయం తీసుకోవాలనే చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యాయవాది తరువాయి 8లో

## పార్టీ ఫిరాయించిన వారిపై ఆంక్షలు విధించాలి

- తిరిగి ఎన్నికయ్యేంత వరకూ ప్రభుత్వ పదవుల్లో కొనసాగనీయొద్దు
- అనర్హత పిటిషన్లపై నిర్ణయాధికారాన్ని ఎంపిలైతే రాష్ట్రపతికి, ఎమ్మెల్యేలైతే గవర్నర్‌కు బదిలీ చేయాలి
- అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ సూచన
- 2022-26 మధ్య 111 మంది ఎంపిలు, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినట్లు ఎడిఆర్ విశ్లేషణలో వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలో పార్టీ ఫిరాయింపుల సంస్కృతి కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో ఒక పార్టీ నుంచి పోటీ చేయడం, గెలిచిన తరువాత మరొక పార్టీలోకి దూకే విష సంస్కృతికి ప్రజాప్రతినిధులు తెరలేపారు. తమ పార్టీలో సరైన స్థానం దక్కలేదనో, నియోజకవర్గ అభివృద్ధి పేరిటనో పార్టీ ఫిరాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2022 నుండి 2026 మధ్య పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభలకు జరిగిన ఎన్నికలలో గెలిచిన తర్వాత ఏకంగా 111 మంది ఎంపిలు, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారు. వీరిలో అత్యధిక సంఖ్యలో నాగాలాండ్, పశ్చిమ బెంగాల్‌లలో ఇటువంటి పార్టీ మార్పులు నమోదయ్యాయి. ఈ మేరకు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫారమ్స్ (ఎడిఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ విశ్లేషించింది. ఎన్నికల సంఘం సలహా ఆధారంగా, ఫిరాయింపుల నిరోధక చట్టంలో తరువాయి 8లో

## దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు

- సిఇఒ కార్యాలయాల ముట్టడి
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్


అసోంలో...

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) ప్రక్రియపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నిరసనలను చేపట్టింది. ఎన్నికల సంఘం కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలను నిర్వహించింది. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినదించింది. దీంతో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాటలు జరిగాయి. అసోంలో జరిగిన కార్యక్రమంలో పార్లమెంట్‌లో కాంగ్రెస్‌పక్ష ఉపనేత గౌరవ్ గగోయ్ సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బిహర్ రాజధాని పాట్నా, చండీగఢ్‌లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు వాటర్ కెనాన్లను ప్రయోగించారు. ఇదే తరహా ఆందోళనలు తరువాయి 8లో

## 'ముడి పామాయిల్ ' దిగుమతి సుంకం పునరుద్ధరించాలి

- కేంద్ర ప్రభుత్వానికి మంత్రి తుమ్మల డిమాండ్
- రైతుల భవిష్యత్తుతో ఆటలాడుకోవద్దని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

'ముడి పామాయిల్' దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించి, దేశీయ ఆయిల్ పామ్ రైతులకు తగిన రక్షణ కల్పించేలా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల భవిష్యత్తును కాపాడాల్సిన కేంద్రం, అందుకు భిన్నంగా దిగుమతి దారుల ప్రయోజనాలకు పెద్దపీట వేయడం సరికాదన్నారు. రైతుల భవిష్యత్తుతో ఆటలాడే దిగుమతి విధానాలను కేంద్రం వెంటనే పునః సమీక్షించాలని, ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల తరువాయి 8లో

## నైపుణ్య శిక్షణలో తెలంగాణకు జాతీయ గుర్తింపు

- పిఎం సేతు అమలులో అగ్రస్థానంలో రాష్ట్రం
- నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ స్టేట్స్, యుటిస్ స్కిల్ సెక్రటరీస్ ఫర్ ప్రగతి రివ్యూలో వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించడంతోపాటు దేశీయ, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలకు వారిని సిద్ధం చేస్తున్న తెలంగాణకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. పిఎం సేతు అమలు, అప్రెంటిస్‌షిప్, ఆన్‌దిజాబ్ శిక్షణ, ప్లేస్‌మెంట్‌లలో రాష్ట్రం అగ్రస్థానాల్లో ఉన్నట్లు న్యూఢిల్లీలో జరిగిన తరువాయి 12లో

## చైనా ఎదుగుదలను ప్రతిబింబిస్తున్న జిన్‌పింగ్–ట్రంప్ శిఖరాగ్ర భేటీ

**బీజింగ్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాషింగ్టన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు ఇచ్చిన ఘన స్వాగతంపై ఇప్పుడు జోరుగా చర్చ జరుగుతున్నది. ట్రంప్ ఆతిథ్యం జిన్‌పింగ్‌ను ఎంతగా ఆకట్టుకుందో స్పష్టంగా తెలియదుగానీ, చైనా ప్రజలపై మాత్రం గణనీయమైన ప్రభావం చూపింది. జిన్‌పింగ్, ఆయన భార్య పెంగ్ లియువాన్‌కు విమానాశ్రయంలో ట్రంప్ స్వయంగా స్వాగతం పలకడం అందరినీ ఆశ్చర్యపరచింది. ట్రంప్ చాలా అరుదుగా ఈ విధంగా స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి, అతిథులకు ఆహ్వానం పలుకుతారు. కాగా, ఇరువురు నేతలు పాల్గొన్న ద్వైపాక్షిక, సాంస్కృతిక కార్యక్రమాలను చైనా ప్రభుత్వ మీడియా విస్తృతంగా ప్రసారం చేసింది. వాటిని ప్రశంసించింది కూడా. స్వదేశంలో ఈ దృశ్యాలను చూసిన చైనా ప్రజలకు తమ దేశానికి పెరిగిన ప్రాధాన్యం స్పష్టంగా కనిపించింది. 'అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అమెరికా అత్యంత ఘనమైన ఆతిథ్యాన్ని ఇస్తోందని వార్తల్లో చదివాను. ఇది నన్ను బాగా ఆకట్టుకుంది. మన దేశం నిజంగా శక్తిమంతంగా మారిందని తరువాయి 8లో




# జ్ఞానేష్ కుమార్‌కు పదవిలో కొనసాగే నైతికత ఉందా?

భారత ఎన్నికల కమిషన్ రాజ్యాంగం ద్వారా వ్యవస్థాపితమైన ఒక వ్యవస్థ తప్ప ఏ వ్యక్తికీ సంబంధించిన నిరంకుశాధికార కేంద్రం కాదు. అటువంటి ప్రమాదం నివారించేందుకు ఏకవ్యక్తి ఎన్నికల కమిషన్ త్రిసభ్య కమిషన్‌గా చట్టరీత్యా విస్తరించబడింది. ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చాకచక్యంగా కమిషనర్‌ల నియామకాన్ని తన చెప్పుచేతల్లోకి తీసుకున్నారు. తమ నమ్మినబంటు జ్ఞానేశ్‌కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించారు. చట్టం, సాంప్రదాయం ప్రకారం ఆయన ముగ్గురు కమిషనర్‌లలో ప్రథముడు తప్ప సర్వాధికారి కాదు. కాని ఆయన తన యజమానుల ఆదేశాలను పాటిస్తూ సహ కమిషనర్‌ల అభిప్రాయాలను ఖాతరు చేయకుండా ఏకవ్యక్తి పాలన సాగిస్తున్నట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పరిశోధనాత్మక కథనం వెల్లడించింది. కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు సహజమని, చివరకు నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకుంటున్నట్లు ఆయన తరపున కమిషన్ అధికారులు ఇచ్చిన వివరణ, ఓటరు జాబితాల క్షాళనకోసం 'ప్రత్యేక ముమ్మర సవరణ'కు సంబంధించి గత 10 మాసాల్లో 14 సార్లు సహ కమిషనర్‌లు తెలియజేసిన అభ్యంతరాలను సిఇసి త్రోసిపుచ్చి ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారన్న వాస్తవం ముందు వీగిపోయింది.

బిహార్‌లో 'సర్'తో మొదలుపెట్టి, ఆ తర్వాత పశ్చిమ బెంగాల్, హర్యానాలతో యావద్దేశానికి విస్తరించిన 'సర్' ప్రక్రియలో 13 కోట్లమంది ఓటర్లు జాబితాలనుంచి తొలగించబడ్డారు. ప్రతి వయోజనుడికీ ఓటు హక్కు కల్పించటం, ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా నిర్వహించటం, తద్వారా ప్రజల ప్రజాస్వామిక తీర్పు ప్రకారం మెజారిటీ సీట్లు గెలుచుకున్న పార్టీ అధికారం చేబట్టే క్రమానికి చట్టబద్ధ ప్రాతిపదిక కల్పించటం ఎన్నికల కమిషన్ విధి. అంతేకాని జ్ఞానేశ్‌కుమార్ ఎదుర్కొంటున్న ఆరోపణల్లాగా పాలక బిజెపిని లేదా మరోపార్టీని అధికారంలో కూర్చోబెట్టటం ఎన్నికల కమిషన్ పనికాదు. అది దానికున్న రాజ్యాంగ ఆదేశానికి ద్రోహం, ప్రజాస్వామ్యానికి వెన్నుపోటు. ఏకాభిప్రాయం ప్రకారం లేదా మెజారిటీతో కమిషన్ నిర్ణయాలు తీసుకోవాల్సిన పని తీరును కాదని తోటి కమిషనర్‌ల అభ్యంతరాలు తెలిపిన అంశాల్లో ఏకపక్షంగా ఎందుకు నిర్ణయాలు తీసుకున్నారు, ఎవరికోసం తీసుకున్నారు అనే ప్రశ్నకు సూటి జవాబు కావాలి. చాలా విషయాల్లో ఏకగ్రీవంగానే నిర్ణయాలు తీసుకున్నామనే సమాధానం మౌలిక ప్రశ్నను దాటవేసే లక్షణం.

ఎన్నికల కమిషనర్‌లు ఏ పార్టీకీ – కనీసం ఆ పదవిలో నియామకం తదుపరి – చెందరు. కాని జ్ఞానేశ్‌కుమార్ నేతృత్వంలో ఎన్నికల కమిషన్ పాలక బిజెపి ఓట్ల చోరీకి సహకరిస్తోందని, పూర్తి పక్షపాతంతో పనిచేస్తోందని సంవత్సరం పైబడి ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నప్పుడు, ఆయన్ను పదవినుంచి తొలగించాలని అభిశంసన నోటీసు సమర్పించినపుడు సైతం ఆయన తన వైఖరిని సరిదిద్దుకోలేదు. కేవలం పాలక పార్టీయే ఆయన్ను సమర్థిస్తున్నదంటే ఆయన పక్షపాతంతో ఆ పార్టీకి మేలు చేస్తున్నారని అర్థం కావటం లేదా? తాజా బట్టబయలుతో జ్ఞానేశ్‌కుమార్‌ను బర్తరఫ్ చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. అభిశంసన నోటీసు మళ్లీ ఇచ్చే ఆలోచన చేస్తున్నాయి. అవి అట్టి నోటీసు ఇస్తే అది మూడవ నోటీసు అవుతుంది. ఈ పరిస్థితుల్లో ఆత్మాభిమానం కలిగిన ఏ అధికారీ పదవిని అంటిపెట్టుకోరు. 63 మంది రాజ్యసభ సభ్యులు, 130మంది లోక్‌సభ సభ్యుల సంతకాలతో కుమార్ తొలగింపును కోరుతూ 2026 మార్చి 12న 7ఆరోపణలతో తొలిసారి అభిశంసన నోటీసు అందజేయబడింది. అది ఏప్రిల్ 17న తిరస్కరణకు గురైంది. ఏప్రిల్ 24న ప్రతిపక్షం 73 సంతకాలతో రాజ్యసభలో మళ్లీ నోటీసు ఇచ్చింది. పాలక ఎన్‌డిఎ జ్ఞానేశ్‌కుమార్‌కు మద్దతుగా ఉంది కాబట్టి తిరిగి మరో అభిశంసన నోటీసు ఇచ్చినా అది తిరస్కరణకు గురవుతుంది. కాని ఆ ప్రయత్నం ప్రజాస్వామిక పోరాటంలో భాగమవుతుంది, జ్ఞానేశ్‌కుమార్, మోదీ, అమిత్‌షా అప్రతిష్ట మూటగట్టుకోవాల్సి వస్తుంది. ఎందుకంటే, ఎన్నికల కమిషనర్‌ల నియామక చట్టాన్ని సవరించి, అందులోని ముగ్గురు సభ్యుల్లో (ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, తటస్థునిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి) ప్రధాన న్యాయమూర్తిని తొలగించి క్యాబినెట్ మంత్రిని చేర్చింది ప్రధాని మోదీయే. ఆ చట్టం సుప్రీంకోర్టులో సవాలు చేయబడి ఉండగానే క్యాబినెట్ మంత్రి స్థానాన్ని అమిత్ షాతో భర్తీ చేసిందీ, ఆ కమిటీ సమావేశాన్ని రాహుల్‌గాంధీ బహిష్కరించగా, రిటైర్డ్ అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను సిఇసిగా నియమించిందీ మోదీ, అమిత్ షా లే. ఆ చట్టం ఇప్పటికీ సుప్రీంకోర్టు ముందుంది. ఈ లోపు ఓటర్ల జాబితాల్లో తారుమార్లు, 30 రాష్ట్రాలు, యుటిల్లో సర్ ప్రక్రియ అమలు, 13 కోట్లమంది ఓట్లు తొలగింపు జరిగిపోయాయి. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం కోట్లమంది ఓటర్లు అవస్థలు పడుతున్నారు. వారిలో అత్యధికులు ఏ డాక్యుమెంట్లూ లేని దళితులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులని వేరుగా చెప్పనవసరం లేదు.


"స్వరాజ్‌లోని బహుముఖ అంశాల్లో కీలకమైనది వయోజన ఓటింగ్. అది అధికారంలోని వారికి వ్యతిరేకంగా ప్రజల ప్రత్యక్ష కార్యాచరణ".

*– మహాత్మాగాంధి (యంగ్ ఇండియా) 1931 జూన్ 18.*

"ఎన్నికల సూపరింటెండెన్స్, డైరెక్షన్, కంట్రోలు ఎన్నికల కమిషన్‌కు దఖలు అవుతాయి. ఎన్నికల జాబితాలు తయారు చేయటంలో ఎన్నికల కమిషన్ ఎటువంటి అన్యాయం చేయరాదు. తద్భిన్నమైన చర్య ఏదైనా ప్రజాస్వామిక ప్రభుత్వ మూల వేరునే కత్తిరిస్తుంది".

*–డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, 1949 జూన్ 15. రాజ్యాంగ సభలో ఆర్టికల్ 289(ఇప్పుడు ఆర్టికల్ 324)ప్రతిపాదిస్తూ చెప్పిన మాట.*

సిఇసి జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్ష, రాజ్యాంగ విరుద్ధ చర్యలను పై ఇద్దరు మహానుభావుల అభిప్రాయాలతో పోల్చి చూస్తే మన ప్రజాస్వామ్యం విలువలు ఎంత దిగజారాయో విదితమవుతుంది. అందువల్ల జ్ఞానేశ్‌కుమార్‌ను బర్తరఫ్ చేయాలన్న ప్రతిపక్ష పార్టీల డిమాండ్ ఎంతో సమంజసం, న్యాయబద్ధం. తనుగా రాజీనామా చేయటం నైతిక ధర్మం!



## ఎంత మంది బంగ్లాదేశీయులను గుర్తించారు?

**భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ అమలు చేశారనే మాటలు నేను వింటూనే ఉన్నాను. ఇప్పటి వరకు సర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా ఎంతమంది అక్రమ బంగ్లాదేశీయులను గుర్తించారో ఎన్నికల కమిషన్ చెప్పగలదా? సమాధానం లేదు. విదేశీయుల చట్టం కింద ఎంతమందిని వెనక్కి పంపారో చెప్పగలదా? సమాధానం లేదు! దయచేసి ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయండి, కానీ అది పారదర్శకంగా చేయాలి. అర్హులైన పౌరుల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా కాదు.**

– రాజ్‌దీప్ సర్దేశాయి, ప్రముఖ జర్నలిస్టు




## పర్యావరణ ఆరోగ్యమే జీవకోటి సౌభాగ్యం

ఐరాస లాంటి పలు అంతర్జాతీయ సంస్థలు నిర్వహించే అతి పెద్ద కార్యక్రమాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణ యజ్ఞాన్ని నిరంతరం కొనసాగుతూ మనకు హెచ్చరికలు చేస్తూ వస్తున్నది. పర్యావరణ ఆరోగ్యమే సకల జీవకోటిని సౌభాగ్యమని తెలుసుకొని మన జీవనశైలిని 'హరిత ఆలోచన'ల వైపు మళ్లిస్తేనే పర్యావరణ కాలుష్యం తగ్గిపోయి మనకే కాకుండా భవిష్యత్తు తరాలకు ఆరోగ్య గొడుగులు పడతాయని తెలుసుకుందాం. పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణాలుగా అనాలోచిత సాగు పద్ధతులు, మైనింగ్, ఆటోమొబాల్ ఉద్గారాలు, శిలాజ ఇంధనాల ఉద్గారాలు, అటవీ కార్చిచ్చులు, రేడియోధార్మిక పదార్థాలు, మురుగు నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామికీకరణ, రవాణా, పట్టణీకరణ, భూతాపం, అడవుల నరికి వేత, నిర్మాణ రంగం లాంటి అవాంఛనీయ అంశాలు నిలుస్తున్నాయి. పర్యావరణ కాలుష్యం ఫలితంగా మానవాళి/ప్రాణికోటి అనారోగ్యాలు, జీవ వైవిధ్యానికి విఘాతాలు, వాతావరణ మార్పులు, ఆర్థిక ప్రతికూలతలు, సామాజిక ప్రభావాలు లాంటి పలు దుష్ప్రభాలు కలుగుతున్నాయి. వివిధ రకాల కాలుష్యాల్లో గాలి, నేల, నీటి, శబ్ద, రేడియోధార్మిక, దుమ్ము, ఉష్ణ, విష వాయు, సముద్ర, కాంతి కాలుష్యాలు ప్రధానమైనవని మనకు తెలుసు. పర్యావరణ కాలుష్యానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం:

26 సెప్టెంబర్ 2026న ప్రపంచవ్యాప్తంగా 2011 నుంచి మానవాళి ఘనంగా నిర్వహించుకునే ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం (వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ డే) నిర్వహించుకునే వేళ 2025 ఇతివృత్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం సామాజిక ఆరోగ్య సాధనలో వైజ్ఞానిక శాస్త్ర పరిజ్ఞానం (ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ : స్టాండింగ్ విత్ సైన్స్ టు ప్రొటెక్ట్ కమ్యూనిటీస్) అనబడే అంశాన్ని తీసుకున్నారు. మానవాళి ఆరోగ్య పరిరక్షణతో పాటు శ్రేయస్సు కల్పనకు గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, వాతావరణ ప్రతికూల మార్పులను తగ్గించడం, శ్వాసకోశ సంబంధ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండడం కొనసాగాలి. గాలి, నేల, జల కాలుష్యాలకు ప్రధాన ప్రమాదకర కారణంగా నిలుస్తున్న ప్లాస్టిక్ కాలుష్యంతో భూమాత ఊపిరి పీల్చడం కష్టంగా తోస్తున్నది. ప్లాస్టిక్ కాలుష్య కోరల్ని పెకిలించడానికి రీయూజ్, రీసైకిల్, రెఫ్యూజ్, రెడ్యూస్, రీథింక్ అనే నినాదాలకు కార్యరూపం దాల్చడం మాత్రమే మన ముందున్న ఉత్తమ కర్తవ్యం. ప్లాస్టిక్ కాలుష్య దుష్ప్రభావంతో వాతావరణ ప్రతికూల మార్పులు, నేల/ప్రకృతి/జల/జీవ వైవిధ్య సంక్షోభాలు, వ్యర్థాల కాలుష్యం లాంటి ప్రమాదకర సమస్యలు ప్రాణికోటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నేడు ధరణిలో నెలకొన్న జల నెలవులు, నేలలు ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితం కావడం జరుగుతోంది. నేల లేదా జలాల్లోకి చేరిన ప్లాస్టిక్ జీవ విచ్ఛిన్నం లేదా డీగ్రేడేషన్ కావడానికి వంద ఏండ్లు కూడా పట్టవచ్చని నిపుణులు హెచ్చరించడం గమనార్హం. మన జీవన విధానంలో ప్రతి క్షణం పర్యావరణ హితాన్ని కోరుతూ మన జీవన పయనం కొనసాగించాలి. పర్యావరణ కాలుష్యానికి కారణం కాకుండా మన జీవనశైలిని మార్చుకుంటూనే పౌర సమాజంలో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచడం మన కనీస కర్తవ్యంగా భావించాలి. విద్యార్థులు, పాలసీ మేకర్స్, తల్లిదండ్రులు, పౌర సమాజం కలిసి పర్యావరణాన్ని కాపాడే మహాయజ్ఞంలో భాగం కావాలి. వాతావరణ పరిశుభ్రతను పాటించి, జల వనరులను వ్యర్థాల నుంచి రక్షించి, మన ఏకైక భూగృహాన్ని కాపాడుకుందాం. మనకు మేలు చేస్తున్న పర్యావరణానికి కీడు తలపెట్టవద్దు. మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవద్దు.

# అంగరంగ వైభవంగా ఫ్రెంచి కమ్యూనిస్టు పత్రిక 'లీమ్యానిటే' ఉత్సవం

## అధ్యక్ష ఎన్నికలకు ముందు వామపక్షాల్లో ఉత్తేజం నింపిన వేడుక

**ల్యూక్ రొటెల్లో, మాత్ విస్‌న్యూస్కీ**

'నేను ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటాను. తమ జీవనోపాధిని రక్షించుకునేందుకు పోరాడేవారి పక్షాన, తమ పిల్లలకు తిండి పెట్టటానికి, బిల్లులు చెల్లించటానికి గౌరవం కోసం పోరాడేవారి పక్షాన ఉంటాను,' అని గత వారాంతంలో వేలాది మంది ప్రజల సమక్షంలో ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీ (పిసిఎఫ్)జాతీయ కార్యదర్శి ఫాబియన్ రౌసెల్ ప్రకటించారు. 'అడ్డంకులు ఉన్నప్పుడు నేను ఏ పక్షాన ఉన్నానో నాకు తెలుసు.'

సెప్టెంబర్ 11 నుండి 13 వరకు జరిగిన పిసిఎఫ్ అనుబంధ దినపత్రిక ' లీమ్యానిటే'(L'HUMANIT) 91వ 'ఫెట్ డి లీమ్యానిటే' ఉత్సవంలో రౌసెల్ ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఫ్రాన్స్ నలుమూలలతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి 5 లక్షల మందికి పైగా ప్రజలు ఉత్సవాలు, సంగీతం రాజకీయ చర్చల కోసం హాజరయ్యారు. 2027లో జరగబోయే ఫ్రెంచ్ అధ్యక్ష పదవికి తన అభ్యర్థిత్వాన్ని రౌసెల్ అధికారికంగా ప్రకటించిన వేదిక కూడా ఇదే.

ఈ ఉత్సవం ఇతివృత్తం, 1936లో పాపులర్ ఫ్రంట్ చేసిన ప్రకటనను గుర్తు చేసింది. అది ఐరోపాలో ఫాసిజం పెరుగుదలకు వ్యతిరేకంగా ఏకమైన కమ్యూనిస్టు, సోషలిస్టు, ప్రజాస్వామ్య శక్తుల ఒక విస్తృత ఫాసిస్టు వ్యతిరేక కూటమి. కార్మిక సంఘాల సమీకరణ, భారీ ప్రదర్శనలు, ఎన్నికల పోరాటం ద్వారా తిరుగుబాటు చేసిన పాపులర్ ఫ్రంట్ పచ్చి మితవాద ఉద్యమాన్ని ఓడించింది.

ప్రభుత్వాన్ని దాని ఎన్నికల వాగ్దానాలకు జవాబుదారీగా ఉంచుతూ, కార్మిక సంఘాలు, కార్మికులు తమ డిమాండ్ల కోసం సమీకరణ, ఆందోళనను కొనసాగించారు. తద్వారా ఫ్రాన్స్‌లో ఆధునిక కార్మిక, ప్రజాస్వామ్య హక్కులకు మూల స్తంభాలను సాధించారు. 2024లో జరగబోయే ఆకస్మిక (స్నాప్) ఎన్నికలలో పార్లమెంటులో పచ్చి మితవాద పార్టీలకు మెజారిటీ వచ్చే ప్రమాదం మళ్లీ తలెత్తడంతో, ఫ్రాన్స్‌లోని ప్రధాన కార్మిక సంఘాల సమాఖ్యలు ఏకమై 'న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌ఎఫ్‌పి)' ఏర్పాటుకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా మధ్యేవాద వామపక్ష శక్తులు ఏకమై ఒకే పార్లమెంటరీ అభ్యర్థుల జాబితాను, ఉమ్మడి రాజకీయ కార్యక్రమాన్ని ప్రకటించాలి. యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల సమయంలో గత కూటమి విచ్ఛిన్నమైంది. దీంతో, పచ్చి మితవాద పార్టీలు అధికారాన్ని చేజిక్కించుకునే ప్రమాదం ఉన్నప్పటికీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్ పార్లమెంటును రద్దు చేశారు. కమ్యూనిస్ట్ పార్టీ (పిసిఎఫ్), సోషలిస్ట్ పార్టీ (పిఎస్), పాపులిస్ట్ ఫ్రాన్స్ ఇన్సౌమిస్ (ఎల్‌ఎఫ్‌ఐ), గ్రీన్స్ (ఇఇఎల్‌వి), ఇతర చిన్న పార్టీలతో కూడిన ఎన్‌ఎఫ్‌పి అనూహ్య విజయాన్ని సాధించి, నేషనల్ అసెంబ్లీలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. తద్వారా ఫాసిస్ట్ నేషనల్ ర్యాలీ (ఆర్‌ఎన్)కి, మ్యాక్రాన్ నయా ఉదారవాద మిత్రపక్షాలకు మెజారిటీ రాకుండా అడ్డుకుంది.

అయితే, ఈ కూటమి ప్రధానమంత్రి పదవికి తమ తరపున ఏకాభిప్రాయ అభ్యర్థిని నియమించలేకపోయింది. అలాగే ఫ్రెంచ్ అధ్యక్ష పదవి అపారమైన శక్తిని సమతుల్యం చేయలేకపోయింది. ఇది ప్రస్తుత రాజకీయ అస్థిరత, పొదుపు చర్యలు, సైనికీకరణ, పెరుగుతున్న తీవ్ర మితవాద పక్ష భావజాలానికి దారితీసింది. ఇప్పుడు తదుపరి అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, డజన్ల కొద్దీ ఇతర పార్టీ నాయకులతో పాటు అవినీతి ఆరోపణలపై దోషిగా తేలినప్పటికీ, చట్టపరమైన సాంకేతిక కారణాలతో పోటీ చేయడానికి అనుమతించబడిన ఆర్‌ఎన్ నాయకురాలు మెరైన్ లీ పెన్, ఇటీవలి అభిప్రాయ సేకరణలలో స్పష్టమైన ముందంజలో ఉన్నారు.

పిసిఎఫ్, లీ మ్యానిటే సంయుక్తంగా నిర్వహించిన 'ఫెట్ డి లీ మ్యానిటే' పాపులర్ ఫ్రంట్ చారిత్రక స్మృతులలోకి తిరిగి రావడం ద్వారా, కార్మిక వర్గ నాయకత్వం కింద వివిధ శక్తుల విస్తృత ఐక్యత ద్వారా మార్గాంతరాన్ని చూపింది.

ఈ ఉత్సవ ప్రాంగణమంతా వ్యాపారుల స్టాల్స్, దేశంలోని ప్రతి పిసిఎఫ్ ప్రాంతీయ శాఖ, పాపులర్ ఫ్రంట్ రాజకీయ మిత్రులతో పాటు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధుల కోసం కేటాయించిన ఒక పెద్ద భాగంతో నిండిపోయింది. ఏంజెలా డేవిస్, నీనా సిమోన్, జోసెఫిన్ బేకర్‌ల పేరిట ఏర్పాటు చేసిన వేదికలపై అనేకమంది నల్లజాతి, ఎల్‌జిబిటిక్యూ+, కార్యకర్త కళాకారుల సంగీత ప్రదర్శనలు జరిగాయి. అదే సమయంలో, ఉత్సవ వీధులు, స్టాల్స్ తాజా ఆహారం, ఆకస్మిక కరోకే, నృత్య ప్రదర్శనలు, కార్నివాల్ ఆకర్షణలు, ఇంకా మరెన్నో వాటితో నిండిపోయాయి. ఫ్రెంచ్ చీజ్‌లు, సెనెగలీస్ పౌలెట్ యాస్సా, సూడానీస్ పప్పు రసం, లెక్కలేనన్ని ఇతర ప్రధాన వీధి ఆహారాల సువాసనలు గాలిలో తేలియాడాయి. వివిధ వాయిద్యాల, సంగీత సంప్రదాయాల శబ్దాలు గాలిలో మిళితమవుతుండగా, ఆకస్మిక ప్రదర్శనలు వాటిని జనసమూహాల గుండా తీసుకువెళ్లాయి.

ఉత్సవాలు, రాజకీయాలు విడదీయరానివిగా మారాయి. పిసిఎఫ్ స్టాల్స్ పార్టీ కోసమే కాకుండా, వారి ఫెడరేషన్‌లలో జరుగుతున్న వివిధ సంఘీభావ ప్రయత్నాల కోసం కూడా నిధులు సేకరించాయి. ఫ్రాన్స్‌లోని అతిపెద్ద యూనియన్‌లలో ఒకటైన సిజిటి ప్రధాన కేంద్రంలో చర్చలు జరిపి, యూనియన్ సమాచారాన్ని పంపిణీ చేసింది. ఇది తరచుగా ఆహారం, పానీయాలు తీసుకువెళ్తున్న ఆసక్తిగల బాటసారులను ఆకర్షించింది. గాయకులు, నృత్యకారులు తమ ప్రదర్శనల మధ్య విరామాలలో నల్లజాతి, ట్రాన్స్‌జెండర్ ప్రజల జీవితాలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు లేదా ప్రేక్షకుల మధ్య 'ఫ్రీ పాలస్తీనా' అనే నినాదాలు ప్రారంభించారు.

పాపులర్ ఫ్రంట్‌తో అనుబంధంగా ఉన్న అనేక లాభాపేక్షలేని, సామాజిక కార్యక్రమాల సంస్థలు కూడా హాజరయ్యాయి. వీటిలో ఎల్‌జిబిటిక్యూ+, పర్యావరణ న్యాయం, పౌర హక్కుల సంస్థలు కూడా ఉన్నాయి. కొంతమంది వాలంటీర్లు, ఇటీవల ఫ్రెంచ్ శాసనసభ ఆమోదించిన 'చంపే హక్కు' (రైట్ టు కిల్)చట్టాన్ని హైలైట్ చేస్తూ హాజరైన వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ చట్టం ప్రకారం, దేశవ్యాప్తంగా పోలీసులకు కాల్పులు జరిపేటప్పుడు పెక్కుస్థాయిలో విచక్షణాధికారం లభిస్తుంది. కోర్టులో వారిపై విచారణ చాలా వరకు తగ్గుతుంది.

మరికొందరు అమెరికా దిగ్బంధనానికి వ్యతిరేకంగా క్యూబాకు మద్దతు ఇచ్చే మార్గాలతో కూడిన గ్రాఫిక్స్, స్థానిక ఆసుపత్రుల మూసివేత గురించిన సమాచారం, కొత్త దేశీయ వ్యవసాయ కార్యక్రమాలపై కరపత్రాలను పంచుకున్నారు.


ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీ (పిసిఎఫ్) జాతీయ కార్యదర్శి ఫాబియన్ రౌసెల్

పిసిఎఫ్ సభ్యుల్లో, ఉత్సవానికి హాజరైన వారిలో ప్రధానంగా చర్చకు వచ్చిన అంశాలు – ఫ్రాన్స్‌లో పెరుగుతున్న సైనిక ఆధారిత ఆర్థిక వ్యవస్థ, అమెరికాపై ఆర్థికంగా ఆధారపడటం, ప్రపంచంలోని ఇతర దేశాలతో దాని సంబంధాలు.

ఫ్రాన్స్ ప్రస్తుతం 'డీ ఇండస్ట్రియలైజేషన్' (పరిశ్రమల మూసివేత) ప్రక్రియను ఎదుర్కొంటోంది. ఇందులో భాగంగా కొన్ని పరిశ్రమలు యూరోపియన్ యూనియన్ సరిహద్దుల ఆవలకి తరలించబడుతున్నాయి. అలాగే అంతర్జాతీయ గుత్తాధిపత్య సంస్థలకు అనుకూలంగా యూనియన్ పరిధిలోని ఉత్పత్తి వ్యవస్థలో మార్పులు చేస్తున్నారు.

అదే సమయంలో, దేశీయ పరిశ్రమలలో తగ్గుతున్న లాభాల రేట్లను పునరుద్ధరించే ప్రయత్నంలో మ్యాక్రాన్ ప్రభుత్వం కార్మికుల హక్కులపై తీవ్రమైన దాడికి దిగింది. 2023లో తిరోగమన విధానాలతో కూడిన పెన్షన్ సంస్కరణలను బలవంతంగా ఆమోదించడంతో దేశవ్యాప్త సమ్మెలు జరిగి, లక్షలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. దీని అమలుకు సంబంధించిన కొన్ని అంశాలు తాత్కాలికంగా నిలిపివేయబడినప్పటికీ, కార్మికుల సామాజిక భద్రతలను పునరుద్ధరించడానికి, మెరుగుపరచడానికి ఫ్రాన్స్ కార్మిక సంఘాలు తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి.

ఉత్సవం రెండవ రోజున రౌసెల్ ప్రసంగాన్ని వినడానికి 40,000 మందికి పైగా ప్రజలు 'ఏంజెలా డేవిస్ స్టేజ్' వద్ద ఉన్న మైదానంలో గుమిగూడారు. పార్టీ నాయకుల సమక్షం లో ఆయన మ్యాక్రాన్ ప్రభుత్వ సైనిక, ఆర్థిక విధానాలను తీవ్రంగా విమర్శించారు, ఫ్రాన్స్ ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలను జాతీయం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అలాగే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న దేశాలకు ముఖ్యంగా క్యూబా, పాలస్తీనాలకు అంతర్జాతీయ సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు.

పిసిఎఫ్ 40వ కాంగ్రెస్ రూపొందించిన ప్రధాన విధాన పత్రంలోని 'విజయాల కమ్యూనిజం' (communism of conquests) అనే సూత్రం ఆధారంగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి రౌసెల్ నామినేట్ చేయబడ్డారు.ఆయన అభ్యర్థిత్వం పార్టీ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఇది పార్టీ సభ్యులు, శాఖలు, ఎన్నికైన ప్రతినిధులు, మిత్రపక్షాలను ఒక ఉమ్మడి వేదిక, లక్ష్యం వైపు సమీకరించింది. 2022లో ఆయన చేపట్టిన అధ్యక్ష పదవికి పోటీ చేసినపుడు 8,00,000కు పైగా ఓట్లు (2.3%)సాధించారు. 15 ఏళ్ల విరామం తర్వాత పార్టీ స్వతంత్రంగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయటం అదే మొదటిసారి.

అయితే, అధ్యక్ష ఎన్నికల ప్రచారం మాత్రమే పిసిఎఫ్ ఏకైక లక్ష్యం కాదని రౌసెల్ స్పష్టం చేశారు. ఉత్సవ సమయంలోనూ, ఆ తర్వాతి రోజుల్లోనూ మ్యాక్రాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని, దేశ ఇంధన రంగంపై పెరుగుతున్న ఒత్తిడి దృష్ట్యా అత్యవసర పరిస్థితిని ప్రకటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఉత్సవ కార్యక్రమానికి రౌసెల్ ముఖ్య ఆకర్షణగా నిలిచినప్పటికీ, పలువురు ఇతర అధ్యక్ష అభ్యర్థులు, అలాగే తమ అభ్యర్థులను నిలబెట్టాలనుకుంటున్న పార్టీలు కూడా హాజరయ్యాయి. అధ్యక్ష పదవికి నాలుగోసారి పోటీ చేస్తున్న ఎల్‌ఎఫ్‌ఐ నాయకుడు జ్యా లిక్ మెల్షన్ ప్రారంభ రోజున తన ప్రసంగంతో భారీ జనసమూహాన్ని ఆకర్షించారు. ప్రస్తుతం మెల్షన్ ఇతర నయా ఉదారవాద అభ్యర్థుల కంటే స్వల్పంగా ముందంజలో ఉండి, పోల్స్‌లో లీపెన్ తర్వాత రెండవ స్థానంలో ఉన్నారు.

సెంటర్–లెఫ్ట్ అభ్యర్థుల ప్రైమరీని నిర్వహిస్తూ, పోల్స్‌లో రెండంకెల మద్దతు పొందుతున్న పిఎస్ పార్టీ కూడా ఈ ఉత్సవంలో పాల్గొంది. ఈ మూడు రోజుల పాటు ఇఇఎల్‌వి, చిన్న ట్రాట్స్కియిస్ట్ పార్టీల అధ్యక్ష అభ్యర్థులు కూడా హాజరయ్యారు.

ఇంత విస్తృత శ్రేణి రాజకీయ సంస్థల ఉనికి కొన్ని ఘర్షణలకు దారితీసింది. ఎల్‌ఎఫ్‌ఐకి చెందిన కొందరు కార్యకర్తలు పిఎస్ స్టాల్ బయట నిరసన తెలిపారు. మరికొందరు రౌసెల్, పిసిఎఫ్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనిని పిసిఎఫ్ సభ్యులు, కొందరు ముఖ్యమైన ఎల్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు స్వయంగా ఖండించారు.

ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, పిసిఎఫ్, లీ మ్యానిటే, అనేక ప్రముఖ సంగీత బృందాలు ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్యతా సందేశాన్ని ముందుకు తీసుకువెళ్లాయి. ఈ కార్యక్రమాలు ఉత్సవం అంతటా అనేక సమయాల్లో లక్షలాది మందిని ఒకచోట చేర్చాయి. సంగీత కచేరీల సమయంలో, రూసెల్ చొక్కాలు, మెల్షన్ జెర్సీలు ధరించిన వేలాది మంది పాలస్తీనా, కనాకీ జెండాలను ఊపుతూ, 'సియామోటుట్టియాంటిఫాసిస్టి!' (మేమంతా ఫాసిస్ట్ వ్యతిరేకులం!) అని నినాదాలు చేస్తూ ఏకమయ్యారు. ఉమ్మడి కార్మికవర్గ డిమాండ్లను ముందుకు తీసుకెళ్ల డం, ఫాసిస్ట్ మితవాదాన్ని ఓడించడం అనే సందేశంతో జరిగిన ముగింపు కార్యక్రమానికి, ఏంజెలా డేవిస్ వేదిక చుట్టూ లక్షలాది మంది తరలివచ్చారు.

చిన్న చిన్న సందర్భాలలో కూడా ఒక రకమైన ఆశాభావం వెల్లివిరిసింది. రౌసెల్ ప్రసంగిస్తున్నప్పుడు, తల్లిదండ్రులు నినాదాలు చేస్తూ, ఉత్సాహపరుస్తుండగా, పిల్లలు గుంపు లో కలిసి ఆటలు ఆడుకుంటూ పరుగులు పెట్టారు. పైకెత్తిన పిడికిళ్లు, చిరునవ్వులు, కౌగిలింతలు, కరచాలనాల రూపంలో, ఈ సంఘీభావం దేశంలోని ఒక మూల నుంచి మరొక మూలకు, భాషలు, సరిహద్దులు, సముద్రాలను దాటి ప్రయాణించింది. పిసిఎఫ్, లీమ్యానిటే, సిజిటి, ఇతర ప్రగతి శీల శక్తులు వచ్చే ఏడాది ఎన్నికలు, ఆ తర్వాత కాలం వైపు చూస్తున్న తరుణంలో, కార్మికవర్గ ఐక్యత స్ఫూర్తి శాశ్వతంగా నిలిచి ఉంటుందని ఈ ఉత్సవం స్పష్టం చేసింది.

*(సౌజన్యం : పీపుల్స్ వరల్డ్)*





# దేశాన్ని మతం పేరుతో బిజెపి విభజిస్తోంది

● ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంఘ్ పరివార్ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం భారతదేశాన్ని మతం పేరుతో విభజిస్తోందని, గాంధీ పరివార్ మాత్రం భారత ఐక్యతకు కృషి చేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. కేరళ రాజకీయాలకు దేశ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉందని,వాతావరణ నిపుణులు రుతుపవనాల కోసం కేరళ వైపు ఎలా చూస్తారో, దేశ రాజకీయాలను అర్థం చేసుకునే విషయంలోనూ కేరళను ఒక సంకేతంగా చూడవచ్చని అభిప్రాయపడ్డారు. కేరళలో ప్రతిష్ఠాత్మకమైన 'ఆర్యదాన్ ముహమ్మద్2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్''పురస్కారాన్ని కేరళలోని నిలంబూరులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి వేణు గోపాల్ చేతుల మీదుగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అందుకున్నారు. ఈ అవార్డు కింద రూ.లక్ష నగదు, ప్రశంసపత్రం, జ్ఞాపికను సిఎంకు అందజేశారు. కేరళకు చెందిన కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం 'ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్' ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. రైతులు, వెనుకబడిన వర్గాలు, ఇతర సామాజిక వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, సిఎం రేవంత్‌రెడ్డి దూర దృష్టితో కూడిన నాయకత్వాన్ని గుర్తిస్తూ ఆయనకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ వెల్లడించారు. ప్రజాస్వామ్య విలువల పట్ల రేవంత్ రెడ్డి చూపుతున్న నిబద్ధతను కూడా అవార్డు ఎంపిక కమిటీ ప్రశంసించినట్లు వెల్లడించింది. అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 2026 ఎన్నికల్లో కేరళలో కాంగ్రెస్ విజయం సాధించడంతో కొత్త రాజకీయ గాలి మొదలైందని, కేరళ నుంచి మొదలైన ఈ గాలి దేశమంతా తుఫానుగా మారాలని పిలుపునిచ్చారు. ఆర్యదాన్ ముహమ్మద్ తన జీవితాంతం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేశారని గుర్తు చేశారు. స్వేచ్ఛ, లౌకికవాదం, రాజ్యాంగ విలువలను కాపాడటమే ఆర్యదాన్ ముహమ్మద్‌కు నిజమైన నివాళి అని అన్నారు. ఆయన పేరుతో ఏర్పాటు చేసిన అవార్డును తాను అందుకోవడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, ఎన్నికల గుర్తుల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతోందని ఆరోపించారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడే వరకు రాహుల్ గాంధీకి అండగా నిలవాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా, భూమి, భుక్తి, హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం బిసిలు, పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మకు సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని గుర్తుచేశారు. సమ్మక్క–సారలమ్మ, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని వివరించారు. సమాజంలోని ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు, గౌరవం, న్యాయం అందించడమే ఐలమ్మకు నిజమైన నివాళి అని సిఎం తెలిపారు.

# విశ్వవేదికపై విరాజిల్లుతున్న రామప్ప దేవాలయం

● పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/వెంకటపూర్/ములుగు :** కాకతీయుల శిల్పకళా వైభవం, పచ్చని అడవులు, సెలయేళ్లు, జలపాతాలు, గుట్టలు, వాగులతో ప్రకృతి వర్ణశోభకు ములుగు జిల్లా నిలయంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండలం పాలంపేట ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఆవరణలో వరల్డ్ టూరిజం డే–2026ను పురస్కరించుకొని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన హెరిటేజ్ వాక్స్, తెలంగాణ దర్శిని, కాంపిటీషన్స్, కల్చరల్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. గొల్లలగుడి నుంచి రామప్ప దేవాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు, విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పౌర సంబంధాల శాఖ సంస్కృతిక కళాసారధి కళాకారుల బృందం గేయాలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ 13వ శతాబ్దంలో నిర్మితమైన రామప్ప దేవాలయం కాకతీయుల కళా సంపదకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యాటక రంగంలో ములుగు జిల్లాకు పురస్కారం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కాంపిటీషన్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చల్వాయి టిజిఎంఎస్‌కు చెందిన డి.శ్రీజ బృందం ప్రథమ బహుమతి, దేవగిరిపట్నం తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలకు చెందిన ఆర్.శ్రీవల్లి ద్వితీయ బహుమతి, గోవిందరావుపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.మనస్విని, ఎ.శ్రుతి, ఎం.పావలి తృతీయ బహుమతి అందుకున్నారు. మరో విభాగంలో గోవిందరావుపేట ప్రభు త్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.డి. యాస్మిన్ విజేతగా, మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె.దిలీప్ రన్నరప్‌గా నిలిచారు. తాడ్వా యి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన రంజిత్, రుత్విక్ ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి.సంపత్ రావు, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్, స్థానిక సర్పంచ్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రామప్పలో ఘనంగా హెరిటేజ్ వాక్

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వెంకటాపూర్ మండలం పాలంపేటలోని ప్రపంచ వారసత్వ రామప్ప దేవాలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవ రావు, ఎస్‌పి కేకన్ సుధీర్ రామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని డిజిటల్ అజెండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగాన్ని పురర్నిర్మించడం అనే ప్రధాన థీమ్‌తో నిర్వహించారు. రామప్ప ఆలయ చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేస్తూ విద్యార్థులు, అధికారులు, పర్యాటకులు ఉత్సాహంగా హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు.




## సిఇసి పదవికి రాజీనామా చేయాలి

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను నిలిపివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొంటున్నారన్నారు. బిజెపి,ఎన్‌డిఎ ప్రభుత్వ ఆధీనంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలుబొమ్మగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పౌరుల ఓటు హక్కును హరించే హక్కు ఎవరికీ లేదని, ఓటు హక్కు కల్పించే ఎన్నికల సంఘం 'సర్' పేరుతో పౌరుల ఓట్లను హరిస్తోందని కూనంనేని సాంబశివరావు తెలిపారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో ప్రగతిశీల వాదులు, వామపక్షవాదులు పాల్గొని, కేంద్రంలోని బిజెపి, ఎన్‌డిఎ ప్రజావ్యతిరేక విధానాలు, ఎన్నికల కమిషన్ వైఖరిని ఎండగట్టాలన్నారు.

## ఆరోపణలపై దర్యాప్తు జరపాలి

● ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను సిఇసి పదవి నుంచి తొలగించాలని కోరారు. ఎన్నికల సంఘం నియామక ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం సిజెఐను తప్పించి వ్యవస్థను తన ఆధీనంలోకి తీసుకుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల నుంచి పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగిస్తున్నారని చామల ఆరోపించారు. ఫామ్6 ద్వారా ఓట్లను తొలగించి, తిరిగి ఓటు హక్కు కల్పించకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించారన్న ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రక్రియపై కూడా దర్యాప్తు అవసరమన్నారు. హర్యానా ఎన్నికలకు సంబంధించిన సిసిటివి ఫుటేజీని రాహుల్ గాంధీ కోరినా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోని సిసిటివి ఫుటేజీని కనీసం 45 రోజులపాటు భద్రపరచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో లక్షకు పైగా బల్క్ ఓట్ల నమోదుతో పాటు ఫొటోగ్రాఫ్‌ల మార్పుపై ఆరోపణలు ఉన్నాయని, వీటిపైనా సమగ్ర విచారణ జరగాలని చామల కోరారు. సిఇసిని పదవి నుంచి తొలగించాలంటే పార్లమెంట్‌లో అభిశంసన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని చామల పేర్కొన్నారు.

# 'ఎఐ'తో తెలంగాణ పర్యాటకానికి కొత్త రూపు

● శిల్పారామంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

● హాజరుకానున్న సిఎం రేవంత్‌డ్డి, డిప్యూటీ సిఎం భట్టి





**ప్రజాపక్షం/హైదరాబాద్:** కృత్రిమ మేధ (ఎఐ), డిజిటల్ సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుంటూ తెలంగాణ పర్యాటక రంగాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా డిజిటల్ అజెండా–ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం–2026 వేడుకలను శనివారం శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో నిర్వహించనున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రపంచ పర్యాటక దినోత్సవం–2026 ఇతివృత్తం, పర్యాటక రంగంలో ఎఐ, డిజిటల్ సాంకేతికత వినియోగంపై ప్రజెంటేషన్లు నిర్వహించనున్నారు. భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్, పురావస్తు శాఖ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్, సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, ఆర్ట్ గ్యాలరీలు కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నాయి. ''ఎఐ అండ్ డిజిటల్ టెక్నాలజీ–ది ఫ్యూచర్ ఆఫ్ టూరిజం'' అంశంపై తొలి ప్యానెల్ చర్చ జరగనుంది. అనంతరం విద్యార్థులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహిస్తారు. రెండో ప్యానెల్ చర్చలో ఎకో టూరిజం, ఫిల్మ్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, హెరిటేజ్ టూరిజం వంటి విభిన్న రంగాల్లో సాంకేతికతతో వస్తున్న మార్పులు, భవిష్యత్ అవకాశాలపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వ పురావస్తు శాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదరనుంది.

# రాజకీయాలు పక్కన పెట్టి రైతుల కోసం ఆలోచించాలి

● బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునే విధంగా ఆన్ ఆఫ్ పద్ధతిలో కాకుండా 24 గంటల పాటు అన్ని మోటార్లను నడిపి, జలాశయాలను నింపాలని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయాలను పక్కన పెట్టి రైతు ప్రయోజనాల కోసం ఆలోచించాలని, ప్రకృతిపై నెపంనెట్టి రైతులకు సాగు నీళ్లు ఇచ్చే బాధ్యత నుంచి తప్పించుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు శుక్రవారం లేఖ రాశారు. గోదావరిలో భారీ వరద ప్రవాహం ఉన్నప్పటికీ ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగిస్తోందని, నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టులపైన రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుంటే, మరోవైపు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉండగా, మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 13 టిఎంసిలు మాత్రమే ఉన్నదని, మల్లన్న సాగర్ నిండుకుండలా మారితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు, మూసీ ప్రాజెక్టుకు కూడా ఇక్కడి నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుందని మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లో 15 టిఎంసిలకు గాను కేవలం 6 టిఎంసిల నీళ్లే ఉన్నాయని, ఇక్కడికి కూడా ఆ నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎల్లంపల్లిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభిస్తే మిడ్ మానేరు సహా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా పూర్తి పరిష్కారం లభిస్తుందని, రిజర్వాయర్లను నింపడం వల్ల దాదాపు 5 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి దోహదపడుతుందన్నారు. ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్న నేపథ్యంలో అన్ని మోటార్లను నడిపి నీళ్లను లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జలకళతో కనిపించాల్సిన రిజర్వాయర్లు ఎండిపోయి కనిపిస్తున్నాయంటే అందుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్‌రావు ఆరోపించారు.

## సామాజిక న్యాయానికి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తి

ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన నివాళి: మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అణచివేత, దోపిడీ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆయన ఘన నివాళులర్పించారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ ధైర్యంగా పోరాడారని మంత్రి పేర్కొన్నారు. భూమి, భుక్తి, జీవన హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం అణగారిన వర్గాల్లో చైతన్యం నింపిందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం బిసిలు, వెనుకబడిన వర్గాలు, పేదలు, మహిళల సంక్షేమానికి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. బిసి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు గురుకులాలు, హాస్టళ్లలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బిసి మహిళలు, యువతకు ఉపాధి, ఆర్థిక సాధికారత కల్పించే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని పొన్నం ప్రభాకర్ అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం, న్యాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఐలమ్మ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.


## రానున్న రెండు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా రాగల రెండు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల సహా పలు జిల్లాల్లో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. శని, ఆదివారాల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలతో పాటు ఈదురుగాలులు విస్తాయన్నారు. ఆది, సోమవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని, మంగళవారం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయన్నారు.

## ఎన్నికల్లో టిడబ్ల్యుయుకు కాంగ్రెస్ మద్దతు

● ఎన్నికల సమన్వయకర్తగా బొంతు రామ్మోహన్ నియామకం

● పార్టీ శ్రేణులు సహకరించాలని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసిలో అక్టోబర్ 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యుయు)కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఎన్నికల్లో యూనియన్ విజయానికి పార్టీ శ్రేణులు సహకరించాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్, హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో టిడబ్ల్యుయుకు మద్దతు ప్రకటిస్తూ పత్రాన్ని అందజేయడంతో పాటు ఎన్నికల సమన్వయకర్తగా టిపిసిసి ఉపాధ్యక్షుడు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ను నియమిస్తూ మహేశ్ కుమార్ గౌడ్ నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, తెలంగాణ ఆర్‌టిసి మజ్దూర్ యూనియన్ (టిఎంయు) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఇ.అశ్వత్థామరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమంలో కార్మిక సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో టిడబ్ల్యుయుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన జలమండలి యూనియన్ ఎన్నికల్లో సమన్వయ బాధ్యతలు నిర్వహించి విజయాన్ని సాధించిన అనుభవంతో ఆర్‌టిసి ఎన్నికల్లోనూ సమష్టిగా పనిచేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించిన విధంగానే ఆర్‌టిసిలోనూ టిడబ్ల్యుయు విజయభేరి మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టిడబ్ల్యుయుకు తెలంగాణ జన సమితి, సిఐటియు అనుబంధ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఆర్‌టిసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు శంకర్, గోవింద్, రాజలింగం, వి.కె.రెడ్డి, యాదయ్య, చంద్రయ్య, రామ్ చందర్, నారాయణ పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతును బలహీనపర్చే ప్రయత్నమా?

● ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో రాజకీయ జోక్యం ఏమిటి?

● ఎంప్లాయిస్ యూనియన్‌ను అడ్డుకోవాలనే కక్షతో మరో సంఘానికి మద్దతా?

● కార్మిక సంఘాల స్వతంత్రతను దెబ్బతీస్తే తీవ్ర పరిణామాలు: ఎంప్లాయిస్ యూనియన్ హెచ్చరిక





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్‌టిసి)లో అక్టోబర్ 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలు రాజకీయ రంగు పులుముకుంటున్నాయా? కార్మికుల ప్రయోజనాల కోసం జరగాల్సిన ఎన్నికల్లో రాజకీయ జోక్యం పెరుగుతోందన్న ఆరోపణలు ఆర్‌టిసి వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఎంప్లాయిస్ యూనియన్‌ను ఎన్నికల్లో బలహీనపర్చాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కు మద్దతు ఇస్తోందన్న ప్రచారంపై ఎంప్లాయిస్ యూనియన్ నేతలు తీవ్రంగా స్పందించారు. కార్మిక సంఘాల బలాబలాలను నిర్ణయించాల్సింది రాజకీయ పార్టీలు కాదని.. ఆర్‌టిసి కార్మికులేనని వారు స్పష్టం చేశారు. ఒక సంఘాన్ని గెలిపించేందుకు, మరో సంఘాన్ని ఓడించేందుకు ప్రభు త్వం లేదా అధికార పార్టీ ప్రయత్నిస్తే అది కార్మికుల ప్రజాస్వామ్య హక్కుల్లో జోక్యం చేసుకున్నట్లేనని హెచ్చరించారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తమ సంఘం చరిత్రలో భాగమని ఎంప్లాయిస్ యూనియన్ నేతలు తెలిపారు. విలీనం, వేతనాలు, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, బకాయిలు, పని పరిస్థితులు, కార్మిక సంక్షేమం వంటి అంశాల్లో రాజీపడకుండా పోరాడుతున్నామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే సంఘాన్ని బలహీనపరిస్తే రేపు కార్మికుల సమస్యలను ఎవరు ప్రశ్నిస్తారని వారు నిలదీశారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే సంఘం కన్నా.. కార్మికుల తరపున నిలబడి ప్రశ్నించే సంఘం అవసరమని పేర్కొన్నారు.

**డబ్బుతో గెలవలేరు.. హక్కులే ముఖ్యం..**

ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికలను సాధారణ రాజకీయ ఎన్నికల తరహాలో డబ్బులు వెదజల్లి ప్రభావితం చేసి గెలవాలని ఒక యూనియన్ ప్రయత్నిస్తోందన్న ఆరోపణలు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే డబ్బు, ప్రలోభాలకు ఆర్‌టిసి కార్మికులు లొంగబోరని, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం పనిచేసే సంఘానికే తమ ఓటు ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.



**కార్మికులే నిర్ణయించాలి.. రాజకీయ పార్టీలు కాదు..**

గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏ యూనియన్‌కు మద్దతు ఇవ్వాలనే నిర్ణయం పూర్తిగా ఆర్‌టిసి కార్మికులదేనని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా ఉండే సంఘాలను ప్రోత్సహించడం వల్ల భవిష్యత్‌లో కార్మిక సంఘాల స్వతంత్రత ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల్లో రాజకీయ జోక్యం కొనసాగితే కార్మికులు నిశ్శబ్దంగా ఉండబోరని, తమ హక్కుల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక..**

గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏ విధమైన ప్రత్యక్ష, పరోక్ష జోక్యానికైనా ప్రభుత్వం దూరంగా ఉండాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. అధికార బలం, రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఒక సంఘానికి అనుకూల వాతావరణం కల్పించే ప్రయత్నాలు జరిగితే వాటిని కార్మికులు గమనిస్తారని హెచ్చరించింది. ఆర్‌టిసి కార్మికుల హక్కులతో చెలగాటమాడితే సహించేది లేదని, కార్మిక సంఘాల స్వతంత్రతను కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని నాయకులు ప్రకటించారు.

**ఎన్నికలు.. కార్మికుల హక్కులపై తీర్పు..**

అక్టోబర్ 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలను సాధారణ ఎన్నికలుగా చూడలేమని ఎంప్లాయిస్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. రాబోయే కాలంలో కార్మికుల సమస్యలను ఎవరు ప్రాతినిధ్యం వహించాలి? యాజమాన్యాన్ని ఎవరు ప్రశ్నించాలి? ఉద్యోగుల హక్కుల కోసం ఎవరు పోరాడాలి? అనే అంశాలపై కార్మికులు నిర్ణయం తీసుకునే ఎన్నికలుగా అభివర్ణించారు. కార్మికుల హక్కులను కాపాడటమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా కార్మికుల పక్షాన నిలబడతామని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వం కూడా ఎన్నికల ప్రక్రియను పూర్తిగా స్వేచ్ఛ గా, పారదర్శకంగా నిర్వహించి కార్మికులు తమకు నచ్చిన సంఘాన్ని ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా ఎన్నుకునే పరిస్థితి కల్పించాలని డిమాండ్ చేశారు. ఒక సంఘాన్ని గెలిపించడం.. మరో సంఘాన్ని ఓడించడం రాజకీయ పార్టీల పని కాదని, అది ఆర్‌టిసి కార్మికుల నిర్ణయమని ఎంప్లాయిస్ యూనియన్ నేతలు తేల్చిచెప్పారు.

# కరీంనగర్ మార్కెట్ యార్డ్‌కు సర్కారు సహకారం

**మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల, ఎంపి నరేందర్‌రెడ్డికు విజ్ఞప్తి నరసన్న**

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టేలా సహకరిస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావుతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి లను ఆకుల నరసన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ మార్కెట్ కమిటీకి సంబంధించిన వివిధ అంశాలతో పాటు మార్కెట్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వారితో చర్చించారు. మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అవసరమైన సహకారం అందించాలని ఆకుల నరసన్న కోరారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, మార్కెట్ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పడాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం: తుమ్మల**

కరీంనగర్ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం అండగా నిలవాలని కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్నకు సూచించారు. కరీంనగర్ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, మార్కెట్‌ను ఆధునికీకరించేందుకు అవసరమైన నిధుల మంజూరు, రైతులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం తదితర అంశాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో నరసన్న చర్చించారు. రాబోయే ధాన్యం కొనుగోలు సీజన్‌లో పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేపట్టనున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రికి వివరించారు.





కరీంనగర్ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలకు సహకరిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారని నరసన్న తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పడాల అజయ్ పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణే ధ్యేయం: కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూ, స్థానిక యువతకు మెరుగైన ఉపాధి, నైపుణ్య శిక్షణ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలో ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్, ఇండస్ట్రీ, ఎంగేజ్‌మెంట్ అంశంపై వివిధ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేక సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, స్థానిక ఉపాధి ఉద్యోగాలు, అర్హతలు, శిక్షణ, జీతం శ్రేణి, ఆశించిన ఉద్యోగాల గురించి చర్చించారు. విద్యార్థులకు డేటా అనలిస్ట్ ప్లేస్‌మెంట్, శిక్షణ నిరుద్యోగులకు అందించాలని, ఉద్యోగ అవకాశాలు, జీతం, భవిష్యత్ అవకాశాలు, విద్యార్థుల అప్‌స్కిల్లింగ్ అవసరాలపై శిక్షణ పెంపొందించేలా నిరుద్యోగులకు ప్రత్యేక చొరవ కలిగి ఉండేలా టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణను అందించాలని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు సైతం ఉపాధి కల్పించేలా బ్యాంకింగ్ బేసిక్ లెవెల్స్, హెల్త్ కేర్ అసిస్టెంట్, పేషెంట్ కేర్ జాబ్స్, ప్రొడక్ట్ డిజైన్, రిటైల్ మార్కెట్లో సేల్స్ వంటి రంగాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు. బాలికలు, మహిళల కోసం ప్రత్యేక గర్ల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, ప్రమోషన్స్ కల్పించేలా 30 రోజుల స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాలను రూపకల్పన చేయాలని ఆదేశించారు. నియామక డ్రైవ్ నిర్వహించే సాధ్యసాధ్యాలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్,రీజినల్ టాస్క్ సెంటర్ (ఇంచార్జ్) కౌసల్య ,వివిధ కంపెనీల ప్రతినిధులు శ్యామ్,హరిహర్,వంశీ, అర్జున్ ,సంబంధిత,అధికారులు పాల్గొన్నారు.

## నిర్వాసిత గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం: కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/గజ్వేల్:** కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంతో భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. శుక్రవారం నిర్వాసిత ప్రాంతాలను సందర్శించి నుండి సమస్యలు అడిగి తెలుసుకున్న సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆర్ అండ్ ఆర్ కాలనీల సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని, నిర్వాసితులకు సంబంధించిన పరిహారం, పునరావాసం, ప్యాకేజీలు, ఇళ్ల స్థలాలు, ఇతర పెండింగ్ అంశాలపై ప్రభుత్వం దృష్టికి తెస్తామని హామీ ఇచ్చారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వం అందించాల్సిన ప్రయోజనాలు అర్హత మేరకు అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కొండపోచమ్మ సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో చెరువు పక్కన నిర్మాణం చేపడుతున్నారని, చెరువు యొక్క ఎఫ్టీఎల్ బౌండరీలు ఫిక్స్ చెయ్యాలని పేర్కొంటూ దీనికి ఆనుకొని ప్లాట్స్ చెయ్యకూడదని ములుగు తహసిల్దార్ ను ఆదేశించారు. నిర్వాసితుల పునరావాసం కోసం భూ సేకరణ చేసి ఎవ్వరికి కేటాయించకుండా, ఎలాంటి నిర్మాణం చేపట్టని భూములను వెంటనే అధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ, సిద్దిపేట ఆర్డీఓ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ విస్తరణ పనులు పరిశీలించిన కలెక్టర్ గరిమ



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు. పనులు వేగంగా పూర్తి చేసేందుకు కావలసిన సిబ్బందిని నియమించి పూర్తి చేయించాలని సూచించారు. ఈ పరిశీలనలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఈఈ ఆర్ అండ్ బీ భీమ్లా నాయక్, ఆలయ ఈఈ రాజేష్, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాప్, పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల శిక్ష

**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బాలికను కిడ్నాప్,పోక్సో కేసులోని నిందితుడు కొమ్ముగళ్ల బాలకృష్ణ(35) అనే వ్యక్తికి న్యాయస్థానం 20 సంవత్సరాల జైలు శిక్ష తో పాటు 1,05,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం న్యాయమూర్తి వై. జయప్రసాద్ గారు తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో జనవరి27, 2018న కేసు నమోదు చేయడమైనది. ఈ కేసులో దర్యాప్తు అధికారి అప్పటి ఇన్స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి పటిష్టమైన ఛార్జిషీట్‌ను న్యాయస్థానంలో దాఖలు చేయడమైనది. విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మరాములు గారు వాదనలు వినిపించగా, ప్రస్తుత ఇన్స్పెక్టర్ పి. మహేందర్ రెడ్డి , సాక్షాలు నమోదు చేసిన ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి , సీడీఓ బాపురెడ్డి, భరోసా ఇన్చార్జ్ అధికారి ఇన్స్పెక్టర్ బి.దుర్గా, భరోసా లీగల్ అధికారి సౌమ్య, భరోసా సిబ్బంది సమన్వయంతో కేసు విచారణలో సహకారం అందించారని పేర్కొన్నారు. సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన గౌరవ న్యాయస్థానం న్యాయమూర్తి వై. జయ ప్రసాద్ గారు నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల శిక్షతో పాటు 1,05,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన అధికారులను, సిబ్బందిని సిద్దిపేట సిపి రష్మి పెరుమాళ్, ఐపీఎస్ గారు అభినందించారు. సమాజంలో మహిళల భద్రతకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని, నేరస్థులకు శిక్ష పడేలా చేయడంలో రాజీ పడబోమని ఈ సందర్భంగా సిపి స్పష్టం చేశారు.

## సిఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఈనెల 30వ తేదీన బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు రానున్నారని అందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, వివిధ అధికారులతో కలిసి ఆమె జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, సిరిసిల్ల రడుగు బైపాస్ రోడ్ వద్ద ఉన్న మైదానంలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు ట్రాఫిక్, బందోబస్తు, భద్రతా చర్యలు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కె.ఎస్.బి కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గాలివానకు నేలకొరిగిన మక్కజొన్న

**చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతుల ఆవేదన**

**పంట నష్టాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి**



**ప్రజాపక్షం/కొండపాక:** గురువారం సాయంత్రం వీచిన బీభత్సమైన గాలిదుమారానికి చేతికొచ్చిన మక్కజొన్న పంట నేలకొరిగింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండల పరిధిలోని బందారం, దర్గా గ్రామాల్లో ఒక్కసారిగా ఈదురుగాలులు వీయడంతో మక్కజొన్న పంటలు పెద్దఎత్తున నేలమట్టమయ్యాయి. ఇప్పటికే పంట చేతికొచ్చే దశకు చేరుకోవడంతో గాలివాన కారణంగా పంట దెబ్బతినడం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గురువారం సాయంత్రం కొద్దిసేపు గాలి దుమారం బీభత్సం సృష్టించడంతో పంట పొలాల్లోని మక్కజొన్న మొక్కలు పూర్తిగా నేలకొరిగాయి. పంటను కాపాడుకునేందుకు నెలల తరబడి శ్రమించినప్పటికీ, కోతకు ముందే ప్రకృతి వైపరీత్యం రూపంలో నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. కోతకు సిద్ధమైన సమయంలో పంట నేలకొరగడంతో పెట్టుబడులు చేతికందే పరిస్థితి లేదని, ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**గాలివానకు దెబ్బతిన్న పంటలు:** కొండపాక మండలంలో గురువారం కురిసిన భారీ గాలి దుమారానికి నేలకొరిగిన మొక్కజొన్న పంటతో పాటు మొగి పురుగు సోకిన వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి జె.స్వరూపారాణి శుక్రవారం పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి శివ రామకృష్ణతో కలిసి బందారం గ్రామంలో పర్యటించి గాలిదుమారానికి నేలకొరిగిన మొక్కజొన్న పంటలను పరిశీలించి, పంట నష్టం గురించి రైతులను అడిగితెలుసుకున్నారు. అలాగే వరి పంటలో మొగి పురుగు ఉధృతి, పంటపై దాని ప్రభావాన్ని పరిశీలించి రైతులకు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు పంటల్లో కనిపిస్తున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగిన చర్యలు చేపట్టాలని స్వరూపారాణి రైతులకు సూచించారు.

## జిజిహెచ్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ ఏర్పాటు చేయాలి

**ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి యుగంధర్**

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎంఆర్ఐ (ఎమ్ఆర్ఐ) స్కానింగ్ సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్కానింగ్ ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి భావండ్ల పెల్లి పల్లి యుగంధర్ ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు జిల్లాలకు తలమాణికంగా ఉన్న కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మారై స్కానింగ్ అందుబాటులో లేకపోవడం సిగ్గుచేటని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జిల్లా మంత్రులు వెంటనే దీనికి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎంఆర్ఐ స్కానింగ్ అవసరమైన రోగులను ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లకు పంపించాల్సి రావడంతో వారికి అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే స్పందించి కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తి స్థాయి ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేసి, నిరంతరాయంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ఆసుపత్రుల లక్ష్యమని, అందుకనుగుణంగా అవసరమైన ఆధునిక వైద్య సదుపాయాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని భామండ్ల పల్లి యుగంధర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే ఎజెండానా?

**సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య**

**41డివిజన్‌లో సిసి రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి**



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** రామగుండం కార్పొరేషన్‌లో రెండవ సాధారణ సమావేశంలో కాంట్రాక్టుల జేబులు నింపడానికి ఎజెండాను తయారు చేశారని 41వ డివిజన్ సిపిఐ ఫోర్ లీడర్ మార్కపురి సూర్య అన్నారు. శుక్రవారం రోజున సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలోని 41 డివిజన్లో సీసీ రోడ్లో నిర్మించాలని ప్రధాననాల అనేక చోట్ల డామేజ్ కావడం వల్ల ప్రజలకు తీవ్రత దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్న కారణంగా ప్రధాన నాల సర్వే చేయించి ప్యాచ్ వర్క్ రిపేర్ చేయాలని కోరారు.41వ డివిజన్లో ఖాళీ స్థలం 10 గుంటలు ఉన్నందున మహిళా భవన్ నిర్మించాలని కోరారు. అలాగే ఈ ఏజెండా కాంట్రాక్టర్ల జేబులు నింపే ఎజెండా తప్ప ప్రజల కోరిగేది ఏమీ లేదని వారు ధ్వజమెత్తారు. ఈరోజు వన మహోత్సవం పేరిట 64 లక్షల రూపాయలు కేటాయించే ఎజెండాను తాను వ్యతిరేకిస్తున్నానని గతంలో పట్టణ ప్రణాళిక నిధుల నుండి 35 లక్షల రూపాయలు కేటాయించి ఈరోజు చెట్లు మధ్యలో పూర్తిగా ఎండిపోయిన సందర్భంలో మరోసారి 64 లక్షల కేటాయించాల్సిన అవసరం లేదని దుర్వినియోగం జరిగిన 35 లక్షల పై విజిలెన్స్ విచారణ జరిపిన అనంతరమే ఏజెండా ముందుకు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా లైట్లు ఏర్పాటు చేయడానికి 22 లక్షల రూపాయలను కేటాయించడం సమంజసం కాదని అవే డబ్బులో కొత్త లైట్లు వచ్చే అవకాశం ఉందని వాటిపై దృష్టి సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకుడు గుంతల కోసం 60 లక్షల రూపాయల కేటాయించే మున్సిపల్ అధికారులు ఒక్కసారి మున్సిపల్ కార్యాలయం వెనుకకు వెళ్లి చూస్తే రోజు ట్యాంకర్ నీళ్లను వేస్ట్ చేస్తున్నటువంటి పరిస్థితి బయటికి సలహాలు ఇవ్వడం తగ్గించే ముందు మనం పాటించడం నేర్చుకోవాలని హితవ్ పలికారు. ఎజెండాగా పెట్టిన అంశాలను పూర్తి గా వ్యతికేరిస్తున్న అని, పాత విషయాలను ఎజెండగా చేర్చడం వింతగా ఉందని చెప్పి ఆగ్రహం వ్యక్తం చేయదంతో పాటు కార్పోరేటర్లకు మొబైల్ ఇవ్వడానికి తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తున్నానని ఆ 30 లక్షలను రూపాయి అంత్యక్రియలకు వాడితే పేద ప్రజలకు సహకరించిన వాళ్ళమవుతామని సూర్య అన్నారు. కచ్చితంగా వాహనాల కోసం టెక్నికల్ టీం ఏర్పాటు చేసి ఎస్టిమేషన్ వేయించి ప్రతి వాహనాన్ని మళ్ళీ ఉపయోగంలోకి తీసుకురావాలని సూర్య డిమాండ్ చేశారు.మహిళా కార్పొరేటర్కు కలెక్టర్ ఇచ్చిన నోటీసు వెనక్కి తీసుకోవాలని కార్పొరేటర్ అందరం ఐక్యతతో ఆ తీర్మానం రద్దు చేసుకుంటారని, ప్రజా సమస్యలపై పోరాడే వారిని చెప్పు చేతల్లో ఉంచుకోవాలని చూసే అధికారులకు తగిన బుద్ధి చెబుతామని అన్నారు.

## మిడ్ మానేరు నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలి

**కలెక్టర్‌కు సిపిఐ ప్రతినిధి బృందం వినతి**




**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** రాజరాజేశ్వర ప్రాజెక్టులో ముంపుకు గురైన గ్రామాలకు చెందిన నిర్వాసితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని కోరుతూ సిపిఐ నాయకులు అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్‌కు వినతి పత్రం అందజేశారు. కుటుంబ పరిహారం పట్టా ప్యాకెజీ, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఇవ్వాల్సిన ప్యాకేజ్, వృత్తి మార్పిడికి రావాల్సిన ప్యాకేజీ, చుట్టూ ఉన్న భూములకు రావాల్సిన నష్ట పరిహారం తప్పిపోయిన ఇండ్లకు ఇవ్వాల్సిన పరిహారం, యువతీ యువకులకు ఎంప్లాయిమెంట్, ఇండస్ట్రీ ఏర్పాటు తదితర డిమాండ్లు నెరవేర్చాలని ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ముంపు గ్రామాలలో నిర్వాసితులకు పని లేక ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే వారికి ప్రభుత్వం నుండి ప్రైవేట్ లిమిటెడ్ కంపనీలలో ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు.

అన్ని గ్రామాల నిర్వాసితులకు కేటగిరిగా 50 సంవత్సరాలు పైబడిన మహిళలకు పురుషులకు పెన్షన్ ఇప్పించాలని కోరారు. పనులు లేక ప్రజలు పస్తులు ఉంటున్నారని వారిని పట్టించుకున్న పాపాన పోలేదని నాయకులు స్పందించి త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించి సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. నిర్వాసితులకు 18 సంవత్సరాలు పూర్తయినప్పటికీ నష్ట పరిహారం రాక ఆఫీసుల చుట్టూ తిరుగుతూ తిప్పలు పడుతున్నారని అధికారులు దీనిపై దృష్టి సారించి నిర్వాసితులకు రావాల్సిన పరిహారం వెంటనే అందించి ఆదుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో సిపిఐ ప్రతినిధి బృందం గుంటి వేణు, సోమ నాగరాజు, మీసం లక్ష్మ ణ్, రాజు ఉన్నారు.

## కార్పొరేషన్‌లో పైలట్ ఏజెన్సీలను రద్దు చేయాలి

**రిక్షా ర్యాగ్ పిక్కర్లను ఔట్ సోర్సింగ్ వర్కర్లుగా గుర్తించాలి**

**ఎఐటియుసి డిమాండ్**



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత 26 సంవత్సరాలుగా కేవలం రూ.4,000 మ్యాచింగ్ గ్రాంట్ తో రిక్షా ర్యాగ్ పిక్కర్లుగా పనిచేస్తున్న కార్మికులను ఔట్ సోర్సింగ్ వర్కర్లుగా గుర్తించాలని, వారికి కనీస వేతనాలు అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రామగుండం నగర కార్యదర్శి ఎం.ఏ. గౌస్ డిమాండ్ చేశారు.శుక్రవారం గోదావరిఖనిలోని భాస్కర్ రావు భవన్ లో జరిగిన రిక్షా ర్యాగ్ పిక్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రిక్షా ర్యాగ్ పిక్కర్లు అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, ఈ వేతనాలు వారి కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 26 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వీరిని నగర పాలక సంస్థ పైలట్ ఏజెన్సీ పేరుతో తొలగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అణగారిన వర్గాలకు న్యాయం చేయాల్సిన నగర పాలక సంస్థ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడడం సరైంది కాదని, పైలట్ ఏజెన్సీల వల్ల వారి ఉపాధి భద్రతకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.ఔట్ సోర్సింగ్ వర్కర్లుగా గుర్తించకపోవడం వల్ల వారు చట్టపరమైన హక్కులను కోల్పోతున్నారని, కనీస వేతనాలు అమలు కావడం లేదని, పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ సౌకర్యాలు లేవని, దసరా పండుగ అడ్వాన్స్ లేదని, లీవు లు, సిక్ లు లేవని, యూనిఫాం, బెల్లం, సబ్బులు వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా నగర పాలక సంస్థ వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటూ శ్రమ దోపిడీకి గురిచేస్తోందని ఆరోపించారు.నగర పాలక సంస్థ కమిషనర్ కు, గౌరవ మేయర్ కు ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించకుండా, సరైన పరిష్కారం చూపకుండా రిక్షా ర్యాగ్ పిక్కర్ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. శుక్రవారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో కమిషనర్, మేయర్, కార్పొరేటర్లు స్పందించి రిక్షా ర్యాగ్ పిక్కర్లను ఔట్ సోర్సింగ్ వర్కర్లుగా గుర్తిస్తూ తీర్మానం చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రిక్షా ర్యాగ్ పిక్కర్ కార్మికులు పాల్గొన్నారు.

## ఆరేళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**రూ.28 వేల జరిమానా**

**బాధిత కుటుంబానికి రూ.3 లక్షల పరిహారం**

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** నేరస్తుడికి శిక్ష పడినప్పుడే పోలీసులకు అసలైన ఆనందం అని పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లో ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో నిందితుడికి పెద్దపల్లి ప్రత్యేక కోర్టు జీవిత ఖైదు విధించడం పోలీసుల పకడ్బందీ దర్యాప్తుకు నిదర్శనమని ఆయన అన్నారు. 2024 జూన్ 13 రాత్రి జరిగిన ఈ దారుణ ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. ఇంటి వద్ద ఉన్న బాలికను నిందితుడు బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మరుసటి రోజు బాలిక మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో సుల్తానాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న ఏసీపీ గజ్జి కృష్ణ నేతృత్వంలోని దర్యాప్తు బృందం సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, భౌతిక సాక్ష్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను సమగ్రంగా సేకరించింది. ప్రతి ఆధారాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు, కోర్టులో బలమైన సాక్ష్యాలను సమర్పించి నేరాన్ని సందేహాతీతంగా రుజువు చేసింది.దర్యాప్తులో సమర్పించిన పక్కా ఆధారాలను పరిశీలించిన పెద్దపల్లి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె. స్వప్నరాణి నిందితుడికి జీవిత ఖైదు, రూ.28 వేల జరిమానా విధించారు. అలాగే బాధిత బాలిక కుటుంబానికి రూ.3 లక్షల పరిహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు.కేసును అత్యంత నిబద్ధతతో విచారించి నేరస్తుడికి శిక్ష పడేలా కీలక పాత్ర పోషించిన ఏసీపీ గజ్జి కృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్, దర్యాప్తు అధికారులు, పోలీసు సిబ్బందిని డీసీపీ భూక్య రాంరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నేరాల నియంత్రణలో శాస్త్రీయ దర్యాప్తు, పక్కా సాక్ష్యాల సేకరణ, సమర్థవంతమైన కోర్టు వాదనలే విజయానికి మూలమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకేన రవి, సీఐ రంజిత్‌రావు,ప్రవీణ్‌కుమార్,ఎస్సైలు చంద్రకుమార్, అశోక్ రెడ్డి,పోలీసు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మత్తడి దూకుతున్న గన్నేరువరం పెద్ద చెరువు



**ప్రజాపక్షం/ గన్నేరువరం:** గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గన్నేరువరం పెద్ద చెరువు సంపూర్ణంగా నిండి మత్తడి దూకుతోంది. చెరువు నిండి అలుగు పారుతుండడంతో పరిసర ప్రాంతాలు జలకళను సంతరించుకున్నాయి. మత్తడి నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ దృశ్యాన్ని తిలకించేందుకు స్థానికులు, రైతులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. చెరువు నిండడంతో రాబోయే పంట కాలానికి సాగునీటికి ఏలాంటి ఢోకా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిండిన చెరువు ప్రవాహాన్ని వీక్షించేందుకు వచ్చే సందర్శకులు అలుగు ప్రవాహం వద్ద జాగ్రత్తగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

## ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లు ఎత్తే అవకాశం



**ప్రజాపక్షం/హాజీపూర్ :** ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరుగుతున్నందున గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని రామగుండం ఇరిగేషన్ విభాగం నం.7 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రవీంద్ర చారి తెలిపారు. ప్రాజెక్టు దిగువన గల గోదావరి నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వరద నీరు విడుదల చేయనున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల్లోకి పశువుల కాపర్లు, మత్స్యకారులు, రైతులు వెళ్లరాదని హెచ్చరించారు. అదేవిధంగా పశువులు, గొర్రెలను నదీ ప్రవాహ ప్రాంతంలోకి తీసుకెళ్లకుండా గొర్రెల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని పోలీస్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఇరిగేషన్ శాఖకు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రవీంద్ర చారి ఒక ప్రకటనలో కోరారు.

## నిమజ్జన ఘాట్లలో పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ ఆదేశించారు. శుక్రవారం సబ్ కలెక్టర్‌తో కలిసి నిమజ్జనం పా యింట్ ఘాట్‌ను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఘాట్ వద్ద నిపుణులైన ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. నిరంతర విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుధ్యం, బారికేడ్లు, పార్కింగ్ వసతులు సమకూర్చాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండి ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, అధికారులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అమృత్ 2.0 పనులు

అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ప్రజాపక్షం/నస్పూర్ :** ప్రజలకు నిరంతరం శుద్ధమైన తాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ ఆర్‌కె 6 వద్ద నిర్మిస్తున్న వెయ్యి కిలోలీటర్ల సామర్థ్యం గల ఈఎల్ఎస్ఆర్ రిజర్వాయర్, హౌసింగ్ బోర్డు కాలనీలో చేపట్టిన 1,500 కిలోలీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, శ్రామిక బలాన్ని పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం గ్యాస్ వినియోగదారుల ఇ కెవైసి ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఎల్‌పిజి డీలర్లు పాల్గొన్నారు.

## 'ఆల్ఫోర్స్'లో దీన్‌దయాళ్ జయంతి



**ప్రజాపక్షం/భైంసా:** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఆల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు విద్యార్థులు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవిత విశేషాలు, దేశానికి ఆయన అందించిన సేవలు, ప్రజా సంక్షేమం కోసం చేసిన కృషిని తమ మాటల్లో వివరించారు. ఆయన సిద్ధాంతాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## బోర్డు పరీక్షలకు.. ఇప్పటినుంచే సిద్ధం కావాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం /నిర్మల్ టౌన్ :** పదవ తరగతి బోర్డు పరీక్షలకు విద్యార్థులంతా ఇప్పటినుంచే స్పష్టమైన ప్రణాళికలతో సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు.సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవా రం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా అధికారులతో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలించారు.పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారుఉపాధ్యాయు లు,విద్యార్థులందరూ పూర్తి సంఖ్యలో ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విధం గా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు,అందిస్తున్న భోజనం, విద్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.వారికి మెనూ ప్రకారం నాణ్యమైన భో జనం అందిస్తున్నారా, అన్ని వసతులు కల్పిస్తున్నారా అనే వివరాలను అడి గి తెలుసుకున్నారు. ఆయా సబ్జెక్టుల్లో సిలబస్ ఎంతవరకు పూర్తయిందో అడిగారు.విద్యార్థులందరూ బోర్డు పరీక్షలకు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలన్నారు.ప్రతి సబ్జెక్టుకు తగిన సమయం కేటాయించి,ప్రణాళిక ప్రకా రం చదివి, బోర్డు పరీక్షల్లో సత్తా చాటాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. సబ్జెక్టుల్లో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు.బోర్డుపై విద్యార్థులతో గణిత సమస్యలను సాధింపజేశారు. లెక్కలు చేసిన విద్యార్థులను అభినందించి, వారికి పెన్నులను బహుమతులుగా ఇచ్చి వారిలో ఉత్సాహం నింపారు. జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న,తహసిల్దార్ సంతోష్,ఇతర అధికారులు, ఉన్నారు.

# 'నిర్మల్'లో యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా!

● అధికారుల ఉదాసీనతతో పక్కదారి పడుతున్న సహజ వనరులు ● జాతీయ రహదారి పక్కనే ఉన్న చిట్యాల వాగులో పేట్రేగి పోతున్న మాఫియా

**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలో ఇసుక అక్రమ రవాణా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ప్రభుత్వం ఎంతగా ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో నియమావళి కాగితాలకే పరిమితమవుతోంది. జిల్లా కేంద్రానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిట్యాల వాగు ఇసుక అక్రమార్కులకు కాసుల వర్షం కురిపించే కామధేనువుగా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వందల సంఖ్యలో ట్రాక్టర్లు, వాహనాలు వాగులోకి దిగి ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తోడేస్తున్నాయి.

**కళ్లెదుటే దోపిడీ – కరువైన పర్యవేక్షణ :** ఏకంగా జాతీయ రహదారికి కూతవేటు దూరంలోనే ఈ అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతున్నప్పటికీ, సంబంధిత యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణించే ప్రధాన రహదారి పక్కనే ఈ తంతు సాగుతున్నా చూసీచూడనట్టు ఉండటం వెనుక భారీ స్థాయిలో మామూళ్లు నడుస్తున్నాయనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. అధికారుల ఈ ఉదాసీనతను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు లక్షలాది రూపాయల అక్రమ సంపాదనను ఆర్జిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు.గ్రామాల వారీగా అక్రమ డంపింగ్ కేంద్రాలు ఇసుక మాఫియా కేవలం వాగుల నుండి ఇసుకను తోడటంతోనే ఆగడం లేదు. అధికారుల తనిఖీల నుండి తప్పించుకోవడానికి, అలాగే భవిష్యత్తులో కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు విక్రయించడానికి పలు గ్రామాలను అక్రమ నిల్వ కేంద్రాలుగా (డంపింగ్ యార్డులుగా) మార్చేశారు. చిట్యాల వాగు నుండి ఇసుకను తరలించి మంజులాపూర్ చివరి ప్రాంతం, తాంశి, జఫ్రాపూర్, వెంగ్వాపేట్, ఆలూర్ వంటి గ్రామాల్లో పెద్ద ఎత్తున నిల్వ చేస్తున్నారు. పగటిపూట రహస్యంగా నిల్వ చేసి, రాత్రి వేళల్లో అనుకూల సమయం చూసుకుని వివిధ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**ట్రాక్టర్ ట్రిప్పుకు రూ. 10 వేల వరకు వసూలు :** సొంతంగా ఒక చిన్న ఇల్లు నిర్మించుకోవాలని భావించే సామాన్య గృహ నిర్మాణదారులు, పేద ప్రజలు ఇసుక దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అవకాశంగా భావిస్తున్న అక్రమార్కులు సాధారణ ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని విపరీతంగా దోపిడీ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో తక్కువ ధరకు లభించాల్సిన ఒక ట్రాక్టర్ ఇసుకను రూ. 8,000 నుండి రూ. 10,000 వరకు విక్రయిస్తూ అడ్డగోలు లాభాలు గడిస్తున్నారు. రేటు ఎందుకు ఎక్కువ అని అడిగితే మాకు



పైస్థాయి వరకు ఖర్చులు ఉంటాయి అని సమాధానం ఇస్తూ ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు.

**పర్యావరణానికి విఘాతం – అధికారుల స్పందన కరువు :** వాగుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తుండటం వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు, బోర్లు వట్టిపోతుండటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారి తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే చిట్యాల వాగుతో పాటు మంజులాపూర్, తాంశి,జఫ్రాపూర్, వెంగ్వాపేట్,ఆలూర్ గ్రామాల్లో ఉన్న అక్రమ డంపింగ్‌లపై దాడులు చేసి ఇసుకను సీజ్ చేయాలని, ఇసుక మాఫియాపై కఠినమైన పిడి యాక్ట్ కేసులు నమోదు చేయాలని నిర్మల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మెదక్ ఎంపి రఘునందన్ రావు




**ప్రజాపక్షం/మెదక్:** జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఎంపీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి హామీ, గృహ నిర్మాణం తదితర పథకాల పురోగతిని శాఖల వారీగా ఎంపీ సమీక్షించారు. పెండింగ్ పనులకు గల కారణాలను తెలుసుకుని, వచ్చే దిశ సమావేశం నాటికి వాటిని పూర్తి చేయాలని ఆయన సూచించారు.ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పథకాల అమలులో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ కె. హరిత

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** వానాకాలం సీజన్ వరి ధాన్యం కొనుగోలుకు జిల్లాలోని కొనుగోలు కేంద్రాలలో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి వ్యవసాయ, సహకార, ఐకెపి అధికారులు, కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 23,900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశముందని, అక్టోబర్ 1 నాటికి అన్ని కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కేంద్రాల వద్ద తాగునీరు, నీడ, వెలుతురు వంటి మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. ఎత్తైన, చదునైన ప్రదేశాలలో, రవాణాకు అనుకూలంగా ఉండే రహదారుల పక్కనే కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సరిపడా గోనె సంచులు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, డ్రయర్లు, ప్రతి కేంద్రంలో రెండు ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, హమాలీలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. 17 శాతం లోపు తేమ ఉండేలా, తాలు, దుమ్ము లేకుండా ధాన్యం తెచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తూకం పూర్తయిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన మిల్లులకు తరలించాలని, నిల్వకు గోదాములను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర, సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా పౌర సరఫరాల అధికారి వాజీద్, జిల్లా సహకార అధికారి, ఐకెపి ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌తో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతిరోజూ తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో మ్యాపింగ్ కాని వారికి నోటీసులు



జారీ చేసి హియరింగ్ వేగవంతం చేయాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా రీ సర్వే, గ్రామ నక్షాలు, వివిధ రకాల భూముల గుర్తింపును వేగవంతం చేయాలన్నారు. సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, 22ఏ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. కాసిపేట రైతు వేదికలో ఎస్ఐఆర్ 2026 హియరింగ్ ప్రక్రియను, మండల తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో వానర సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సబ్ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ కమిషనర్ రమేష్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు

● ఇద్దరి అరెస్ట్
● సోషల్ మీడియాలో ప్రచారం,వ్యూస్ కోసమే కుట్ర
● వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/మెదక్ :** మావోయిస్టుల పేరుతో తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎర్ర వస్త్రాలు, బెదిరింపు లేఖలు ఉంచిన ఘటనను మెదక్ జిల్లా పోలీసులు ఛేదించారు. నాగులపల్లి గ్రామానికి చెందిన బండ మధు (23), చింతకింది శ్రీధర్ (23)లను అరెస్టు చేశారు. వారి నుంచి బైక్, రెండు మొబైల్ ఫోన్లు, నల్లరంగు రెయిన్‌కోట్, శాలువా, పెన్నులను స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం సోషల్ మీడియాలో ఫాలోవర్లు, వ్యూస్ పెంచుకోవాలనే ఉద్దేశంతో ప్రధాన నిందితుడు మధు ఈ లేఖల వ్యవహారానికి పాల్పడ్డాడు. ప్రస్తుత ఏఐ టెక్నాలజీ సహాయంతో లేఖలను రూపొందించి, వాటిపై 'అలెగ్జాండర్ ఎపిటిఎచ్', 'గణపతి అన్న' పేర్లతో పాటు కొడవలి, సుత్తి గుర్తులను ఉంచినట్లు దర్యాప్తులో తేలింది. సెప్టెంబర్ 21/22 అర్ధరాత్రి మధు, శ్రీధర్ బైక్‌పై తూప్రాన్‌కు చేరుకుని ముందుగా మున్సిపల్ కార్యాలయం వద్ద లేఖతో కూడిన ఎర్ర వస్త్రాన్ని ఏర్పాటు చేశారు. మధు మాస్క్, రెయిన్‌కోట్ ధరించి పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లి లేఖను ఉంచి వీడియో చిత్రీకరించాడు. సిసి కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించిన పోలీసులు సెప్టెంబర్ 24న నాగులపల్లి బ్రిడ్జి వద్ద నిందితులను అరెస్టు చేశారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులు,ఎస్‌పి అభినందించారు.

## ప్రమాదపు అంచున పాఠశాల భవనం

శిథిలావస్థకు చేరిన స్లాబు

**ప్రజాపక్షం/నేరడిగొండ:** మండలంలోని చివరి ఆవాసమైన పీచర గ్రామంలో 35 సంవత్సరాల క్రితం నిర్మించిన గిరిజన ప్రాథమిక పాఠశాల భవనం తీవ్ర శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ కాంక్రీట్ పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడటంతో 20 మంది విద్యార్థులు తీవ్ర భయాందోళనల నడుమ చదువులు కొనసాగించాల్సి వస్తోంది. వర్షాలు కురిసినప్పుడు స్లాబు గుండా నీరు కారడంతో గదుల్లో కూర్చోలేని దయనీయ పరిస్థితి నెలకొంది. దీనికి తోడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం భవన పరిస్థితి కూడా అధ్వానంగా తయారైంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని నూతన పాఠశాల, గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

న్యూ వెల్మల్‌లో 80 శాతం సర్వే పూర్తి

కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** భూముల రీ సర్వే ద్వారా ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.శుక్రవారం సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియపై గ్రామస్తులు, రైతులతో గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో కలెక్టర్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా రీ సర్వే పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియతో భూముల హద్దులు, హక్కులకు సంబంధించి నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. న్యూ వెల్మల్ గ్రామంలో ఇప్పటికే 80 శాతం రీ సర్వే పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా తమ భూముల వద్ద అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని సూచించారు.రీ సర్వేకు రైతులు అందిస్తున్న సహకారాన్ని కలెక్టర్ అభినందించారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలకు రీ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సర్వే పూర్తయ్యే వరకు అధికారులకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ చర్యలు చేపట్టిన కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, తహసీల్దార్ సంతోష్, సర్పంచ్ సాగర్, సంబంధిత అధికారులు ,సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.




# గ్రీన్ ఫీల్డ్ క్రీడా స్టేడియం అధ్వానం

● రూ. కోట్లతో నిర్మించి చేతులు దులుపుకున్న అధికారులు ● అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన స్టేడియం

**ప్రజా పక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలోని మినీ గ్రీన్ ఫీల్డ్ క్రీడా స్టేడియం నిరుపయోగంగా మారింది.కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన స్టేడియం నేడు పిచ్చి మొక్కలు, పగిలిన అద్దాలు, ఊడిపోయిన డోర్లు, గుంతలతో అధ్వాన్నంగా తయారైంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.యువతకు క్రీడల్లో ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఖానాపూర్ లో మినీ స్టేడియం నిర్మించారు.అయితే నిర్మాణం పూర్తయిన కొద్ది రోజులకే నిర్వహణ లేకపోవడంతో స్టేడియం నిరుపయోగంగా మారింది.

**సదుపాయాలు శూన్యం.. పిచ్చి మొక్కలతో అధ్వాన్నం :** స్టేడియంలో ట్రాక్ సరిగా లేకపోవడం, గ్రౌండ్ అంతా గుంతలమయంగా మారడం, తాగునీటి సౌకర్యం లేకపోవడం, మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉండటం, లైటింగ్ సౌకర్యం లేకపోవడంతో క్రీడాకారులు ప్రాక్టీస్ చేయలేని పరిస్థితి నెలకొంది.ఇండోర్ స్టేడియంలో ఉన్న కరెంట్ మీ టర్ ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చే శారు. ఫ్యాన్లు, బల్బులను సైతం దొంగిలించా రు. గ్లాస్ డోర్లు పగలగొట్టి, కార్పెట్‌ను కూడా ఎత్తుకెళ్లారు. ఊరికి దూరంగా ఉండటం,సీసీ కె మెరాలు,వాచ్ మెన్ లేకపోవడంతో కోట్ల రూపాయలతో నిర్మించిన స్టేడియం అధ్వాన్నంగా తయారైంది.



**స్పందించని అధికార యంత్రాంగం :** ఈ విషయంపై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపిన పట్టించుకున్న నాథుడే లేడని క్రీడాకారులు, యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఖానాపూర్ నియోజకవర్గంలో ఎంతో మంది జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులు ఉన్నా వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు సీసీ కె మెరాలు ఏర్పాటు చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

## అట్టహాసంగా గణేష్ శోభాయాత్ర

ప్రత్యేక పూజలు చేసిన అధికారులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, పుర ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ ఉమారాణి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో దుబ్బ ప్రాంతంలోని సార్వజనిక్ గణేష్ మండలి వద్దకు ప్రజాప్రతినిధులు, అధికారులు చేరుకుని వినాయక నిమజ్జన శోభాయాత్ర రథం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. గణేష్ నిమజ్జనోత్సవాన్ని ఆనందోత్సాహాల నడుమ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఈ శోభాయాత్రకు ఆటంకాలు కలగకుండా జిల్లా యం త్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. శోభాయాత్ర సందర్భంగా సు మారు రెండు రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ సాయిచైతన్య తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులున్నారు.



## లడ్డూ వేలంలో మతసామరస్యం

### రూ.20 వేలతో లడ్డూ దక్కించుకున్న ముస్లిం దంపతులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**తొమ్మిది రోజులు విశిష్ట పూజలు అందుకున్న వినాయకుని లడ్డూ వేలంపాటలో మతసామరస్యం వెల్లువిరిసింది. గురువారం హనుమాన్‌నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం కమిటీ, హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటకు విశేష స్పందన లభించింది.వేలంలో తొలి లడ్డూను ఎస్కే బాజీరజియా దంపతులు రూ.20 వేలకు, రెండో లడ్డూను ఎస్కే నాగూర్ దంపతులు రూ.10 వేలకు దక్కించుకున్నారు. గణనాథుడికి పూజలు అందుకున్న లడ్డూలను ముస్లిం కుటుంబాలు భక్తితో వేలంలో దక్కించుకోవడం మతసామరస్యం, సోదరభావానికి ప్రతీకగా నిలిచింది.వేలంలో పాల్గొని ఉత్సవాలకు సహకరించిన విజేతలను ఆలయ కమిటీ, హనుమాన్ యూత్ సభ్యులు అభినందించారు. నిత్య అన్న ప్రసాద వితరణకు సహకరించిన దాతలు, భక్తులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు, కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



**ప్రజాపక్షం/పెనుబల్లి:**మండల పరిధి లోని రామచంద్రరావు బంజరలోని సానిక వెంకటేశ్వరరావు ఇల్లు గురువారం అర్ధ రాత్రి కాలిపోయింది. కొత్త ఇళ్లు నిర్మించుకునేందుకు కలప తో కిటికీలు, దర్వాజాలు తయారు చేయించి సిద్ధంగా కాలిపోయిన ఇంట్లో నిల్వ ఉన్నాయి. జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయాయని బాధితుడు తెలిపాడు. అవి కాకుండా ఇంట్లో ఉన్న అన్ని సామాన్లు కాలిపోయాయని ఆస్తి నష్టం నాలుగు లక్షల రూపాయల వరకు ఉంటుందని తెలిపాడు.

## ఎఐటియుసి నేత కిషోర్ మృతి

### నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/చింతకాని:** చింతకాని మండలం మత్కేపల్లి గ్రామానికి చెందిన బంధం కిషోర్(52) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మత్కేపల్లి చేరుకుని కిషోర్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం చేసే పోరాటంలో కిషోర్ ముందుండేవాడని సామాజిక దృక్పదం కలిగిన వ్యక్తి అన్నారు. కిషోర్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి దూసరిగోపాలరావు, గీతపనివారల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బందం నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు బండి పుల్లారావు, నర్సిరెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.
ఫోటో ఉంది : 25పీహెచ్ : 05. దృశ్యం...

## నైపుణ్యాలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు :ఎమ్మెల్సీ తాతా



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆత్మవిశ్వాసం పెంపొందించుకున్నప్పుడే పోటీ ప్రపంచంలో యువత రాణించగలదని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్సి తాతా మధుసూదన్ తెలిపారు. ఖమ్మం నగరంలోని విట్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అధినేత కోడి రెక్క ఉమాశంకర్ ఆధ్వర్యంలో సమర్థానం ఎన్‌జివో, ప్రముఖ ఐటి సంస్థ ఒరాకిల్ సహకారంతో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన సర్టిఫికెట్స్ ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎంఎల్సి తాతామధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా స్వయం సంవృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలుసు మురళీకృష్ణ, లింగనబోయిన సతీష్, పగడాల నరేందర్, చీకటి రాంబాబు పాల్గొన్నారు.

## రేబీస్ వ్యాధిపై అవగాహన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రేబీస్ వ్యాధి నివారణకై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి డా॥ ఎ. అరుణాదేవి, జిల్లా సైకియాట్రిస్టు డా॥ ఎండి సోహెల్ తెలిపారు. మూగ జనుల వారోత్సవాలు, రేబీస్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూగ జనులను సమాజంలో చిన్నచూపు చూడకుండా వాటికి ప్రోత్సాహం అందించాలన్నారు. రేబీస్ వ్యాధి సోకే విధానం, దాని లక్షణాలు, కుక్కకాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స, యాంటీ రేబీస్ వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు.ఈ కార్యక్రమంలో సమన్వయ అధికారి ఎన్. సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమన్నారాయణ, కెవిస్ చారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉద్యమ గడ్డపై 'చీలికల' చికాకు!

• నిబద్ధత చూపని విద్యార్థి సంఘాలు • పదవి పోతే ప్రత్యేక సంఘం పుట్టినట్లే • కృత్రిమ ఆందోళనలను ప్రోత్సహిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు




**ప్రజాపక్షం/ఖమ్మం:** ఖమ్మం విద్యార్థి ఉద్యమాల గుమ్మం. నికరంగా నిలబడి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ఖమ్మం జిల్లాలోని వామపక్ష విద్యార్థి సంఘాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వామపక్ష విద్యార్థి సంఘాలు మాత్రమే అని ఎందుకు పేర్కొనాల్సి వచ్చిందంటే ఎన్ఎస్‌యుఐకి నామ మాత్రపు ఉనికి మాత్రమే ఉండేది. మిగిలిన సంఘాలు క్రియాశీలకంగా లేవు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు సంఘాలు మాత్రమే అత్యంత క్రియాశీలకంగా పనిచేశాయి. కేవలం విద్యారంగ సమస్యలే కాకుండా సామాజిక సమస్యలపైన పోరాడి ఆదర్శంగా నిలిచారు. ఖమ్మంలో పిజి కళాశాల సాధనోద్యం చారిత్రాత్మకం. విద్యార్థి సంఘాల నేతలకు సమస్యల పట్ల , జాతీయ, అంతర్జాతీయ పరిణామాలుపై అవగాహన, క్రమశిక్షణ అన్నింటికి మించి పోరాడేతత్వం ఉండేది. అందుకే విద్యార్థి దశ తర్వాత అనేక మంది రాజకీయ నాయకులుగా, ఉన్నత విద్యావంతులుగా, మేధావులుగా, ప్రజాప్రతినిధులుగా కీర్తి గడించారు. ఎక్కడ ఏ పార్టీలో ఉన్న విద్యార్థి దశలో చూపిన ఉద్యమ స్ఫూర్తిని ఇప్పటికీ చాటుతున్నారు. కొద్ది మంది పేర్లు ఉదాహరించి అనేక మందిని ప్రస్తావించకపోవడం సరైంది కాదు. అటువంటి నేలన విద్యార్థి ఉద్యమం గాడి తప్పింది.

**ప్రైవేటుతో బంధనాలు:**ప్రభుత్వ విద్య అటుగంటి ప్రైవేటు విద్య మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుండడంతో విద్యార్థి సంఘాల కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రైవేటు విద్యా సంస్థల్లో వచ్చిన పోటీ కారణంగా విద్య కోసం ఒత్తిడితో పాటు నిర్బంధం పెరిగింది. చదువు, చదువు అన్న సూచన తప్ప మరొకటి లేకపోవడంతో నేటి తరం విద్యార్థులు సామాజిక స్పృహను కోల్పోతున్నారు. కుటుంబ విషయాలే పట్టని వీరి నుంచి సామాజిక అవగాహన ఆశించడం సరైంది కాదేమో. ప్రైవేటు విద్య పెరిగిన తర్వాత విద్యార్థి ఉద్యమాలకు భారీ నష్టంతో పాటు విద్యార్థి సంఘాల నేతలకు చిన్న మేలు జరిగింది. భారీ నష్టం ఏమిటంటే విద్య వ్యాపారమైంది. దీనితో పాటు పెట్టబడి పెరిగింది. పెట్టుబడి లాభాలను కోరుకుంటుంది కాబట్టి ప్రైవేటు విద్యా సంస్థలు ర్యాంకులు, ఫలితాలను చూపి లాభాలను రాబట్టే ప్రయత్నంలో ఉన్నాయి. దీనితో విద్యార్థులపై ఒత్తిడి పెంచి ఓ తరాన్ని సామాజిక అవగాహనకు దూరం చేస్తున్నారు. పసి మెదళ్లలోకి అనవసర విషయాలను చొప్పిస్తున్నారు. ఇంత హానీ చేస్తున్న ప్రైవేటు విద్య విద్యార్థి సంఘాల నాయకులు చిన్న మేలు చేస్తుంది. గతంలో పెద్ద పెద్ద విద్యార్థి సంఘాలే చిన్న కరపత్రం వేయాలంటే అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే వారు. వామపక్ష అభిమానులైన బోధనా సిబ్బంది, ఇతరులు చేయూతనిస్తే తప్ప కరపత్రం విడుదలయ్యేది కాదు. కానీ ఇప్పుడు ప్రైవేటు విద్యా సంస్థలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తమ అక్రమాల వైపు విద్యార్థి సంఘాలు కన్నెత్తి చూడకుండా సంఘాల నేతలకు చందాల పేరుతో ఎర వేస్తున్నారు. కొందరు విద్యార్థి సంఘాల నేతలకు ప్రైవేటు విద్యా సంస్థలు ఆదాయ వనరులుగా మారాయి. ఆదాయం సమకూరడంతో నాయకుల్లో విపరీత ధోరణులు పెరిగి నాయకత్వం మన చే దాటితే బతకలేమన్న స్థితికి వచ్చేశారు. అంతే కాదు గతంలో మాదిరి విద్యార్థుల సమీకరణలో ఇబ్బందులు లేకపోవడం, అడిగితే ప్రైవేటు విద్యా సంస్థలే తమ వాహనాల్లో తమకు అనుకూలమైన సంఘాలకు విద్యార్థులను పంపుతుండడంతో శ్రమ తగ్గింది. విద్యార్థులతో కలిసి పనిచేయాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇప్పుడు నాయకత్వం ఎటు చూసినా ఇబ్బందులు లేనిదిగా తయారైంది.

**పదవి పోతే కొత్త సంఘం పుట్టినట్లే :**అన్ని సందర్భాల్లో ఇలా జరుగుతుందని అనలేము కానీ ఏళ్ల తరబడి విద్యార్థి సంఘాల నేతలుగా ఉన్న వారిని కదిలిస్తే చాలు బయటకు వెళ్లి మరో సంఘంలోకి చేరడమో, ఒక అక్షరం అటో ఇటో మార్చి కొత్త సంఘాన్ని ఏర్పాటు చేయడమో చేస్తున్నారు. వామపక్షాల మధ్య తీవ్రమైన పోటీ, రాజకీయ స్పర్థలు ఉన్న రోజుల్లో కూడా వామపక్ష విద్యార్థి సంఘాలు బలమైన ఐక్య ఉద్యమాలు నిర్వహించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉద్యమాలు ఉండేవి. ఇప్పటి విద్యార్థి సంఘాల నేతల్లో అంకిత భావం కొరవడటం, పోరాట తత్వం బలపడకపోవడంతో బలమైన విద్యార్థి ఉద్యమాలు పురుడుపోసుకోవడం లేదు. ఇదే సమయంలో ఒకరిపై ఒకరు పై చేయి సాధించేందుకు ప్రైవేటు విద్యా సంస్థలు కృత్రిమ ఆందోళనలను సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇది కూడా విద్యార్థి ఉద్యమాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటి విద్యార్థి సంఘాల నేతలు విద్యార్థి ఉద్యమం ద్వారా ప్రజా ఉద్యమాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రయత్నం చేయడం లేదన్న ఆవేదన చాలా మందిలో ఉంది. ఈ జిల్లాలో విద్యార్థి ఉద్యమాల ద్వారా ఉన్నత స్థితికి చేరుకున్న అనేక మందిని ఆదర్శంగా తీసుకోవాలన్న సూచన వినపడుతుంది. ఇప్పుడు విద్యారంగం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది. ఒక పక్క విద్య ప్రైవేటీకరణ, కాషాయికరణ వేగంగా జరుగుతుంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. రిటైర్‌మెంట్లు తప్ప రిక్రూట్‌మెంట్లు లేవు. పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. ఇటువంటి స్థితిలో బలమైన విద్యార్థి ఉద్యమ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయడంతో పాటు విద్యార్థి ఉద్యమాల ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగేందుకు నేటి నాయకులు పని చేయాల్సి ఉంది.

## రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యం

• ప్రమాదాల నివారణకు ప్రణాళికలు • రోడ్డు భద్రతపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ రూపొందించి రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం సమస్యలను గుర్తించడమే కాకుండా వాటికి శాశ్వత పరిష్కారాలు చూపేల అధికారులు బాధ్యతా యుతంగా పనిచేయాలన్నారు. బ్లాక్ స్పాట్లలో రంబుల్ స్ట్రిప్స్, జీబ్రా క్రాసింగ్, బ్లింకర్లు, రోడ్డు స్టడ్స్, హెచ్చరిక బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. భద్రతా చర్యలకు ముందు పనులు పూర్తయిన తర్వాత ఫోటోలతో కూడిన సమగ్ర నివేదిక సమర్పించాలని, సామగ్రి కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు రోడ్డు మార్కింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు రెండు చోట్ల కొత్తగా సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ ఆర్ గార్డెన్స్ పరిసరాల్లో ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలని సూచించారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్‌కు సంబంధించిన రహదారి వివరాలను, సమస్య ఉన్న ప్రాంతాల ఫోటోలను, గుర్తించిన లోపాలను, అవసరమైన సిఫారసులను పొందుపరిచి సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు, ఇతర భద్రతా సమస్యలను పోలీస్ శాఖ క్షేత్ర స్థాయిలో గుర్తించి వాటికి పరిష్కార మార్గాలను ప్రతిపాదించాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. బెంగళూరు, ఇతర నగరాల్లో అమలు చేస్తున్న పార్కింగ్ విధానాలను పరిశీలించి ఖమ్మం నగరంలోని ముఖ్యమైన ప్రా ంతాల్లో కూడా అటువంటి పార్కింగ్ వి ధానాన్ని అమలు చేయాలని సూచించారు. నిర్ణయించిన పార్కింగ్ ప్రాంతాలకు వెలుపల వాహనాలు నిలిపితే వాటిని తొలగించేవిధంగా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి రామానుజం, ఆర్అండ్‌బి ఎస్ఈ యుగంధర్‌రావు, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, డిటివో జగదీష్, ఎన్‌హెచ్ఏఐ పిడి దివ్య పాల్గొన్నారు.

## పాలేరు వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలి

### చెరువులకు మళ్లిస్తూ నీటి నిల్వలు పెంచాలి: కలెక్టర్ దివాకర ఆదేశం



**ప్రజాపక్షం/కూసుమంచి:**పాలేరు జలాశయానికి వస్తున్న వరద నీటిని వృథా కాకుండా జిల్లాలోని చెరువులకు మళ్లించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం పాలేరు జలాశయాన్ని పరిశీలించిన ఆయన నీటి మట్టం, కాలువల ద్వారా విడుదలవుతున్న ప్రవాహం, అలుగు వద్ద పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వర్షాలతో జిల్లాలోని పలు చెరువుల్లో 25 నుంచి 30శాతం వరకు నీటి నిల్వలు చేరాయని తెలిపారు. సాగర్ ఎడమ కాలువ, పాలేరు పాతకాలువ, భక్త రామదాసు, మంచుకొండ ఎత్తిపోతల పథకాలతో పాటు ఇతర నీటి వనరుల ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తరలించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని రిజర్వాయర్లు, చెరువుల నీటిని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అల్పపీడనం నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి జేసీబీలు, పునరావాస కేంద్రాలు, అత్యవసర సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. వర్షాలు, వరద పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రెండు రోజుల వర్షాలతో పత్తి, మిర్చి, వరి రైతులకు ఉపశమనం లభించిందని కలెక్టర్ తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా రాబోయే సంవత్సరాల్లో పంటల వైవిధ్యీకరణపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం కామంచికల్, కొంగర, ఈశ్వరమాధారం గ్రామాల్లో భూ రీ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక పరికరాలతో జరుగుతున్న డిజిటల్ సర్వేను రైతుల సమక్షంలో పరిశీలించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. పర్యటనలో అసిస్టెంట్ ట్రైనీ పరాస్ కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వేయర్ ఏడీ రాజేందర్, డీఈఈ రమేశ్‌రెడ్డి, తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, వినేంద్రర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగడి సరుకుగా ధృవీకరణ పత్రాలు

• అక్రమార్కులపై చర్యలేవి...? • యథేచ్ఛగా పింఛన్ పొందుతున్న అనర్హులు • అధికారులపైన విచారణ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అంగడి సరుకుగా ప్రభుత్వం జారీ చేసే ధృవపత్రాలు మారాయి. కాసులుంటే దేనినైనా కొనుగోలు చేయవచ్చునని కొందరు అవినీతి అధికారులు రుజువు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం పైబడి వైకల్యం ఉన్న వారికి నెలకు రూ.4,016 పింఛన్ ఇస్తుంది. కొందరు అక్రమార్కులు అడ్డదారిలో పింఛన్ పొందెందుకు సదరం ద్వారా ధృవీకరణ పొందుతున్నారు. బోనకల్ మండలంలో కొందరు పైరవీకారులు ఎటువంటి వైకల్యం లేని వారి నుంచి రూ.30 వేల నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేసి ఖమ్మం సదరం క్యాంపుల ద్వారా 40 శాతానికి పైబడి వైకల్యం ఉన్నట్లు ధృవీకరణ పత్రాలను అందిస్తున్నారు. దీనితో బోనకల్ మండలంలో పైరవీకారుల జోరు కొనసాగుతుంది. ఎటువంటి వైకల్యం లేకుండానే నెలకు రూ.4, 016 పింఛన్ వస్తుండడంతో సామాన్యులు ఈ పైరవీకారులకు పెద్ద మొత్తంలో ముట్ట జెప్పుతున్నారు.

## సంఘం బలోపేతానికి సహకరించాలి

• సకాలంలో రుణాలు చెల్లించాలి • మహాజన సభలో ఛైర్మన్ రావూరి సైదుబాబు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:**తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సహకార సంఘం బలోపేతానికి సహకరించాలని వి. వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ రావూరి సైదుబాబు తెలిపారు. శుక్రవారం వి. వెంకటాయపాలెం సొసైటీలో ఛైర్మన్ రావూరి సైదుబాబు అధ్యక్షతన 64వ మహాజన సభ నిర్వహించారు. ఈ సభలో డిసిసిబి ఏబి మార్గ్ బ్రాంచ్ మేనేజర్ ఇందు, వైస్ ఛైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, కాకతీయ కో ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ అధ్యాపకులు రాజయ్య, అసిస్టెంట్ డిసివో మై కుమారి, క్లస్టర్ సూపర్‌వైజర్ రాయపూడి శ్రీనివాస్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఛైర్మన్ సైదుబాబు మాట్లాడుతూ రైతులు, సభ్యుల సహకారంతో సొసైటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సొసైటీలో సేవలు అందిస్తున్నట్లు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అతిథులు మాట్లాడుతూ రైతుల ఐక్యత, సభ్యుల భాగస్వామ్యంతోనే సంఘాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. రుణమాఫీ కోసం చూస్తూ చెల్లింపుల్లో జాప్యం చేయవద్దని సూచించారు. ప్రభుత్వం నిర్ణయం మేరకే రుణమాఫీ ప్రయోజనం అందుతుందన్నారు. పంట రుణాలను సకాలంలో చెల్లిస్తే మూడు శాతం వడ్డీ రాయితీ ప్రయోజనం పొందవచ్చునన్నారు. సహకారం అంటే ఒక వ్యక్తి ఒంటరిగా చేయలేని పనిని అందరూ కలిసి సాధించడమేనన్నారు. ద్రాక్ష పండ్లు గుత్తుగా ఉన్నప్పుడే దానికి ప్రత్యేకత ఉంటుందని ఉదాహరించారు. మహజన సభకు సభ్యుల హాజరు శాతం పెరగాలన్నారు. వైస్ ఛైర్మన్ శ్రీనివాసరావు బంగారు రుణాలకు సంబంధించి వడ్డీ శాతాన్ని తగ్గించే అవకాశాలను పరిశీలించాలని బ్యాంకు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు ఎం. నాగేశ్వరరావు, జి. ఆదినారాయణ, ఎం. సింహాద్రి, జి. ముత్తిలింగం,జి. సుగుణ, జే. అనిత, బి. రామారావు, టి. బాసు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్య

• గోదావరిలో ఘనంగా నిమజ్జనోత్సవాలు • పోటెత్తిన భక్తులు, పోలీసుల చర్యలు



**ప్రజాపక్షం/భద్రాచలం:** నవరాత్రుల పాటూ పూజలందుకున్న గణనాధులు ఎట్ట కేలకు గంగమ్మ ఒడికి చేరుతున్నారు. ఈ సందర్భంగా భద్రాచల పావన గోదావరి తీరంలో నిమజ్జనోత్సవాల సందండి మొదలైంది. రాష్ట్ర నలుమూలల నుండి గోదావరి తీరానికి పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు చేరుకున్నాయి. స్వామిని గోదావరిలో నిమజ్జనం చేస్తూ జై బోలో మహారాజ్‌కి జై ..., వెళ్లి రావయ్యా బొజ్జగణపయ్య అంటూ భక్తిభావంతో నమస్కారాలు సమర్పిస్తున్నారు. గోదావరిలో వరదనీరు ఎక్కువగా ఉండటంతో ప్రత్యేక లాంచీలు ఏర్పాటు చేసిన క్రైన్‌ల సహకారంలో విగ్రహాలను లాంచీపైకి ఎక్కించి ప్రత్యేక పూజల నడుమ పసుపు కుంకుమ నూనత వస్త్రాలు నవధాన్యాలు నదీమతల్లి ఒడిలో వదులుతూ స్వామిని గోదావరి మధ్యలో నిమజ్జనం చేస్తున్నారు. ఇందు కోసం పోలీసులు గట్టి బందో బస్తు నిర్వహిస్తున్నారు. నిమజ్జన సిబ్బందితో పాటు లాంచీల నిర్వాహకులకు లైఫ్ జాకెట్లు అందజేశారు. భక్తులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా ముందుస్తుగానే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా ఉండేందుకు ఎస్‌పి రోహిత్ రాజ్ నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఒకేసారి కరకట్టపైకి వాహనాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ క్రమ సంఖ్యలో విడిచిపెడుతున్నారు. నిమజ్జనాల అనంతరం వాహనాలు బయటకు వెళ్లే క్రమంతో పాటు పార్కింగ్ ప్రదేశాల్లో నిఘా పెట్టారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఇప్పటికే హెచ్చరించిన పోలీసులు నివారణ చర్యల్లో భాగంగా డ్రంగ్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఓ ప్రక్క వర్షపు చినుకులతో వాతవారణ చిత్తడిగా మారడంతో నదీ తీరంలో జారిపోకుండా గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. నదివద్ద గజీత గాళ్లను సిద్ధం చేసిన అధికారులు మైక్‌ల ద్వారా ప్రమాదాల నివారణ కోసం ప్రచారం సాగిస్తున్నారు. మెడికల్ క్యాంపు, ఫైర్ సిబ్బంది క్షేత్రస్థాయిలో విధి నిర్వహిస్తున్నారు. మరో ప్రక్క గోదావరికి వరద తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ ఆదేశాలు జారీ చేశారు.

## విద్యార్థినుల భవిష్యత్తే లక్ష్యం

### ఎమ్మెల్యే మట్టా రాగమయి



**ప్రజాపక్షం/పెనుబల్లి:**విద్యార్థినుల భవిష్యత్తే లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మండల పరిధిలోని ఉప్పల చిలకలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాల, కళాశాలను శుక్రవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి విద్యార్థినులతో ఆప్యాయంగా మమేకమై, వారితో కొంతసేపు గడిపారు. హాస్టల్ గదులు, తరగతి గదులు, హాస్టల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం అందుతున్నదా? ఆహారం నాణ్యత ఎలా ఉంది? అనే అంశాలను స్వయంగా పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థినుల మధ్య కూర్చొని కొంతసేపు పాఠాలు విన్న ఎమ్మెల్యే ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థినులతో ప్రశ్నలు అడిగి, వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. డిజిటల్ తరగతులను విద్యార్థినులతో కలిసి వీక్షిస్తూ, వారి అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు వారితోనే తరగతి చెప్పించారు. హాస్టల్ ప్రాంగణంలో చెత్త పేరుకుపోకుండా, నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థినులు ఫుడ్ మరియు కాస్మోటిక్ చార్జీలను పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థినులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థిని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ప్రోత్సహించారు.

### ఒక ప్రధాని జెన్‌జీకి ఓటుహక్కు కల్పిస్తే...

# మరో పిఎం లాక్కుంటున్నారు!

- మోదీపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ :** ఎస్ఐఆర్ ప్రక్రియపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఒక ప్రధాని (రాజీవ్ గాంధీని ఉద్దేశించి) జెన్‌జీకి ఓటు హక్కు ఇచ్చారని, మరొకరు (మోదీ) దానిని లాక్కోవాలని చూస్తున్నారని మండిపడింది. యువత ఆశలను, ఆకాంక్షలను దెబ్బతీసి వారికి భయపడే ప్రధాని నరేంద్ర మోదీ అని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. 'ఇది ఇద్దరు ప్రధానుల కథ. ఒక ప్రధాని (రాజీవ్ గాంధీ) 1988 డిసెంబరులో జరిగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 326ను సవరించి ఓటు హక్కు కనీస వయసును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. ఆయన యువతకు సాధికారత కల్పించిన ప్రధాని. మరో ప్రధాని (నరేంద్ర మోదీని ఉద్దేశించి) జెన్‌జీ ఓటర్లు నమోదు కాకుండా ఉండేందుకు 2024 నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలను (ఎస్ఎస్ఆర్) నిలిపివేశారు. ఈ ప్రధాని యువత ఆశలు, ఆకాంక్షలను నాశనం చేశామని భయపడుతున్నారు. ఒక ప్రధాని జెన్‌జీకి ఓటు హక్కు ఇచ్చారు. మరొకరు అక్రమ మార్గాల ద్వారా ఆ ఓటు హక్కును లాక్కోవాలని నిశ్చయించుకున్నారు' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. అంతకుముందు గురువారం కూడా నరేంద్ర మోదీపై జైరాం రమేశ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అవమానానికి గురైన ప్రధాని మోదీ జెన్‌జీ ఓటర్ల పేర్లు ఓటరు జాబితాలో లేకుండా చూసేందుకు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. జెన్‌జీ వీధుల్లోకి వచ్చి మోదీని ఎగతాళి చేశారని అన్నారు. అందుకే వారిని ఓటరు జాబితాలో లేకుండా చేసేందుకు సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ నియమించారని విమర్శించారు. ఏటా ఓటర్ల జాబితాను సవరించే ప్రత్యేక సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)ను నిలిపివేశారని అన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన జెన్‌జీ యువతను కొత్త ఓటర్లుగా చేర్చడానికి ఇదొక మార్గమని చెప్పారు. ఎస్ఎస్ఆర్‌ను పునఃప్రారంభించాలని మిగతా ఇద్దరు ఇసిలు గట్టిగా కోరుతున్నప్పటికీ, మోదీపై యువతలో అసంతృప్తి స్పష్టమైనప్పటి నుంచి గత రెండేళ్లుగా ఎలాంటి సవరణ జరగలేదని మండిపడ్డారు.

### పేపర్ లీక్ కేసుల్లో నిందితుల స్థిర, చరాస్తుల జప్తు పిటిషన్‌పై...

# ఆరువారాల తర్వాత విచారణ

- సుప్రీంకోర్టు వెల్లడి



**న్యూఢిల్లీ :** పరీక్షాపత్రాల లీక్ కేసుల్లో నిందితులు, వారి కుటుంబ సభ్యుల స్థిర, చరాస్తులను జప్తు చేయాలని దాఖలైన పిటిషన్‌పై ఆరువారాల తర్వాత విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు శుక్రవారం తెలిపింది. ఈ విషయం న్యాయమూర్తులు జస్టిస్ పిఎస్.నరసింహా, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఆగస్టు 18న న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందనలను సుప్రీంకోర్టు కోరింది. మనందరం వాదనలు దాఖలు చేయాల్సి ఉంటుంది. కాబట్టి వాదనలను పూర్తి కానివ్వండి' అని కేంద్రం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యాభాటి శుక్రవారం ధర్మాసనానికి తెలిపారు. ఈ పిటిషన్‌లో అన్ని రాష్ట్రాలను కూడా ప్రతివాదులుగా చేర్చారని ఆమె వివరించారు. ప్రతివాదులు తమ కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ధర్మాసనం కోరినందున, ఈ విషయంపై విచారణను ఆరు వారాల తర్వాతకు వాయిదా వేయబడింది. ఆగస్టు 18న విచారణ సందర్భంగా, ప్రశ్నపత్రాల నిరోధక చట్టాలను కఠినతరం చేసే పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు–2026 ఆమోదం పొందినందున, ప్రశ్నపత్రాల లీక్ కేసులలో కాలపరిమితితో కూడిన దర్యాప్తు, విచారణను నిర్ధారించే చర్యలను కోరుతూ తాను చేసిన అభ్యర్థనను ముందుకు తీసుకెళ్లడం లేదని ఉపాధ్యాయ్ సమర్పించారు. న్యాయవాది అశ్వినికుమార్ దూబే దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, నిందితులు, వారి కుటుంబ సభ్యుల మొత్తం ఆస్తిని అంచనా వేయడానికి చర్యలు తీసుకోవాలని, తదనుగుణంగా అవినీతి నిరోధక చట్టం, మనీ లాండరింగ్ నిరోధక చట్టంతో సహా చట్టాలలోని తగిన నిబంధనలను అమలు చేయాలని కూడా ఆదేశాలు కోరారు. 'భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా నివారించడానికి, పేపర్ లీక్‌లో శిక్ష ఏకకాలంలో కాకుండా, వరుసగా అమలు చేయాలని ఆదేశించి, ప్రకటించండి. ప్రత్యామ్నాయంగా, అంతర్జాతీయ పద్ధతులను పరిశీలించి, మూడు నెలల్లోగా పేపర్ లీక్‌పై ఒక నివేదికను తయారు చేయాలని లా కమిషన్‌ను ఆదేశించండి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. పేపర్ లీకులకు బాధ్యులైన వారిని నివారించడంలో, దర్యాప్తు చేయడంలో, ప్రాసిక్యూట్ చేయడంలో అధికారులు పదేపదే విఫలం అవడం, రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 16, 19, 21 కింద విద్యార్థుల ప్రాథమిక హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడానికి దారితీసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. పేపర్ లీక్‌లవల్ల విద్యార్థులు, వారి కుటుంబాలపై పడే తీవ్రమైన ప్రభావాన్ని ఈ పిటిషన్ ప్రధానంగా ప్రస్తావించింది. దీనివల్ల కలిగే మానసిక, శారీరక క్షోభ, విద్యా, ఉపాధి అవకాశాల నష్టం, చెల్లించని రుణాల వల్ల పెరిగిపోతున్న ఆర్థిక భారం, విదార్థుల ఆత్మహత్యల కేసులు పెరగడం వంటి అంశాలను ఎత్తి చూపింది.

# 'సర్'లో అక్రమాలపై ఆధారాలున్నాయ్

- దేశంలో 13 కోట్ల మంది పేర్లను తొలగించారు
- సాకులు చెప్పడం బిజెపి మానుకోవాలి : ప్రియాంక గాంధీ




**వయనాడ్:** ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వివాదం చెలరేగిన నేపథ్యంలో, కేరళలోని వయనాడ్ కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ శుక్రవారం బిజెపిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎస్ఐఆర్ చేపట్టి దేశంలో 13 కోట్ల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ఆమె ఆరోపించారు. తన సోదరుడు రాహుల్ గాంధీ ఇందుకు సంబంధించిన ఆధారాలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచారన్నారు. ఈ విషయంపై అధికార బిజెపి ఇచ్చిన వివరణలను ఆమె తోసిపుచ్చారు. ఈ సమస్యను కేవలం ఒక రాజకీయ ఆరోపణగా కొట్టిపారేయలేమని అన్నారు. 'క్షమించండి. ఇది చాలా పాతబడిన, బలహీనమైన వాదన. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న దానికి ఆధారాలు ఉన్నాయి. నా సోదరుడు చాలా విలేకరుల సమావేశాల్లో వాటిని చూపించారు. ప్రజల ముందు ఆ ఆధారాలను ఉంచారు. ఇప్పుడు ఆ విషయం స్పష్టమైంది. దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలిగించారు. దీనిపై బిజెపి కుంటిసాకులు చెప్పడం మానేయాలి' అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. 'ఎన్నికల ప్రక్రియలో ఏ రకమైన జోక్యం చేసుకున్నా, అది ప్రజాస్వామ్యపరంగా, రాజ్యాంగపరంగా తీవ్రమైన నేరం అవుతుంది. వారు (బిజెపి) మన ఎన్నికల్లో జోక్యం చేసుకుంటుంటే, వారి నాయకత్వం ఎన్నికల సంఘం చేత ఇలా చేయిస్తుంటే, అది దేశద్రోహ చర్య అవుతుంది. వారు ఈ విషయాన్ని గ్రహించాలి. అలాగే వారు ఆ బాధ్యతను తీసుకోవాలి. ఒకవేళ వారు ఎలా చేయకపోతే ఎందుకు బహిరంగంగా చెప్పలేకపోతున్నారు. దేనికి వాళ్లు భయపడుతున్నారు?' అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. అంతే కాదు ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే పద్ధతి చాలా కాలంగా కొనసాగుతోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. 'వారు ఎన్నికలను రిగ్గింగ్ చేయడం మొదలు పెట్టిన ఎన్ని ఏళ్లు అయ్యింది?' అని నిలదీశారు. ఎస్ఐఆర్, ఎన్నికల సంఘం పనితీరుపై రాజకీయ ఘర్షణలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఆమె ఈ ఘాటు విమర్శలు చేయడం గమనార్హం.

# జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో గందరగోళం

- పూర్తి రాష్ట్ర హోదాను తక్షణమే పునరుద్ధరించాలని తీర్మానం ప్రవేశపెట్టిన సిఎం ఒమర్ అబ్దుల్లా
- అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం



**శ్రీనగర్:** కేంద్రపాలిత ప్రాంతానికి పూర్తి రాష్ట్ర హోదాను తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శుక్రవారం అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష బిజెపి సభ్యులు వెలలోకి దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అధికార నేషనల్ కాన్ఫరెన్స్ శాసన సభ్యులు, బిజెపి సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యేలు తమ తమ సీట్లలోకి తిరిగి వెళ్లాలని స్పీకర్ అబ్దుల్ రహీం రథర్ చేసిన విజ్ఞప్తిని వారు పట్టించుకోకపోవడంతో, ఆయన సభను 30 నిమిషాల పాటు వాయిదా వేశారు. బిజెపికి చెందిన విక్రమ్ రంధావా గందరగోళం సృష్టించడంతో అతడిని మార్షలకు బయటకు పంపించారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రంగా ఉన్నప్పుడు, జూన్ 2000లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వయంప్రతిపత్తి తీర్మానాన్ని ఈ తీర్మానంలో ప్రస్తావించడంతో బిజెపి ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ఈ తీర్మానంలో '2000 జూన్ 26, 2024 నవంబర్ 6 తేదీలలో ఈ సభ ఆమోదించిన తీర్మానాలకు అదనంగా, జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదాను తక్షణమే, అత్యవసరంగా పునరుద్ధరించాలని ఈ సభ భారత ప్రభుత్వాన్ని కోరుతోంది. ఈ తీర్మానాన్ని భారత ప్రభుత్వానికి పంపాలని తీర్మానిస్తోంది' అని ఉంది. ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని ఎన్‌సిపి ప్రభుత్వం, 1953 ఆగస్టు 9కి ముందు ఉన్నటువంటి అధిక స్వయంప్రతిపత్తిని పునరుద్ధరించాలని కోరుతూ 2000 జూన్ 26న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 2024 నవంబర్ 6న, ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని కోరుతూ ఈ సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ముఖ్యమంత్రి ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టిన వెంటనే, అధికార పక్షం సభ్యులు బల్లలు చరుస్తూ దానికి స్వాగతం పలికారు. అయితే, 2000 నాటి తీర్మానాన్ని ప్రస్తావించడం బిజెపి సభ్యుల నుంచి నిరసనలకు దారితీసింది. సభలో స్వయంప్రతిపత్తి అంశంపై చర్చను అనుమతించము అని బిజెపి ఎమ్మెల్యే ఆర్.ఎస్. పఠానియా అన్నారు. సభలో గందరగోళం కొనసాగుతుండటంతో పలువురు ఎమ్మెల్యేలు ఒకరితో ఒకరు తీవ్ర వాగ్వాదానికి దిగారు.

# అనుమానాలు నివృత్తి చేయాలి

- ఎన్నికల సంఘానికి లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ విజ్ఞప్తి

**పాట్నా :** ఏ వ్యక్తి లేదా వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు తలెత్తితే వాటిని నివృత్తి చేయాల్సిందేనని ఎన్‌డిఎలో భాగస్వామ్య పక్షంగా ఉన్న లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్) ప్రక్రియపై ఎన్నికల సంఘం (ఇసి)లో విభేదాల వచ్చినట్లు వార్తల నేపథ్యంలో ఆయన స్పందించారు. ప్రజల మనసుల్లో ఏర్పడిన అనుమానాలను నివృత్తి చేయాలని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఎన్నికల సంఘాన్ని కోరారు. ప్రభుత్వంలో ఒక భాగంగా ఉంటూ రాజ్యాంగబద్ధమైన సంస్థను సమర్థించాలనే ఉద్దేశం తనకు లేదని', అలాగే రాహుల్ గాంధీ వంటి ప్రతిపక్ష నాయకులు చేసిన ఆరోపణలకు తాను పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. అయితే, 'ఒకవేళ ప్రజలు ఎన్నికల వ్యవస్థపై నమ్మకం కోల్పోవడం ప్రారంభిస్తే, అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. కాబట్టి, ఎన్నికల సంఘం తన వివరణను మరింత గట్టిగా ప్రజల ముందు ఉంచాలని నేను భావిస్తున్నాను. రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు చెప్పే వాటికి అది స్పందించాల్సిన అవసరం లేదు, కానీ ప్రజల మనసుల్లో ఉన్న అనుమానాలను మాత్రం తప్పక తొలగించాలి' అని అన్నారు. కాగా, ఎన్నికల సంఘాన్ని బిజెపి దూకుడుగా సమర్థిస్తుండగా, పాశ్వాన్ మాత్రం కొంత సంయమనంతో కూడిన స్పందనను వ్యక్తం చేయడం గమనార్హం. బిజెపి వైఖరి ప్రతిపక్షాలకు మరింత ఆగ్రహం తెప్పించింది. ఎన్డీయేలో కీలక భాగస్వామి అయిన బిజెపికి అనుకూలంగా ఉండేలా సర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని వారు ఆరోపించేలా ఇది ప్రేరేపించింది. గత ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రారంభమై, ఆ తర్వాత దశలవారీగా దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ భారీ ప్రక్రియలో 10 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు జాబితాల నుండి తొలగించబడినట్లు సమాచారం.

### ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై...

# భారత్–ఆస్ట్రేలియా కృషి చేస్తున్నాయ్

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్



**న్యూఢిల్లీ :** ఇరుదేశాల మధ్య వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్–ఆస్ట్రేలియా ఒక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం, ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (బిఐటి)పై పనిచేస్తున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. శుక్రవారం ఆస్ట్రేలియాలో జరిగిన ఐసిఏఐ తొలి ఓషియానియా అంతర్జాతీయ సదస్సు–2026లో ప్రసంగిస్తూ, విద్య, కీలక ఖనిజాలు వంటి రంగాలలో ఇరు దేశాలు సహకారాన్ని పెంపొందించుకోవచ్చని మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఈ రెండు దేశాలు 2022లో ఆర్థిక సహకార, వాణిజ్య ఒప్పందాన్ని (ఇసిటిఏ) అమలు చేశాయి. ఇప్పుడు ఈ ఒప్పందం పరిధిని సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంగా (సిఇసిఏ) విస్తరించడానికి చర్చలు జరుపుతున్నాయి. 'ఇప్పుడు మేం చాలా సమతుల్యమైన, న్యాయమైన, సమానమైన, సమగ్రమైన ఆర్థిక సహకార ఒప్పందం దిశగా పనిచేయాలని నిర్ణయించుకున్నాం. ఇది మా సంబంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం కోసం కూడా మేం ఆస్ట్రేలియాతో కలిసి పనిచేస్తున్నాం' అని గోయల్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాలు ఇతర దేశాలలోని పెట్టుబడులకు రక్షణ కల్పిస్తాయని, అవి ఇరువైపులా పెట్టుబడులను ప్రోత్సహించడంలో కూడా సహాయపడతాయని వివరించారు.'ఆస్ట్రేలియా, భారతదేశాలను ఒక విశ్వసనీయ భాగస్వామ్యంగా చూడాలని మేము చూస్తున్నాం. మనమిద్దరం ఒకరికొకరం పూరకంగా ఉంటాం.ఆస్ట్రేలియా వద్ద కీలకమైన ఖనిజాలు ఉన్నాయి. మనకు తయారీ, ప్రాసెసింగ్ రంగాలలో ఆశయాలు ఉన్నాయి. ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాలు, మన యువ ప్రతిభ ఒకదానికొకటి పూరకంగా ఉంటాయి. ఆస్ట్రేలియా దీర్ఘకాలిక పెట్టుబడి, మన వృద్ధి కాంక్ష ఒకదానికొకటి తోడ్పడతాయి' అని పియూష్ గోయల్ చెప్పారు.'అనేక సేవా సంస్థలు, ముఖ్యంగా ఐటి కంపెనీలు ఎదుర్కొంటున్న సరిహద్దుల మధ్య పన్నుల సమస్యను కూడా మేము పరిష్కరించాం. వ్యాపారులు, పౌరులపై నిబంధనల పాటింపు భారాన్ని తగ్గించే ప్రయత్నంలో భాగంగా, ఒకరి నిబంధనలను మరొకరు గౌరవించడంపై కూడా మేం మరింతగా దృష్టి సారించాం' అని మంత్రి వెల్లడించారు.ఐసిఏఐ సభ్యులు కేవలం మూలధన సంరక్షకులుగా ఉండటం నుంచి ఆవిష్కరణలు, సుస్థిర సంస్థల రూపకర్తలుగా మారాలని, పునరుత్పాదకత ఇంధన సాంకేతికతలో కొత్త అవకాశాలను సృష్టించడానికి , కీలక ఖనిజాల విషయంలో ఒకరికొకరు మద్దతు ఇచ్చుకోవడానికి భారత్–ఆస్ట్రేలియా రాయబారులుగా వ్యవహరించాలని కోరారు.

### ఛత్తీస్‌గఢ్‌లో రోడ్డు ప్రమాదం...

# లారీ ఢీకొని ఆరుగురు మృతి

**ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లాలో శుక్రవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. నేషనల్ హైవే30పై మార్కటోలా ఘాట్ వద్ద కబీర్‌ధామ్ జిల్లాకు చెందిన 'ధుమాల్' మ్యూజిక్ బ్యాండ సభ్యులు ప్రయాణిస్తున్న మినీ వాహనం మొరాయించడంతో వారు రోడ్డు పక్కన ఆగాయి ఇదే సమయంలో రాయ్‌పూర్ నుంచి జగ్దల్‌పూర్ వైపు గోధుమలతో వెళ్తున్న 16 చక్రాల భారీ లారీ దాన్ని వెనుక నుంచి వేగంగా ఢీకొనడంతో సుమారు 30 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లబడిన మినీ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంపై పడిన గోధుమల బస్తాల కింద చిక్కుకుని ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు ధమ్తరీ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మరో ఏడుగురు బాధితులను మెరుగైన వైద్యం కోసం రాయ్‌పూర్‌కు తరలించగా, ప్రమాదం తర్వాత లారీ డ్రైవర్ పరారయ్యాడు.

### ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని భావిస్తే

# ప్రతిపక్ష పార్టీలు పోటీ చేయొద్దు


- సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సూచన
- తమ రాజకీయ అంతానికి దారితీస్తుందనే భయంతోనే పోటీ చేస్తున్నాయని ఆరోపణ



**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) విషయంలో ఎన్నికల సంఘంలో విభేదాలు తలెత్తాయన్న వార్తల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనను అరెస్టు చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) కూడా తీవ్రస్థాయిలో స్పందించింది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్ష పార్టీలు భావిస్తే, ఇకపై ఎన్నికలలో పాల్గొనడం మానుకోవాలని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతండడం వాస్తవమేనని, అలాంటి ప్రక్రియలో ప్రతిపక్ష పార్టీలు పాల్గొనడం వల్ల అవి స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతున్నాయనే భ్రమలు ప్రజల్లో కలుగుతున్నాయని దీప్కే చెప్పారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్ష పార్టీలు పదే పదే ఆరోస్తున్నాయని, అలాంటప్పుడు ఎన్నికల్లో పోటీ చేయడం దేనికని ప్రశ్నించారు. ఎన్నికలకు దూరంగా ఉండటం తమ రాజకీయ అంతానికి దారితీస్తుందనే భయంతోనే ప్రతిపక్ష పార్టీలు పాల్గొనడం కొనసాగిస్తున్నాయా సిజెపి వ్యవస్థాపకుడు ప్రశ్నించారు. ఓట్ల దొంగతనం, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపిలను ప్రలోభపెడుతుంటే, పార్టీలు చీలిపోతుంటే ఇకా ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారా అని నిలదీశారు. 'ఇది రాజకీయ మనుగడ కాదు. మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు మిమ్మల్ని బలహీనపరచగల, మీ పార్టీని చీల్చగల లేదా మీ ఎన్నికైన ప్రతినిధులను తీసివేయగల వ్యవస్థలో మీరు కేవలం జీవించి ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా మీరు ఎంతకాలం మనుగడ సాగించగలరు? అని దీప్కే ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు ముఖ్యమైన రాష్ట్రాల్లో రిగ్గింగ్ జరిగినప్పుడు మాత్రమే దాని గురించి మాట్లాడడం, ఇతర చోట్ల జరిగినప్పుడు మౌనంగా ఉండడం మంచిదికాదన్నారు. ఎన్నికలలో రిగ్గింగ్ జరుగుతుంటే, అది ఏ రాష్ట్రంలో లేదా ఏ పార్టీ ప్రభావితమైందనే దానితో సంబంధం లేకుండా స్పందించాలని దీప్కే సూచించారు. తమ రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజాస్వామ్యానికే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. 'మీ సొంత రాజకీయ మనుగడ గురించి ఆలోచించే ముందు, దేశం గురించి, ప్రజాస్వామ్యం గురించి ఆలోచించండి. ఒక దృఢమైన వైఖరిని తీసుకోండి, మోసపూరిత ఎన్నికలలో పాల్గొనడం మానుకోండి' అని అన్నారు. 'ఫిక్స్‌డ్ మ్యాచ్‌లో లాగే, ప్రతీ క్యాచ్‌ను వదిలేయరు. కొన్ని క్యాచ్‌లు పడతారు, హోరాహోరీగా సాగుతున్నట్లు చూపించడానికి మ్యాచ్‌ను చివరి ఓవర్ వరకు కూడా సాగదీయవచ్చు' అని ఆయన అన్నారు. 'అదే విధంగా, మీరు పోటీలో కొనసాగడానికి, నిజమైన పోటీ జరిగిందని ప్రజలు నమ్మేలా చేయడానికి సరిపడా కొన్ని విజయాలను మీకు అందిస్తారు. ఆ కొన్ని విజయాలే మిమ్మల్ని ఆటలో నిలబెట్టి, మొత్తం వ్యవహారాన్ని చట్టబద్ధంగా కనిపించేలా చేసే ముక్కలు' అని దీప్కే అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, తన డిమాండ్ నెరవేర్చకపోతే 'జంతర్ మంతర్ 2.0' ఆందోళన చేపడతామని సిజెపి వ్యవస్థాపకుడు గురువారం హెచ్చరించారు.

# యుపిఐ 'ఎండిఆర్'పై ఎలాంటి బాహ్య ఒత్తిడిలేదు

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** రూ.2వేలు పైబడిన నిర్దిష్ట యుపిఐ లావాదేవీలపై 0.4శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండిఆర్) విధించాలన్న నిర్ణయం బాహ్య ఒత్తిడితో తీసుకున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణలు 'పూర్తిగా నిరాధారమైనవి'అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ఇది చెల్లింపుల వ్యవస్థ తీసుకున్న వృత్తిపరమైన నిర్ణయమని ఆమె స్పష్ట ంచేశారు. శుక్రవారం ఆమె ఇక్కడ 'పిటిఐ'తో మాట్లాడుతూ ఈ నిర్ణయం పూర్తిగా వృత్తి పరమైనదని చెప్పారు. దీనిని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ), పేమెంట్ బ్యాంకులు, మర్చంట్ బ్యాంకులు సంయుక్తంగా తీసుకున్నాయని ప్రభుత్వం దీనిని బలవంతంగా రుద్దలేదని స్పష్టీకరించారు. ప్రభుత్వం విదేశీ ఒత్తిడులకు లొంగిపోయిందన్న ప్రతిపక్షాల ఆరోపణలను నిర్మలా సీతారామన్ కొట్టిపారేశారు. ఎండిఆర్ పన్ను కాదని, దానివల్ల ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని మంత్రి తెలిపారు.యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యుపిఐ) ఎండిఆర్‌పై నిర్ణయం బాహ్య ఒత్తిడితో, ముఖ్యంగా అమెరికా ఒత్తిడితో తీసుకున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణల గురించి ఆమెను ప్రశ్నించగా, 'ఇది పూర్తిగా నిరాధారమైనది' అని 'నేను దీనిని పూర్తిగా ఖండిస్తున్నాను' అని నిర్మలా సీతారామన్ సమాధానం ఇచ్చారు. ప్రతిపక్షం విషయాన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండా సమస్యల కోసం వెతుకుతూ ఆరోపణలు చేస్తోందని ఆర్థిక మంత్రి అన్నారు. ఇది వినియోగదారులపై విధించే పన్ను అని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తోసిపుచ్చుతూ సీతారామన్ ఇలా అన్నారు. 'ఇది పన్ను కాదు, సెస్ కాదు, ఇది సర్‌చార్జ్ కూడా కాదు. దీని వసూళ్లు భారత సంఘటిత నిధికి చేరడం లేదు' అని మంత్రి వివరించారు. వసూలు చేసిన మొత్తాన్ని యుపిఐ ఎకోసిస్టమ్‌లోని బ్యాంకులు, ఇతర సంస్థల మధ్య పంచుతారు. వసూలు చేసిన ఎండిఆర్‌లో 40శాతం కస్టమర్ల బ్యాంకులకు, 30శాతం గేట్‌వేలకు, 20శాతం యుపిఐ యాప్‌కు, మిగిలిన 10శాతం యుపిఐ యాప్ స్పాన్సరింగ్ బ్యాంక్‌కు వెళ్తుందని వివరించారు. అక్టోబరు 15నుంచి రూ.2,000 పైబడిన వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే యుపిఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండిఆర్ వర్తిస్తుంది. ఈ ఛార్జీని వినియోగదారులు కాకుండా వ్యాపారులే చెల్లించాలి. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు ఇది రూ.300కు పరిమితం చేయబడుతుంది. వ్యక్తుల మధ్య చెల్లింపులతో పాటు విస్తృతమైన రోజువారీ వ్యాపార చెల్లింపులలో అధిక శాతం ఉచితంగానే ఉంటాయి. యుపిఐ ప్లాట్‌ఫారమ్‌ను నిర్వహిస్తున్న ఎన్‌పిసిఐ, డిపాజిట్ చెల్లింపుల పర్యావరణ వ్యవస్థను సృష్టించే లక్ష్యంతో సెప్టెంబరు 15న కొన్ని యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్‌నేఉ విధిస్తూ ఒక సర్క్యులర్ ను జారీ చేసింది.

### ఢిల్లీలో ప్రముఖ నేతల

# 'సర్' వెరిఫికేషన్ పూర్తి

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో 'సర్' ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న బిజెపి అగ్రనేత ఎల్‌కె అద్వానీ, ఢిల్లీ సిఎం రేఖా గుప్తా, విదేశాంగ మంత్రి జైశంకర్ సహా ఇతర ప్రముఖుల వివరాలను క్షేత్రస్థాయిలో పత్రాల పరిశీలన అనంతరం ధ్రువీకరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ నోటీసులతో ఎవరి ఓటును కూడా తొలగించలేదని, వీళ్ల పేర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చడానికి రిజర్వ్ చేసినట్లు వెల్లడించారు. నవంబర్ 4న ఓటర్ల తుది జాబితాను అధికారికంగా ప్రచురించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) సహా ఎన్నికల అధికారుల బృందాలు గత కొన్ని రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నోటీసులు అందుకున్న ఓవర్ల వివరాలు సేకరించారు. వారి నుంచి అభ్యంతరాలపై ఎన్నికల సంఘం నిర్దేశించిన పత్రాలను సేకరించి వివరాలను సరిపోల్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని ప్రముఖులతోపాటుగా సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న అనేక మంది ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, ఈ అభ్యంతరాల స్వీకరణకు ఢిల్లీలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 605 మంది అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను (ఎఇఆర్ఒ) నియమించినట్లు అధికారులు వెల్లడించారు. 'నోటీసులు, దావా, అభ్యంతరాలను ఎటువంటి జాప్యం లేకుండా పరిష్కరించేందుకు, ఇప్పటికే పనిచేస్తున్న 297 మంది ఎఇఆర్ఒలతో పాటు అదనంగా మరో 605 మంది ఎఇఆర్ఒలను నియమించాం' అని ఢిల్లీ సిఇఒ కార్యాలయం ఇప్పటికే ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఇసి ఆగస్టు 31న ముసాయిదా జాబితా ప్రచురించింది. ఈ ముసాయిదా ఓటర్ల జాబితాలో 97 లక్షల మందికి పైగా ఓటర్లు ఉండగా, అందులో సుమారు 33.13 లక్షల మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇందులో న్యాయవ్యవస్థ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అత్యున్నత పదవులను కలిగి ఉన్నవారు, కళలు, సంస్కృతి, జర్నలిజం, క్రీడలు, ప్రజా సేవలు మొదలైన రంగాలకు చెందిన ప్రముఖుల పేర్లు లేకపోవడంతో వారికి అధికారులు నోటీసులు చేశారు. 2002 ఓటర్ల జాబితాతో వీళ్ల పేర్లు 'అన్‌మ్యాప్‌డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' అని పేర్కొంటూ, ఎన్నికల అధికారులు ఈ నోటీసులు ఇచ్చారు. అయితే ఈ జాబితాలో మాజీ ఉప ప్రధాని ఎల్‌కె అద్వానీ, కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య పేర్లు ఉండడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రముఖులు కొత్త ఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటర్లే కావం గమనార్హం.

**ST.PETER'S INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES (Autonomous)**
VIDYANAGAR, HANUMAKONDA, TELANGANA – 506001
www.stpeters.co.in, Email: spipswgl@gmail.com, Mobile: 9000001196

**NOTIFICATION FOR ADMISSIONS UNDER "CATEGORY-B" - 2026-27**

Applications are invited from eligible candidates into the following courses under **"Category B"** seats for the academic year 2026-27.

| Course | Total Intake | "B" Category |
|---|---|---|
| M.Pharmacy – Pharmaceutics | 15 | 04 |
| M.Pharmacy – Pharmacy Practice | 15 | 04 |
| Pharm.D. (Post Bac) | 10 | 03 |
| B.Pharmacy | 100 | 30 |
| Pharm.D. | 30 | 09 |

Applications can be obtained from the college or downloaded from the college website. Filled in applications should be submitted on or before 25-09-2026. Eligibility & admission procedure is as per the guidelines issued by **Govt. of Telangana**.

*Correspondent*

# క్రెమ్లిన్ ఆధిపత్యం మరింత బలోపేతం

- రష్యా పార్లమెంటరీ ఎన్నికల పూర్తి ఫలితాలు విడుదల



**మాస్కో:** రష్యా అధికారులు దేశంలో యుద్ధకాలంలో జరిగిన తొలి పార్లమెంటరీ ఎన్నికల పూర్తి ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ ఫలితాలు క్రెమ్లిన్ రాజకీయ ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేశాయి. మూడు రోజుల పాటు జరిగిన పోలింగ్ ఆదివారం ముగిసింది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ఫలితాల ప్రకారం, క్రెమ్లిన్‌కు ప్రధాన రాజకీయ మద్దతుదారైన 'యునైటెడ్ రష్యా పార్టీ' దిగువ సభ 'స్టేట్ డూమా'లో మూడు వంతులకు పైగా స్థానాలను గెలుచుకోనుంది. ఇది ఆ పార్టీకి రికార్డు స్థాయి విజయం. ఎన్నికల్లో ప్రతిపక్షానికి దాదాపు ఎలాంటి అవకాశం లేకుండా పోయింది. 11.1 కోట్ల మంది అర్హులైన ఓటర్లలో దాదాపు 60 శాతం మంది ఓటు వేశారు. గత దశాబ్దానికి పైగా కాలంలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో ఇదే అత్యధిక పోలింగ్. ఓటింగ్‌ను మూడు రోజులకు విస్తరించడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఆన్‌లైన్ ఓటింగ్‌కు అధికారులు అనుమతించారు. 2022లో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రేన్‌పై పూర్తిస్థాయి దాడిని ప్రారంభించిన తర్వాత జరిగిన తొలి పార్లమెంటరీ ఎన్నికలు ఇవే కావడం గమనార్హం. అదే ఏడాది రష్యా ఆక్రమించి, తన భూభాగంలో విలీనం చేసుకున్న ఉక్రేన్‌లోని నాలుగు ప్రాంతాల ప్రజలను కూడా ఈ ఎన్నికల్లో ఓటర్లుగా చేర్చారు. 2014లో రష్యా విలీనం చేసుకున్న క్రిమియాలోనూ పోలింగ్ జరిగింది. ఈ ప్రాంతాల్లో జరిగిన ఓటింగ్ చట్టవిరుద్ధమని ఉక్రేన్ ఖండించింది. కాగా, క్రెమ్లిన్ విధానాలకు ప్రజల మద్దతును ఎన్నికల ఫలితాలు చూపిస్తున్నాయని పుతిన్ వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం అధిపతి ఎల్లా పాంఫిలోవా ప్రకారం, యునైటెడ్ రష్యా 450 డూమా స్థానాల్లో 349 గెలుచుకుంది. పార్టీలకు కేటాయించిన 225 స్థానాల్లో ఆ పార్టీకి దాదాపు 58 శాతం ఓట్లు వచ్చాయి. మిగిలిన 225 స్థానాల్లో 209 సింగిల్‌మెంబర్ నియోజకవర్గాలను కూడా గెలుచుకుంది. క్రెమ్లిన్‌కు అనుకూలంగా కీలక అంశాలపై ఓటు వేసే పలు చిన్న పార్టీలకు 97 స్థానాలు దక్కాయి. మరో నాలుగు స్థానాలను పార్టీ అనుబంధం లేకుండా పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులు గెలుచుకున్నారు. యుద్ధాన్ని బహిరంగంగా విమర్శించడానికి సాహసించిన ఏకైక నమోదిత రాజకీయ పార్టీగా ఉన్న ఉదారవాద 'యాబ్లోకో'ను గత నెలలో రష్యా సుప్రీంకోర్టు ఎన్నికల నుంచి నిషేధించింది. ఆ పార్టీ తరఫున కొద్ది మంది మాత్రమే సింగిల్‌మెంబర్ నియోజకవర్గాల్లో పోటీ చేశారు. కానీ, వారిలో ఎవరూ గెలవలేదు. కాగా, ఉక్రేన్ నిరంతర డ్రోన్ దాడుల మధ్య ఎన్నికలు జరిగాయి. ఆదివారం రాత్రి 1,110 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. మాస్కో వైపు వస్తున్న 450 డ్రోన్లను కూల్చివేసినట్లు మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. రాజధానిపై ఇదే అతిపెద్ద డ్రోన్ దాడి అని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో చమురు శుద్ధి కర్మాగారం, నివాస భవనం దెబ్బతిన్నాయి. మాస్కో ప్రాంతంలో ముగ్గురు మరణించగా, 38 మంది గాయపడ్డారు. పోలింగ్ సమయంలో ఉక్రేన్ దాడుల్లో ఆరుగురు ఎన్నికల సిబ్బంది మరణించారని, కాల్పుల్లో 75 పోలింగ్ కేంద్రాలు పాక్షికంగా దెబ్బతినడం లేదా ధ్వంసం కావడం జరిగిందని పాంఫిలోవా తెలిపారు.

## నెతన్యాహు ప్రసంగం

# ఐరాసలో ప్రతినిధుల వాకౌట్



**ఐక్యరాజ్యసమితి:** అంతర్జాతీయంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఐక్యరాజ్యసమితి (ఐరాస) సర్వసభ్య సమావేశంలో ప్రసంగించారు. ఆయన ప్రసంగిస్తుండగానే వివిధ దేశాల ప్రతినిధులు సభ నుంచి వాకౌట్ చేశారు. సభలో పెద్ద సంఖ్యలో సీట్లు ఖాళీగా కనిపించాయి. కాగా, గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందన్న ఆరోపణలను నెతన్యాహు తీవ్రంగా ఖండించారు. ఆ వార్తలను 'ఈ శతాబ్దంలోనే అతి పెద్ద అబద్ధం' అంటూ తోసిపుచ్చారు. సభ నుంచి వెళ్లిపోయిన ప్రతినిధులను 'నైతికంగా పిరికివాళ్లు'గా అభివర్ణించారు. ఇలావుంటే, అమెరికా వీసా నిరాకరించడంతో పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ ముందుగా రికార్డు చేసిన వీడియో ద్వారా ఐరాసను ఉద్దేశించి ప్రసంగించారు. వరుసగా రెండో ఏడాది ఆయనకు వీసా లభించలేదు. 'మేము మా మాతృభూమిని విడిచిపెట్టం. నిర్బంధ వలసను అంగీకరించం. మా తరఫున మా భవిష్యత్తును నిర్ణయించేందుకు ఎవరినీ అనుమతించం' అని అబ్బాస్ స్పష్టం చేశారు. గాజా శాంతి ఒప్పందం తదుపరి దశలను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని హమాస్ ప్రకటించింది. గాజా పునర్నిర్మాణానికి ఆరు నెలల్లో 2.45 బిలియన్ డాలర్లు ఖర్చు చేసే ప్రణాళికను ట్రంప్ ఆధ్వర్యంలోని బోర్డ్ ఆఫ్ పీస్ ప్రకటించిన తర్వాత హమాస్ ఈ ప్రకటన చేసింది. అయితే ఆయుధాల విరమణపై హమాస్ ఎలాంటి ప్రస్తావన చేయలేదు. ఇజ్రాయెల్ మాత్రం హమాస్ నిరాయుధీకరణ జరిగే వరకు పునర్నిర్మాణాన్ని అనుమతించబోమని చెబుతోంది. గాజా పునర్నిర్మాణానికి అవసరమని అంచనా వేసిన 71 బిలియన్ యూరోలలో ఇప్పటివరకు కేవలం ఒక బిలియన్ యూరోలు మాత్రమే సమీకరించారని యూరోపియన్ యూనియన్ ఉన్నతాధికారి తెలిపారు. యెమెన్‌లోని ఇరాన్ మద్దతున్న హౌతీలు తాము సౌదీ అరేబియాలోని రియాద్, యన్బు ప్రాంతాల్లోని లక్ష్యాలపై దాడులు చేసినట్లు ప్రకటించారు. అయితే ఆ వాదనలను స్వతంత్రంగా ధ్రువీకరించలేకపోయినట్లు 'అసోసియేటెడ్ ప్రెస్' తెలిపింది. సౌదీ సైన్యం ఆరు బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నట్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా, యెమెన్‌లో మానవతా సంక్షోభం మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో పౌరులకు అత్యవసర సహాయం వేగంగా అందించాలని ఐరాస కోరింది. ఆగస్టు ప్రారంభం నుంచి భూతల పోరాటాలు, ఫిరంగి దాడులు, వైమానిక దాడుల్లో కనీసం 125 మంది పౌరులు మరణించారని లేదా గాయపడ్డారని ఐరాస మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ తెలిపారు. హౌతీల నిర్బంధంలో ఉన్న 73 మంది ఐరాస సిబ్బందిని విడుదల చేయాలని కూడా ఆయన కోరారు.

**యూదులను ప్రమాదంలోకి నెడుతున్న మమ్దానీ వ్యాఖ్యలు**

గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను విమర్శిస్తూ జోరాన్ మమ్దానీ చేస్తున్న వ్యాఖ్యలు న్యూయార్క్‌లోని యూదులను ప్రమాదంలోకి నెడుతున్నాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆరోపించారు. ఇజ్రాయెల్‌పై మమ్దానీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో నెతన్యాహు అన్నారు. మమ్దానీని 'న్యూయార్క్ యాంటీ సెమిటిక్ మేయర్'గా అభివర్ణించిన నెతన్యాహు, తన ప్రసంగంలో కొంత సమయాన్ని న్యూయార్క్ మేయర్‌పై విమర్శలకు కేటాయించారు. మమ్దానీ గతంలో నెతన్యాహు న్యూయార్క్‌కు వస్తే అరెస్టు చేయిస్తానని హెచ్చరించారు. 'మీరు ఈ నగరానికి మేయర్‌గా ఎన్నికైనప్పటి నుంచి చాలామంది యూదులు న్యూయార్క్‌లో తమకు భద్రత లేదని భావిస్తున్నారు' అని నెతన్యాహు అన్నారు. న్యూయార్క్ తొలి ముస్లిం మేయర్ అయిన మమ్దానీ చాలాకాలంగా గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. నెతన్యాహును 'యుద్ధ నేరస్థుడు'గా, 'పాలస్తీనా ప్రజలపై భయానక మారణహోమానికి రూపకర్త'గా ఆయన గతంలో అభివర్ణించారు. అయితే ఇజ్రాయెల్‌ను విమర్శించడం, పాలస్తీనా హక్కులకు మద్దతు ఇవ్వడం యూదు వ్యతిరేకత కాదని మమ్దానీ చెబుతున్నారు.

# జిన్‌పింగ్‌కు ట్రంప్ విందు–టెక్ దిగ్గజాల సందడి



**వాషింగ్టన్:** దౌత్యంలో అధికారిక చర్చలతో పాటు విందులో ఎలాంటి వంటకాలు వడ్డిస్తారు? అతిథులు ఎక్కడ కూర్చుంటారు,? వంటి అంశాలతో పాటు వారి వస్త్రధారణ, హావభావాలు కూడా ప్రాధాన్యం సంతరించుకుంటాయి. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ గౌరవార్థం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన 'స్టేట్ డిన్నర్'లో బిలియనీర్లు, వ్యాపార దిగ్గజాలు, వాషింగ్టన్‌లోని ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఓపెన్ ఎఐ సిఇఒ సామ్ ఆల్ట్‌మన్ వైట్ హౌస్‌కు వస్తు అభిమానులకు ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. ఎన్విడియా సిఇఒ జెన్సన్ హువాంగ్ తాను సాధారణంగా ధరించే నల్లటి లెదర్ జాకెట్‌కు బదులుగా టక్సీడో వేసుకున్నారు. ఎల్వీఎంహెచ్ అధినేత బెర్నార్డ్ ఆర్నాల్ట్ కూడా విందుకు హాజరయ్యారు. విందు మెనూలో మొదట అడవి పుట్టగొడుగులు, తాజా మూలికలు, పాన్సెట్టాతో ఎల్లో స్క్వాష్ వెలూటే వడ్డించారు. ఆ తర్వాత నువ్వులతో పూతపూసిన 'సీ బాస్' చేపను బోక్ చాయ్, కాల్చిన వంకాయ, ప్రత్యేక సాస్‌తో అందించారు. డెజర్ట్‌గా వనిల్లా క్రీమ్యూ, పుల్లని చెర్రీ, వాల్నట్ ఫ్రాంగిపేన్‌తో పాటు వైట్‌హౌస్‌లో ఉత్పత్తి చేసిన తేనెతో తయారైన ప్రత్యేక ఐస్‌క్రీమ్ వడ్డించారు. విందులో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, టెస్లా స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్, గూగుల్‌కు చెందిన సుందర్ పిచాయ్, ఓపెన్ ఎఐ అధ్యక్షుడు గ్రెగ్ బ్రాక్మన్, డెల్ టెక్నాలజీస్ సిఇఒ మైఖేల్ డెల్ తదితర టెక్ దిగ్గజాలు సందడి చేశారు. జిన్‌పింగ్ ఈ ఏడాది మే మాసంలో, బీజింగ్‌లోని 'గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్'లో ట్రంప్‌కు అధికారిక 'స్టేట్ డిన్నర్' ఇచ్చారు. దానికి ప్రతిస్పందనగా ట్రంప్ వైట్‌హౌస్‌లో నిర్మిస్తున్న కొత్త బాల్‌రూమ్‌ను 'గ్రేట్ హాల్ ఆఫ్ ది యునైటెడ్ స్టేట్స్'గా అభివర్ణించారు. 2015లో జిన్‌పింగ్‌కు ఒబామా విందు ఇవ్వడాన్ని ట్రంప్ వ్యతిరేకించారు. ఇలాంటి ఆర్భాటాలు తగవని విమర్శించారు. 'జిన్‌పింగ్ బృందాన్ని మెక్‌డొనాల్డ్స్‌కు తీసుకెళ్లి, అనంతరం చర్చలకు సిద్ధం కండి' అని అప్పట్లో వ్యాఖ్యానించారు. 2017లో జిన్‌పింగ్ తొలిసారి ట్రంప్‌ను కలిసినప్పుడు 'మార్‌ఎలాగో'లో సమావేశమయ్యారు. ఆ పర్యటన సందర్భంగా సిరియాపై అమెరికా క్షిపణి దాడి చేసిన విషయాన్ని జిన్‌పింగ్‌కు ట్రంప్ విందు సమయంలో చెప్పిన సంఘటనను అమెరికా మీడియా ప్రత్యేక కథనాలలో గుర్తుచేసుకుంది.

## జిన్‌పింగ్ పర్యటన ముగింపులో

# అమెరికా రాజ్యాంగం, హక్కుల పత్రాల సందర్శన

**వాషింగ్టన్:** మూడు రోజుల అమెరికా పర్యటన ముగింపులో భాగంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేషనల్ ఆర్కైవ్స్‌కు తీసుకెళ్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన కమ్యూనిస్టు దేశాధినేతకు అమెరికా ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిచిన కీలక పత్రాలను చూపించనున్నారు. నేషనల్ ఆర్కైవ్స్‌లో అమెరికా స్వాతంత్ర్య ప్రకటన, రాజ్యాంగం, హక్కుల పత్రం భద్రపరిచారు. వాటిని సందర్శించిన అనంతరం, వాషింగ్టన్ నుంచి జిన్‌పింగ్ స్వదేశానికి బయలుదేరుతారు. సరైన సమయాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ, భారత కాలమానం ప్రకారం ఆయన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత లేదా శనివారం తెల్లవారు జామునమ బయలుదేరతారని సమాచారం. 'అమెరికా 250వ స్వాతంత్ర్య వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సమయంలో జిన్‌పింగ్ పర్యటన జరుగుతోంది. అమెరికా గర్వించదగిన చరిత్రలోని కొన్ని గొప్ప సంపదలను జిన్‌పింగ్‌కు చూపించాలనుకుంటున్నాను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. నేషనల్ ఆర్కైవ్స్ "ది అమెరికన్ స్టోరీ" పేరుతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అమెరికా సాధించిన విజయాలు, పురోగతితో పాటు దేశ చరిత్రలోని చీకటి అధ్యాయాలను కూడా ఈ ప్రదర్శన చూపిస్తుంది. కాగా, ట్రంప్ ఓవల్ ఆఫీస్‌లో తాను దాచుకున్న 'అమెరికా స్వాతంత్ర్య ప్రకటన' ప్రతిని జిన్‌పింగ్‌కు చూపించారు. రెండు దేశాల చారిత్రక సంబంధాలకు సంబంధించిన వస్తువులను కూడా ఆయనకు చూపించాలని తాను కోరుకుంటున్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ పర్యటనలో చివరి రోజున జిన్‌పింగ్ కార్యక్రమాలు వైట్‌హౌస్ నుంచి మొదలవుతాయి. చైనా అధ్యక్షుడు జీ, ఆయన భార్య పెంగ్ లియువాన్‌లకు ట్రంప్, ఆయన భార్య మెలానియా ట్రంప్ టీ విందు ఇవ్వడంతో మొదలైన కార్యక్రమాలు సాయంత్రం వారి వీడ్కోలు వరకూ కొనసాగుతాయి. ఇలావుంటే, గురువారం ట్రంప్, జిన్‌పింగ్ సుమారు 90 నిమిషాల పాటు రహస్యంగా సమావేశమయ్యారు. మధ్యప్రాచ్యం, ఉక్రేన్, కొరియా ద్వీపకల్పం తదితర అంశాలపై చర్చించినట్లు చైనా ప్రభుత్వం వెల్లడించింది. అయితే ఆ సమావేశానికి సంబంధించిన వివరాలను వైట్‌హౌస్ ఇంకా వెల్లడించలేదు.

## జిన్‌పింగ్–ట్రంప్ శిఖరాగ్ర భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఇది చూపిస్తోంది' అని బీజింగ్‌లోని పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థి జియాంగ్ జియ్యు 'అసోసియేటెడ్ ప్రెస్' (ఎపి)తో అన్నారు. చాలా మంది చైనీయులు, చైనా సామాజిక మాధ్యమాల్లో దాదాపు ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. అమెరికాతో చైనా సహకారాన్ని వారు ప్రశంసించారు. చైనా అధికారిక పత్రిక 'పీపుల్స్ డైలీ' తన మొదటి పేజీ మొత్తాన్ని జిన్‌పింగ్ అమెరికా పర్యటనకు కేటాయించింది. జిన్‌పింగ్–ట్రంప్ సమావేశాలకు సంబంధించిన ఆరు ఫొటోలను ప్రచురించింది. చైనా సెర్చ్ ఇంజిన్ 'బైడూ'లో శుక్రవారం అత్యంత ప్రజాదరణ పొందిన మూడు అంశాల్లో ట్రంప్–జిన్‌పింగ్ చర్చలు ఒకటి. జిన్‌పింగ్ పాల్గొన్న స్టేట్ డిన్నర్, మిడ్‌ఆటమ్ ఫెస్టివల్ సందర్భంగా చైనా ప్రజలకు ఆయన పంపిన శుభాకాంక్షలు ఈ ప్రధానమైన అంశాల్లో ఉన్నాయి. వాణిజ్యం, కృత్రిమ మేధస్సు, భద్రత వంటి అంశాల్లో ట్రంప్, జిన్‌పింగ్ పరస్పరం సానుకూలంగా వ్యవహరించినట్టు బీజింగ్ నివాసి షెన్ జుఓహాంగ్ వ్యాఖ్యానించారు. 'అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం లేదు, సైనిక ఘర్షణ కూడా లేదు. తైవాన్ విషయంలో కూడా తీవ్ర ఉద్రిక్తతకు బదులుగా మంచి దిశలో ముందుకు సాగుతున్నాం' అని షెన్ అన్నారు. 'ఇరు పక్షాలు సమస్యలను మరింత సమన్వయపూర్వకంగా పరిష్కరిస్తున్నాయి' అని ఆయన పేర్కొన్నారు. కాగా, చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం, తైవాన్ స్వాతంత్ర్యాన్ని అమెరికా వ్యతిరేకించాలని ట్రంప్‌ను జిన్‌పింగ్ కోరారు. చైనా తన భూభాగంగా పేర్కొంటున్న తైవాన్ అంశాన్ని అమెరికా జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ట్రంప్ వెంటనే తైవాన్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయితే తైవాన్‌కు అమెరికా ఆయుధ విక్రయాల అంశంపై చైనాతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన గతంలో పేర్కొన్నారు. మొత్తం మీద అమెరికా, చైనా అధ్యక్షుల మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశం ఓ సానుకూల సంకేతాన్ని పంపిందని, రెండు దేశాల సంబంధాలపై సానుకూల వాతావరణం నెలకొందని చైనా ప్రజలు భావిస్తున్నారు. 'పూర్తిగా మాట్లాడుకోకపోవడం అంటే ఇరువురు నేతలు మాట్లాడుకోవడం మంచిది. ఎన్నో సమస్యలకు ఏదో ఒక పరిష్కారం లభించవచ్చు' అన్న ధోరణి చైనీయుల్లో కనిపిస్తున్నదని ఎపి తన వార్తా కథనంలో పేర్కొంది.

**రానున్న ఐదేళ్లలో లక్ష మంది యువ అమెరికన్లను చైనా ఆహ్వానిస్తాం**
**చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటన**

వచ్చే ఐదేళ్లలో పరస్పర మార్పిడి కార్యక్రమాలు, విద్య వంటి రంగాలలో భాగస్వామ్యం కోసం లక్ష మంది యువ అమెరికన్లను తమ దేశానికి ఆహ్వానిస్తామని, వైట్‌హౌస్‌లో విడుదల చేసిన ఒక ప్రటనలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తెలిపారు.

2023లో చైనా ఇలాంటి కార్యక్రమం కింద ఐదేళ్లలో 50 వేల మంది యువ అమెరికన్లను ఆహ్వానిస్తామని ప్రకటించింది. ఆ లక్ష్యాన్ని గడువు కంటే ముందుగానే ఈ ఏడాదిలోనే పూర్తిచేశారు. 'చైనా–అమెరికా సంబంధాలపై ప్రజల్లో ఆశ ఉంది. వాటి భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. వచ్చే ఐదేళ్లలో మార్పిడి, విద్య కోసం లక్ష మంది యువ అమెరికన్లను చైనాకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించడం నాకు సంతోషంగా ఉంది' అని జిన్‌పింగ్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో చైనా, అమెరికా ప్రజలు 'ఫాసిస్టు' దురాక్రమణకు వ్యతిరేకంగా భుజం భుజం కలిపి పోరాడిన విషయాన్ని జిన్‌పింగ్ గుర్తుచేశారు. 'చరిత్రలోని ఆ భాగాన్ని చైనా ప్రజలు ఎప్పుడూ మరచిపోలేదు. అమెరికా ప్రజలు కూడా మరచిపోలేదు' అని వ్యాఖ్యానించారు. జాతీయ పునరుజ్జీవనాన్ని సాధించాలన్న చైనా లక్ష్యం, మళ్లీ గొప్ప దేశంగా తీర్చిదిద్దాలన్న అమెరికా లక్ష్యం పరస్పర సహకారంతో, సాధించవచ్చని ఆయన అన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి, చారిత్రక బాధ్యతను ముందుకు తీసుకెళదామని ఆయన అమెరికాను కోరారు.

రెండు దేశాల ప్రజల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేస్తూ, మెరుగైన ప్రపంచ నిర్మాణానికి కలిసి పనిచేద్దామని జిన్‌పింగ్ అన్నారు. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కూడా రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనాకు అమెరికా అందించిన సహాయాన్ని ప్రస్తావించారు. భద్రత, సాంకేతికత, సూపర్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన అంశాలను ప్రస్తావించిన ట్రంప్, ఈ రంగాల్లో తామిద్దరం తీసుకునే నిర్ణయాలు రాబోయే దశాబ్దాల్లో శాంతి, సుసంపన్నతకు దోహదపడగలవని అన్నారు. 'మనం ఉమ్మడి ప్రయోజనాలపై దృష్టి పెడుతున్నాం. చరిత్రలో ఎన్నో రంగాల్లో మనం కలిసి సాధించగలిగింది చాలా ఉందని నాకు నమ్మకం ఉంది' అని ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా, చైనా మధ్య ఏర్పడిన స్నేహాన్ని కూడా ఆయన గుర్తుచేశారు. చైనాలో పోరాడేందుకు స్వచ్ఛందంగా వచ్చిన అమెరికా పైలట్లను, 'ఫ్లయింగ్ టైగర్స్' బృందాన్ని ట్రంప్ ప్రశంసించారు. చైనా ప్రజలతో అమెరికా మెరైన్స్‌కు ఏర్పడిన సంబంధం 'గంగ్ హో' అనే చైనీస్ పదబంధాన్ని అమెరికా మెరైన్స్‌తో ప్రాచుర్యంలోకి తెచ్చిందని ట్రంప్ చెప్పారు. చైనా భాషలో దాని అర్థం 'కలిసి పనిచేయడం' అని ఆయన పేర్కొన్నారు.

## విధించాలి

(మొదటి పేజీ తరువాయి)

మార్పులను ఈ పర్యవేక్షక సంస్థ సిఫార్సు చేసింది. ఇందులో భాగంగా, అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఎంపిల విషయంలో రాష్ట్రపతికి, ఎమ్మెల్యేల విషయంలో గవర్నర్లకు బదిలీ చేయాలని సూచించింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి ఒక కాలపరిమితిని, అలాగే పార్టీ ఫిరాయించిన వారు తిరిగి ఎన్నికయ్యే వరకు ప్రభుత్వ పదవుల్లో కొనసాగకుండా ఆంక్షలు విధించాలని కూడా ఇది సూచించింది. కాగా, 2022–26లో జరిగిన ఎన్నికలు, ఉప ఎన్నికలను పరిగణనలోకి తీసుకున్న ఈ విశ్లేషణలో, 26 మంది లోక్‌సభ సభ్యులు, ఏడుగురు రాజ్యసభ సభ్యులు, 78 మంది ఎమ్మెల్యేలు పార్టీలు మారినట్లు తేలింది. ఈ కేసులలో వ్యక్తిగత పార్టీ ఫిరాయింపులు, పార్టీ విలీనాలు, రాజీనామాల తర్వాత ఉప ఎన్నికలలో గెలవడం, అనర్హత తర్వాత ఉప ఎన్నికలో సీటు గెలవడం వంటివి ఉన్నాయని ఎడిఆర్ తెలిపింది. అత్యధికంగా 32 కేసులు నాగాలాండ్‌లో నమోదయ్యాయి, ఇవన్నీ ఎమ్మెల్యేలకు సంబంధించినవే. ఈ కేసులలో అధికభాగం అధికార నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి), నాగ పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) మధ్య జరిగిన పునరేకీకరణకు సంబంధించినవే. ఎడిఆర్ విశ్లేషణలో, ఎన్‌డిఎఫ్ అత్యధిక సంఖ్యలో చట్టసభ సభ్యులను చేర్చుకున్న పార్టీగా నిలిచింది. మొత్తం మీద, పార్టీలు మారిన వారిలో మొదట ఎన్‌డిపిపి నుండి ఎన్నికైన 25 మంది శాసనసభ్యులు ఉండగా, 32 మంది శాసనసభ్యులు ఎన్‌పిఎఫ్‌లో చేరారు. పశ్చిమ బెంగాల్‌లో 20 కేసులు నమోదయ్యాయి, వీరందరూ లోక్‌సభ సభ్యులకు సంబంధించినవారే. ఈ 20 మంది కూడా మొదట ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిసి) టిక్కెట్లపై ఎన్నికై, ఆ తర్వాత నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)లోకి మారారు. ఎన్‌సిపిఐలో విలీనమయ్యామని ఆ ఎంపిలు ప్రకటించగా, ఈ విషయం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ముందు ఉంది. తర్వాత తెలంగాణలో తొమ్మిది కేసులు నమోదయ్యాయి, వీరందరూ ఎమ్మెల్యేలకు సంబంధించినవారే. వీరిలో తొమ్మిది మంది భారత్ రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) నుండి ఎన్నికైన శాసనసభ్యులు కాగా, ఆ రాష్ట్రంలో అత్యధిక శాసనసభ్యులను పొందిన పార్టీగా కాంగ్రెస్ నిలిచింది. గోవాలో ఎనిమిది కేసులు నమోదయ్యాయి, వీరిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపిలోకి మారగా, పంజాబ్‌లో కూడా ఎనిమిది కేసులు నమోదయ్యాయి, వీరిలో ఆరుగురు రాజ్యసభ సభ్యులు, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. మహారాష్ట్రలో ఆరు కేసులు నమోదయ్యాయి, అన్నింటిలో శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాక్రే) నుండి ఎన్నికైన లోక్‌సభ సభ్యులు ఉన్నారు, వారు ఏక్నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలోకి మారారు. మేఘాలయలో ఆరు, మణిపూర్‌లో ఐదు ఎమ్మెల్యే కేసులు నమోదు కాగా, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్‌లలో నాలుగేసి చొప్పున నమోదయ్యాయి. హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్‌లలో రెండేసి కేసులు నమోదు కాగా, కర్ణాటక, మధ్యప్రదేశ్, సిక్కిం, ఉత్తరప్రదేశ్‌లలో ఒక్కో కేసు నమోదైంది. ఢిల్లీలో ఒక రాజ్యసభ సభ్యుడు పార్టీ మారారు. పార్టీల స్థాయిలో చూస్తే, అత్యధికంగా 25 మంది ఎన్‌డిపిపిలో, ఆ తర్వాత 20 మంది ఎఐటిసిలో, 19 మంది కాంగ్రెస్‌లో పార్టీ మారారు. బిఆర్‌ఎస్‌లో తొమ్మిది, ఆప్, ఎన్‌సిపిలలో ఏడేసి చొప్పున, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాక్రే)లో ఆరు, జెడియులో ఐదు, ఎన్‌పిపిలో నాలుగు మంది పార్టీ మారారు. మొత్తం 111 కేసులలో, ఎన్‌డిపిపి, ఎఐటిసి, కాంగ్రెస్‌లలో కలిపి 64 కేసులు, అంటే 58 శాతం నమోదయ్యాయి. కొన్ని రాష్ట్ర శాసనసభలలో ప్రభుత్వాలు పడిపోవడానికి ఇటీవలి ఫిరాయింపులు కూడా ఒక కారణమని ఎడిఆర్ పేర్కొంది.

## పునరుద్ధరించాలి

(మొదటి పేజీ తరువాయి)

విషయంలో తెలంగాణ రాష్ట్రం వెనక్కి తగ్గబోదని, కేంద్రంపై పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిలకు తుమ్మల నాగేశ్వర్ రావు శుక్రవారం లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 1.29 లక్షల హెక్టార్లలో 88,621 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, వంట నూనెల దిగుమతి ఆధారితను తగ్గించి ఆత్మనిర్భరత సాధించాలన్న కేంద్ర పిలుపునకు స్పందించి, రైతులు తమ భూములను దీర్ఘకాలం సాగుకు కేటాయించి, భారీగా పెట్టుబడులు పెట్టారని గుర్తుచేశారు. ఒకవైపు 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఆయిల్ పామ్' ద్వారా సాగును ప్రోత్సహిస్తూ, మరోవైపు దిగుమతి చేసుకునే పామాయిల్ చౌకగా లభించేలా సుంకాన్ని తగ్గించడం దేశీయ రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, ఇలాంటి ద్వంద్వ విధానాలు ఉండకూడదని సూచించారు. క్రూడ్ పామాయిల్ దిగుమతి వ్యయం తగ్గితే దేశీయ సిపిఒ ధరలపై ఒత్తిడి వచ్చి, చివరకు రైతులకు అందే ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్ (ఎఫ్‌ఎఫ్‌బి) ధరలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.

**జాతీయ లక్ష్యాలతో ముడిపడిన అంశం:**

ఆయిల్ పామ్ రైతుల సమస్యను కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాకుండా, దేశీయ వంట నూనెల ఉత్పత్తి, రైతుల ఆదాయం,జాతీయ లక్ష్యాలతో ముడిపడిన అంశంగా చూడాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లోనూ పెద్ద సంఖ్యలో రైతులు ఉన్నందున, రైతుల ప్రయోజనాల కోసం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమన్వయంతో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రి తుమ్మల కోరారు.వినియోగదారులకు ధరల్లో ఉపశమనం కల్పించాలనే ఉద్దేశాన్ని అర్థం చేసుకుంటున్నప్పటికీ, ఆ భారాన్ని దేశీయ రైతులపై మోపడం పరిష్కారం కాదని, రైతు వినియోగదారు ఇద్దరి ప్రయోజనాలను సమతుల్యం చేసే విధానం అవసరమని మంత్రి తుమ్మల సూచించారు.దీర్ఘకాలిక పంటల విషయంలో విధాన స్థిరత్వం ఎంతో ముఖ్యమని, తరచూ మార్పులు చేయడం రైతుల నమ్మకాన్ని దెబ్బతీస్తుందన్నారు.

## నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

కోల్‌కతా, జమ్ముకశ్మీర్ తదితర ప్రాంతాల్లోనూ జరిగాయి. కాగా, రౌస్ అవెన్యూలోని ఢిల్లీ కాంగ్రెస్ కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశమయ్యారు. అక్కడి నుంచి దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని బిజెపి ప్రధాన కార్యాలయం వైపు ర్యాలీగా వెళ్లి, ఆ తర్వాత నిర్వాచన్ సదన్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. రాజధానిలోని జెజె క్లస్టర్లు, అనధికార కాలనీల నివాసితులపై ఈ సర్ ప్రక్రియ తీవ్ర ప్రభావం చూపిందని పార్టీ ఆరోపించింది. నిర్ణీత గడువులోగా ఎన్నికల కమిషన్ కోరిన పత్రాలను సమర్పించడంలో వీరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడింది. ప్రతి ఎన్నికలోనూ బిజెపి 'ఓట్ల దొంగతనం'కు పాల్పడుతోందని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని సుమారు 1.45 కోట్ల మంది ఓటర్లలో 47.6 లక్షల మంది పేర్లు తొలగించబడ్డాయని, అలాగే 31.6 లక్షల మంది ఓటర్లకు వివరాల సవరణ కోసం నోటీసులు జారీ చేశారని యాదవ్ పేర్కొన్నారు. వివరాల సవరణ కోసం అధికారులు కొందరు ప్రముఖుల ఇళ్లకు స్వయంగా వెళ్లారని, కానీ సాధారణ ఓటర్లు మాత్రం ఆ ప్రక్రియను స్వయంగా పూర్తి చేసుకోవాల్సి వచ్చిందని పార్టీ కార్యకర్తలు ఆరోపించారు. తల్లిదండ్రుల వయసులో తేడాలు, స్పెల్లింగ్ తప్పులు, చిరునామాల్లో వ్యత్యాసాలు వంటివి కంప్యూటర్ ద్వారా రూపొందించిన డేటాలోని లోపాల వల్ల జరిగి ఉండవచ్చని, ఓటర్లకు ఇబ్బంది కలగకుండా వీటిని సరిదిద్దాలని ఆయన అన్నారు. ఢిల్లీ కాంగ్రెస్ నిరసన నేపథ్యంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్, ఎన్నికల కమిషన్ కార్యాలయం బయట పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు.

**అసోంలో ఉద్రిక్తత**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తొలగింపును డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనలో భాగంగా, పోలీసు బారికేడ్లను దాటడానికి ప్రయత్నించిన పార్లమెంట్‌లో కాంగ్రెస్‌పక్ష ఉపనేత, అసోం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్, పలువురు సీనియర్ పార్టీ నాయకులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గొగోయ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తన రాష్ట్ర ప్రధాన కార్యాలయం 'రాజీవ్ భవన్' నుండి ర్యాలీని ప్రారంభించింది. సిఇసి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లాలని వారు యోచించారు. అయితే రాజీవ్ భవన్ సమీపంలో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. గొగోయ్‌తో సహా నిరసనకారులు వాటిని దాటడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ విడుదల చేసిన ఒక వీడియోలో గొగోయ్ మాట్లాడుతూ, నిరసన తెలపడం 'ప్రజాస్వామ్యయుత చర్య' అని, భారత ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడి పట్ల తమ ఆందోళనను వ్యక్తం చేయడానికి సిఇఒ కార్యాలయానికి వెళ్లాలని అనుకున్నామని, కానీ పోలీసులు తమను అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. తమను అదుపులోకి తీసుకోవడం ద్వారా తమ గొంతు నొక్కవచ్చని బిజెపి భావిస్తే, అది వారి పొరపాటేనన్నారు. ఇప్పుడు బిజెపి భయపడుతున్నట్లు కనిపిస్తోందన్నారు. కాగా, అదుపులోకి తీసుకున్న కాంగ్రెస్ నాయకులను బస్సులో 4వ అసోం పోలీస్ బెటాలియన్‌కు తరలిస్తుండగా, వారు బిజెపి, సిఇసికి వ్యతిరేకంగా 'బిజెపి గో బ్యాక్', 'జ్ఞానేష్ కుమార్‌ను అరెస్టు చేయాలి' వంటి నినాదాలు చేయడం వినిపించింది. గొగోయ్‌తో పాటు, అదుపులోకి తీసుకున్న వారిలో ఎఐసిసి కార్యదర్శి మనోజ్ చౌహాన్, సేవా దళ్ అధ్యక్షుడు దీప్ బయాన్, ఎపిసిసి ప్రధాన కార్యదర్శి ఉదిత్ భాను దాస్‌తో పాటు పలువురు ఇతరులు ఉన్నారు.

## పిటిషన్

(మొదటి పేజీ తరువాయి)

చంద్ ఖురేషీ ద్వారా న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్‌లో పూర్తి ఎన్నికల సంఘం (ఇసి) ఆమోదం లేకుండానే, లేదా ఎన్నికల సంఘం మెజారిటీ అభిప్రాయానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకున్నట్లయితే, అలాంటి నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధమని, ప్రధాన ఎన్నికల కమిషనర్ అధికార పరిధికి మించినవని, చెల్లనివని ప్రకటించాలని కోరారు. అవసరమైన ఏకాభిప్రాయం లేకుండా తీసుకున్నారని ఆరోపించబడిన నిర్ణయాలను సవాల్‌చేయడంతో పాటు, అధికార విధి నిర్వహణలో లోపానికి సంబంధించిన నిబంధనల కింద సిఇసి, ఇతర అధికారులపై క్రిమినల్ విచారణ ప్రారంభించాలని పిటిషనర్ కోరారు. 'ఏ విధమైన చట్టపరమైన, రాజ్యాంగపరమైన మినహాయింపు లేకుండా, ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒక సాధారణ నిందితుడిలాగే పోలీసు విచారణ, సాక్ష్యాధారాల సేకరణ, సాధారణ విచారణ ప్రక్రియలకు లోబడి చట్ట ప్రకారం నేరుగా, జవాబుదారీగా ఉంటారు' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్నికల సంఘం పేరుతో తీసుకున్నట్లు ఆరోపించబడిన పలు నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి లిఖితపూర్వక అభ్యంతరాలు నమోదు చేశారని ఒక నివేదిక వెల్లడించిన కొద్ది రోజులకే ఈ పిటిషన్ దాఖలు చేయబడింది. పిటిషనర్, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం 2023లోని నిబంధనలను ముఖ్యంగా సెక్షన్ 18ను ఆధారంగా చేసుకున్నారు. ఈ సెక్షన్ ఎన్నికల సంఘం ద్వారా నిర్ణయం తీసుకునే అధికారాన్నిఅందిస్తూ, అభిప్రాయ భేదం ఉన్నప్పుడు మెజారిటీ అభిప్రాయమే చెల్లుబాటు అవుతుందని స్పష్టంచేసింది. ఇతర ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్)లకు సంబంధించిన అనేక నిర్ణయాలు తీసుకున్నారని, లేదా అమలు చేశారని పిటిషన్‌లో ఆరోపించారు. ఓటర్లుగా నమోదు కోరుకునే ప్రజలు ఉపయోగించే ఫారం–6లో మార్పు చేయడం అనేది లేవనెత్తిన ప్రధాన సమస్యలలో ఒకటి. ఎన్నికల నిబంధనల ప్రకారం అవసరమైన చట్టబద్ధమైన సవరణ లేకుండా, ఎన్నికల సంఘం సాఫ్ట్‌వేర్ ద్వారా పూర్వీకుల వివరాలు, మునుపటి ఎస్‌ఐఆర్‌తో అనుసంధానానికి సంబంధించిన నిబంధనను ప్రవేశపెట్టారని పిటిషనర్ ఆరోపించారు. 'పూర్తి కమిషన్ ఆమోదం లేకుండాఎన్నికల కమిషనర్ల మెజారిటీ అభిప్రాయాలకు విరుద్ధంగా సిఇసి జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించిన, ఆమోదించిన లేదా అమలు చేసిన అన్ని నిర్ణయాలు, మార్గదర్శకాలు, ఆదేశాలు, సాఫ్ట్‌వేర్ మార్పులను రాజ్యాంగ విరుద్ధమైనవిగా, అధికార పరిధికి మించినవిగా, ఆది నుంచి చెల్లనివిగా ప్రకటిస్తూ మాండమస్ రిట్ లేదా మరేదైనా తగిన రిట్, ఉత్తర్వు లేదా ఆదేశం జారీ చేయాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఈ మార్పును వ్యతిరేకించారని, చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించకుండా నిర్దేశిత ఫారమ్‌ను మార్చలేమని అభిప్రాయపడ్డారని పిటిషన్‌లో తెలిపారు.ఎన్నికల సంఘం డిజిటల్ వ్యవస్థలు నానాటికీ కేంద్రీకృతం అవుతున్నాయని,ఇది క్షేత్రస్థాయిలోని ఎన్నికల నమోదు అధికారులు, ఇతర అధికారుల చట్టబద్ధమైన అధికారాలను పరిమితం చేస్తోందని కూడా ఆరోపించింది. బహుళ సభ్యుల ఎనిక్నల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ 'సమానులలో ప్రథముడు' అని, ఇతర కమిషనర్ల కంటే ఆయనకు ఉన్నతమైన ఓటింగ్ అధికారం కానీ, వీటో అధికారం గానీ లేదని పిటిషనర్ వాదించారు. ఈ ఆరోపణలపై స్వతంత్ర న్యాయ విచారణ జరపాలని, అలాగే గోవాలోని 97మంది ఓటర్లను, అదేవిధంగా, ఇతర ప్రాంతాల వ్యక్తులను తిరిగి వారి స్థానాలకు చేర్చాలని పిటిషన్ కోరుతోంది.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు రెండో పసిడి

## 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి - కమల్‌జీత్ జోడి అద్భుత ప్రదర్శన



జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో రెండో పసిడి పతకం చేరింది. ప్రస్తుత సీజన్ షూటింగ్‌లో తొలి గోల్డ్ మెడల్ దక్కింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి కమల్‌జీత్ జోడి అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ ఈవెంట్ ఫైనల్‌లో భారత జోడీ బలమైన దక్షిణ కొరియా జోడిని ఓడించింది. ఈ క్రమంలో కమల్‌జీత్ సురుచి సింగ్ ద్వయం సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఫైనల్‌లో నాలుగు జట్లు గోల్డ్ మెడల్ పోటీలో నిలిచాయి.ఈ పోటీలో భారత ద్వయం 484.6 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఇక దక్షిణ కొరియా 478.0 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలుచుకోగా, ఇరాన్ 415.8 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఇండోనేసియా 349.4 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి పతకం లేకుండా వెనుదిరిగింది. అయితే భారత్ 484.6 పాయింట్ల స్కోరు సాధించడంతో ఆసియా రికార్డును కూడా నెలకొల్పింది. ఈ ఈవెంట్‌లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. గతంలో ఈ ఆసియా రికార్డు ఉజ్బెకిస్థాన్ పేరిట ఉండేది. ఆ దేశం ఇదే ఏడాది ఫిబ్రవరిలో 481.3 పాయింట్ల స్కోరును సాధించింది. ఇప్పుడు ఈ రికార్డు కమల్‌జీత్, సురుచి జోడీ బ్రేక్ చేసింది. ఈ ఫైనల్‌లో భారత జోడీ ఆద్యంతం టాప్‌లోనే కొనసాగింది. కమల్‌జీత్ సురుచి అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ జోడీ మొత్తం 58729x స్కోరు సాధించి, ఆసియా క్వాలిఫికేషన్‌లో రికార్డు నెలకొల్పింది. ఈ క్వాలిఫైయర్స్‌లో భారత్ అగ్రస్థానంలో నిలవగా, ఇరాన్ 58417x స్కోరుతో రెండో, దక్షిణ కొరియా 58223x స్కోరుతో మూడో స్థానాన్ని, ఇండోనేసియా 5804x స్కోరుతో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాయి. ఈ నాలుగు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ప్రారంభంలో, ఒక్కో సిరీస్‌లో ఐదు షాట్‌ల చొప్పున మూడు సిరీస్‌లు జరిగాయి. 15 షాట్‌ల తర్వాత భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత, ప్రతి రెండు షాట్‌లకు ఒకసారి ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. 17వ షాట్ తర్వాత ఇండోనేసియా నిష్క్రమించడంతో, భారత్‌కు పతకం ఖాయమైంది. 19వ షాట్ తర్వాత ఇరాన్ నిష్క్రమించడంతో, భారత్‌కు కనీసం రజత పతకం ఖాయమైంది. ఇక చివరిదాకా అదే ప్రదర్శన కొనసాగించి కొరియాను కూడా ఓడించడంతో స్వర్ణం దక్కింది.

### పురుషుల 50 మీటర్ల రైఫిల్‌లో భారత్‌కు రజత పతకం

మరోవైపు, పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ టీమ్ ఈవెంట్‌లో, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, రుద్రాంక్ష్ పాటిల్, నీరజ్ కుమార్‌లతో కూడిన భారత త్రయం మెరుగైన ప్రదర్శన కనబరిచి భారత్‌కు మరో పతకం ఖాయం చేసింది. క్వాలిఫికేషన్, టీమ్ ఈవెంట్లలో నిలకడను కనబరిచిన భారత షూటర్లు, రెండో స్థానాన్ని కైవసం చేసుకుని పోడియంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇక్కడ విశేషమేమిటంటే, ఆ విజయం సాధించిన కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే, షూటింగ్‌లోభారత్ పసిడి పతకాన్ని గెలుచుకుంది.

## పోల్ వాల్ట్‌లో భారత్ నవశకం

### తొలి పతకంతో చరిత్ర సృష్టించిన బరానిక




ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో ఎన్నడూ ఆసియాడ్‌లో పతకం గెలవని పోల్ వాల్ట్‌లో అద్భుతం చేసిన భారత్ కాంస్యంతో మెరిసింది. తద్వారా ఈ ఆటలో మన దేశానికి మొట్ట మొదటి పతకం అందించిన అథ్లెట్‌గా బరానిక అవతరించిందీ 29 ఏళ్ల తమిళ వనిత. జపాన్‌లోని నగోయలో మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తున్నారు అథ్లెట్లు. ఒకరితర్వాత ఒకరు పోడియం మీద నిలుస్తూ యావత్ భారతావనిని పులకింపజేస్తున్నారు. మహిళల 10 వేల మీటర్ల పరుగులో నిన్న సీమా కుమారి 16 ఏళ్ల కరువు తీర్చుతూ పతకం ఒడిసిపట్టగా.. ఈసారి బరానిక ఎలంగోవన్ పోల్ వాల్ట్‌లో చరిత్ర లిఖించింది. ఆసియా క్రీడల్లో ఇప్పటివరకూ పోల్ వాల్ట్‌లో ఎవరూ సాధించిన ఘనత సొంతం చేసుకుంటూ పతకంతో మురిసింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో అబ్బురపరిచే విన్యాసం చేసింది బరానిక. ఒత్తిడిని జయించి.. గుండెనిండా ఆత్మవిశ్వాసంతో 4.15 మీటర్ల ఎత్తు దూకింది. దాంతో.. మూడో స్థానం ఖాయమవ్వగా.. ఈ విభాగంలో భారత్‌కు మొట్టమొదటి పతకం తెచ్చింది.

## షాట్‌పుట్‌లో మన్‌ప్రీత్ కంచుమోత



నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత షాట్‌పూటర్ మన్‌ప్రీత్ కౌర్ మెరిసింది. అంచనాలు నిలబెట్టుకున్న మన్‌ప్రీత్ కౌర్ మహిళల విభాగంలో కాంస్యం కొల్లగొట్టింది. శుక్రవారం ఫైనల్లో ఇనుప గుండును 17.17 మీటర్ల దూరం విసిరిన మన్‌ప్రీత్ కంచు మోత మోగించింది. తద్వారా ఆసియాడ్ మహిళల షాట్‌పుట్‌లో పతకం సాధించిన మూడో భారత మహిళగా చరిత్రకెక్కింది. అంతేకాదు.. ఈ విభాగంలో పతకం గెలిచిన మూడో భారత మహిళగా చరిత్ర లిఖించింది.

## మారథాన్‌లో మెరిసిన గుల్వీర్




జపాన్లోని నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు మెరుస్తున్నారు. మారథాన్ పరుగులో గుల్వీర్ సింగ్ పతకంతో మెరిశాడు. 10 వేల మీటర్లలో సత్తా చాటిన గుల్వీర్ రెండో స్థానంలో నిలిచి దేశానికి సిల్వర్ మెడల్ అందించాడు. శుక్రవారం జరిగిన పురుషుల 10 వేల మీటర్ల పరుగులో గుల్వీర్ 28:29.38 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకున్నాడు. అతడి కంటే 1.87 సెకన్ల ముందుగా పరుగు పూర్తి చేసిన బిర్హాను బలెవ్(బహ్రెయిన్) స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

## సైన్స్

# కణం ఒక యంత్రం

శాస్త్రంలో ఒక స్వయంబలపరిచే చక్రం పనిచేస్తుంటుంది. శాస్త్రవేత్తలు వాస్తవికతను వివరించేందుకు కొన్ని నమూనాలను ప్రతిపాదిస్తారు. ఆ నమూనాలను పరీక్షించేందుకు ప్రయోగ పద్ధతులు, పరికరాలను రూపొందిస్తారు. ఆ పరికరాలు ఏవిషయాలను కనుగొనగలమో నిర్ణయిస్తాయి. అదేసమయంలో మన నమూనాలు మొదట ఏ పరికరాలను రూపొందించాలో నిర్దేశిస్తాయి. ఒక సిద్ధాంత నమూనా చాలాకాలం ఉపయోగకరంగా ఉండవచ్చు. అయితే దాని ప్రాథమిక పరిమితులు బయటపడినప్పుడు దాన్ని పునఃపరిశీలించాల్సి వస్తుంది. కణాన్ని అర్థం చేసుకోవడంలో జీవశాస్త్రం ఇప్పుడు అలాంటి పునఃపరిశీలన చేయాల్సిన దశకు చేరుకుంది. 1961లో ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు ఫ్రాన్స్వా జాకబ్, జాక్వెస్ మోనో జన్యు వ్యక్తీకరణ సూత్రాలను వివరించినప్పుడు, జీవ అణువులు కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లోని 'షరతుతో కూడిన ప్రకటన' (కండిషనల్ స్టేట్‌మెంట్) మాదిరిగా పనిచేస్తాయని భావించారు. 1973లో భౌతిక శాస్త్రవేత్త చార్లెస్ హెచ్.బెన్నెట్, డిఎన్‌ఎ నమూనా ఆధారంగా మెసెంజర్ ఆర్‌ఎన్‌ఎ తయారు చేసే ఆర్‌ఎన్‌ఎ పోలీమెరేస్ అనే ప్రొటీన్‌ను ట్యూరింగ్ యంత్రంతో పోల్చాడు. కానీ ఒక కణాన్ని కంప్యూటర్‌తో సమానమని పోల్చడం పూర్తిగా అసంబద్ధం. ఆవిరిటర్బయిన్ వంటి యంత్రంలోని ప్రతిభాగాన్ని విడివిడిగా అధ్యయనం చేసి మొత్తం యంత్రాన్ని అర్థం చేసుకోవచ్చు. కణానికి ఆ పద్ధతి పూర్తిగా సరిపోదు. ఒక కణంలో కోట్లాది, బిలియన్ల కొద్దీ పరస్పరం ప్రభావితం చేసుకునే అణువులు ఉంటాయి. వాటి ప్రవర్తన పరిసర పరిస్థితులను బట్టి నిరంతరం మారుతుంది. కణం ఒక యంత్రం అనే మానసిక నమూనా జీవశాస్త్రంలో ఉపయోగించిన పరికరాలు, పరిశోధ నా పద్ధతులపైనా ప్రభావం చూపింది. ఉదాహరణకు ప్రోటీన్లు ఘనపదార్థాల కంటే ద్రవాల్లా ప్రవర్తిస్తాయి. కణంలో అవినిరంతరం కదులుతూ, కొద్దిగా భిన్నమైన డజన్ల నుంచి వందల ఆకృతులను స్వీకరిస్తాయి. కానీ మనం వాటి గురించి రూపొందించే స్థిరమైన చిత్రాలు వాటి వాస్తవ స్వభావాన్ని వక్రీకరించవచ్చు. జాన్‌కెండ్రూ మొదటిసారిగా ఒక ప్రోటీన్ యొక్క అణు నిర్మాణాన్ని వెల్లడించాడు. వేల్స్ నుంచి లభించిన మయోగ్లోబిన్ నమూనాలను సేకరించి, వాటిని స్ఫటికాలుగా మార్చి, ఎక్స్రే కిరణాలతో పరిశీలించి, వచ్చిన 'డిఫ్రాక్షన్' నమూనాల ఆధారంగా ప్రోటీన్‌కు ఒక స్థిరమైన త్రిమితీయ రూపాన్ని అందించాడు. ఆ చిత్రాలు శాస్త్రానికి అపారమైన ఉపయోగం చేశాయి. అయితే అవి కణంలోని ప్రోటీన్ యొక్క నిరంతర చలనశీలతను



చూపించలేవు. ఒంటరిగా అణువులను అధ్యయనం చేయడం వల్ల కణం గురించి అసంపూర్ణ దృశ్యం ఏర్పడుతుంది. గతంలో జీవ అణువులను అవి సహజంగా ఉన్న పరిస్థితుల్లో, స్థలం మరియు కాలంతో పాటు అధ్యయనం చేయడానికి తగిన పద్ధతులు చాలాతక్కువగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. కొత్త సాంకేతికతలు కణాలను మనిషి నిర్మించిన యంత్రాల కంటే ఎంతో సంక్లిష్టమైన, చలనశీలమైన వ్యవస్థలుగా చూపిస్తున్నాయి. దీనికి 'ట్రాన్స్క్రిప్టోమిక్స్' ఒక మంచి ఉదాహరణ. ఈ పద్ధతి మెసెంజర్ ఆర్‌ఎన్‌ఎ పరిమాణాన్ని కొలుస్తుంది. సాధారణ ప్రయోగంలో కోట్లాది కణాలను పెంచి, ఒక నిర్దిష్ట సమయంలో వాటిని పగులగొట్టి, ఆర్‌ఎన్‌ఎను వెలికితీసి, డిఎన్‌ఎ కాపీలుగా మార్చి, ప్రతి క్రమం ఎంత ఉందో లెక్కిస్తారు. ఈ పద్ధతి పిండం అభివృద్ధిలో పనిచేసే జన్యువులను, సూక్ష్మ జీవుల్లో యాంటీబయాటిక్ నిరోధకతకు కారణమయ్యే జన్యువులను గుర్తించడంలో ఉపయోగపడింది. అయితే దీనికి రెండు ప్రధాన పరిమితులు ఉన్నాయి. కణాలను పగులగొట్టిన ఆ ఒక్క క్షణంలోని ఆర్‌ఎన్‌ఎ పరిమాణమే నమోదవుతుంది. కానీ కణాలు నిరంతరం జన్యువ్యక్తీకరణను పెంచుతూ, తగ్గిస్తూ ఉంటాయి. ఆ చలనశీలత కనిపించదు. రెండోది, కోట్లాది కణాల్లోని ఆర్‌ఎన్‌ఎ పరిమాణాలను విశ్లేషించి, సగటు పరిణామాలను ఖరారు చేస్తారు. దాంతో ఒక్కో కణం మధ్య తేడాలు కనుమరుగవుతాయి. ఫలితంగా ఆర్‌ఎన్‌ఎ పరిమాణం స్థిరంగా ఉన్నట్టుగా కనిపిస్తుంది. వాస్తవానికి ఒక కణం నుంచి మరొక కణానికి 'జీన్‌ఎక్స్‌ప్రెషన్' గణనీయంగా మారవచ్చు.

కణాల స్థూల అధ్యయనాన్ని అంధులు ఏనుగును తడిమి దాని స్వరూపాన్ని అంచనా వేసే కథతో పోల్చవచ్చు. ఒకడు తొండాన్ని తాకి దాన్ని మందమైన పాముగా భావిస్తాడు. మరొకడు చెవిని తాకి విసనకర్రగా చెబుతాడు. ఇంకొకడు కాలును తాకి చెట్టులా ఉందంటాడు. ప్రతి ఒక్కరి పరిశీలనలో కొంత నిజం ఉన్నప్పటికీ, మొత్తం ఏనుగును ఎవరూ చూడలేదు. కణాన్ని విడివిడిగా భాగాలుగా అధ్యయనం చేయడం కూడా ఇలాంటిదే. సంపూర్ణ దృశ్యం వచ్చినప్పుడే వాస్తవ అవగాహన ఏర్పడుతుంది. కొత్త పద్ధతులు ఇప్పుడు డిఎన్‌ఎ, ఆర్‌ఎన్‌ఎ ప్రోటీన్లను వాటి సహజ సందర్భాల్లో పరిశీలించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. డిఎన్‌ఎ విషయంలో మానవ జన్యుక్రమంలోని సుమారు 3.2 బిలియన్ డిఎన్‌ఎ అక్షరాలను గుర్తించేందుకు హ్యూమన్ జెనోమ్ ప్రాజెక్టు ప్రారంభమైంది. 2003లో దాని మొదటి ముసాయిదా వెలువడింది. అయినప్పటికీ డిఎన్‌ఎ సీక్వెన్స్ అంటే అక్షరాల వరుస మాత్రమే. ఆ అక్షరాలకు అర్థం ఎలా వస్తుందన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వాలంటే డిఎన్‌ఎ భౌతిక నిర్మాణాన్ని కూడా చూడాలి. హెచ్‌ఐసి వంటి విధానాలు డిఎన్‌ఎలోని క్రోమోజోమ్ భాగాలు త్రిమితీయ ప్రదేశంలో ఎలా ముడుచుకుని, పరస్పరం ఎలా తాకుతాయో వెల్లడించాయి. కొన్ని కేన్సర్లు, అభివృద్ధి సంబంధిత రుగ్మతలు జన్యు



వులు సరిగ్గా ముడుచుకోకపోవడం వల్ల కూడా ఏర్పడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అంటే డిఎన్‌ఎ అర్థాన్ని దాని రసాయనక్రమం మాత్రమే నిర్ణయించదు. దాని త్రిమితీయ అమరిక కూడా కీలకమే. ఆర్‌ఎన్‌ఎ విషయంలో 'సింగిల్‌సెల్ ట్రాన్స్క్రిప్టోమిక్స్' ఒక ముఖ్యమైన ముందడుగు. ఇది కోట్లాది కణాల సగటు కాకుండా ఒక్కో కణంలోని ఆర్‌ఎన్‌ఎను విడిగా కొలుస్తుంది. అయితే ఇది కూడా ఒక నిర్దిష్ట సమయంలోని స్థితినే చూపిస్తుంది. 2019లో స్విట్జర్లాండ్‌లోని పరిశోధకులు 'లైవ్‌సెక్' అనే పద్ధతిని అభివృద్ధి చేశారు. కణాన్ని విడగొట్టకుండానే, దాని నుంచి అతి స్వల్ప పరిమాణంలో ఆర్‌ఎన్‌ఎను తీసుకుని విశ్లేషించే విధానాన్ని కనుగొన్నారు. అదే కణం నుంచి మళ్లీ మళ్లీ నమూనాలు తీసుకోవడం ద్వారా కాలక్రమంలో ఆర్‌ఎన్‌ఎ ఎలా మారుతుందో గమనించవచ్చు. మానవ రోగనిరోధక వ్యవస్థలోని 'మాక్రోఫేజెస్'ను అధ్యయనం చేసినప్పుడు, ప్రతి కణం బ్యాక్టీరియా సంకేతానికి ఒకే విధంగా స్పందించదని, కణ జీవచక్రంలోని దశను బట్టి స్పందన మారుతుందని ఈ పద్ధతి చూపించింది.

# జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్య ద్రోహి

## సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యులు జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్య ద్రోహి అని, అతడిని వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేవిధంగా వ్యవహరించిన జ్ఞానేష్ కుమార్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు. సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను పక్కనపెట్టి బిజెపికి అనుకూలంగా వ్యవహరించి ఫలితాలను తారుమారు చేసిన జ్ఞానేష్ కుమార్ దేశ ఎన్నికల చరిత్రకు తీరని కలంకాన్ని తీసుకువచ్చారన్నారు. బిజెపి మూడవ సారి గెలుపు కోసం అడ్డదారులు తొక్కిందని ఆది నుంచి ఆరోపిస్తున్నట్లుగానే ఎన్నికల కమిషన్ ఏర్పాటులో కొత్త నిబంధనలను తీసుకువచ్చిందన్నారు. 2004 పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో పాటు జ్ఞానేష్ కుమార్ ఎన్నికల సంఘం బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికలను రద్దు చేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా ఉన్న భారత్‌లో ఇవిఎంల ద్వారా ఫలితాన్ని మార్చివేశారని ప్రజల అభిప్రాయం ప్రస్ఫూటం కాలేదన్నారు. జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని దేశ వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా పన్నులు విధిస్తుందని గతంలో జిఎస్‌టి పేరుతో దోపిడీ చేసిన ప్రభుత్వం యుపిఐ ఛార్జీల ద్వారా ప్రజల నడ్డివిరిచేందుకు ప్రయత్నిస్తుందని హేమంతరావు ఆరోపించారు. బిజెపి దేశ ప్రజల పక్షాన కాకుండా కార్పొరేట్ల పక్షాన పాలన చేస్తుందని అతి కొద్ది మంది కోసమే మోదీ ప్రధానిగా వ్యవహరి



స్తున్నారన్నారు. మోదీ 12 ఏళ్ల పాలనలో పేద, సామాన్య ప్రజలకు అనుకూలంగా ఒక చట్టం తేకపోగా అనుకూలంగా ఉన్న చట్టాలను మార్పు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా వ్యవహరిస్తుందన్నారు. గడిచిన కొన్ని రోజులుగా భూ సమస్యలు ముఖ్యంగా 22ఎ పై రాష్ట్రం అట్టుడుకుతుందని ఆయన తెలిపారు. భూ సమస్యకు నిర్దిష్ట పరిష్కారం చూపాలని మూడు ప్రధాన పార్టీలు అయినా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పరస్పర ఆరోపణల నడుమ ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయని హేమంతరావు తెలిపారు. ప్రజా సమస్యలు చర్చించాల్సిన సమయంలో వ్యక్తిగత దూషణ బీషణలు ఎజెండా పైకి వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏఒక్క హామీని సరైన రీతిలో అమలు చేయలేదని, ముఖ్యంగా పింఛన్లు, ఇందిరమ్మ భరోసా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బహుముఖ పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులు హరిస్తున్న మోదీ సర్కార్

## ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు బందరపు వెంకటేశం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కేంద్రంలోని మోదీ సర్కార్ నూతన చట్టాలు, లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులు హరిస్తుందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు బందరపు వెంకటేశం ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన ఎఐటియుసి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం తొలిసారి భువనగిరికి వచ్చిన బందారపు వెంకటేశంకు ఎఐటియుసి యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో వెంకటేశం మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమాన్ని కాపాడేందుకు ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందన్నారు. కార్మికులకు అనుకూలంగా ఉన్న చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, కార్మిక హక్కులకు భంగం కలిగించే చర్యలను తిప్పికొట్టేందుకు ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేయాలని వెంకటేశం పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం సంఘటితంగా ఉద్యమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాలు, యాజమాన్యాలపై నిరంతరం ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు. జిల్లాలో ఎఐటియుసిని మరింత బలోపేతం చేసేందుకు ముందుకు సాగాలని నాయకులకు సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన బందారపు వెంకటేశంకు జిల్లా నాయకులు అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో ఎఐటియుసి మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.



కార్యక్రమంలో ఎఐటియుసి యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, ఉపాధ్యక్షులు గనబోయిన వెంకటేష్, కోశాధికారి సామల శోభన్ బాబు, నాయకులు తిరుమలేష్, శ్రీనివాస్, పిన్నం జగన్, లింగాల నరసింహ, పర్వతాలు, రాములు, అశోక్, రమేష్, రవి, కృష్ణ, వెంకటేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలి

## సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ :** స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ భగత్‌సింగ్ స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 27 నుండి 30 వరకు జరిగే భగత్‌సింగ్ 119వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా బిక్షపతి, అతిధులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, ఎఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎన్ఎ.స్టాలిన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ మతచాందసవాద విధానాలు, సామ్రాజ్యవాద దోపిడీ పాలసీపై పోరాటం చేసేందుకు యువతరం షహీద్ భగత్‌సింగ్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొవాలన్నారు. అంతరాల వ్యవస్థను ధ్వంసం చేస్తూ, సమాజ మార్పు కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చడంతో పాటు జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తాటికంటి మమత, గుగులోత్ సురేష్, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు తదితరులు పాల్గొన్నారు.



### వ్యవసాయానికి రోజుకు 16 గంటల నాణ్యమైన విద్యుత్ అందించి..

# ఎండుతున్న పంటలను కాపాడాలి

## సిపిఐ నేత పల్లా నర్సింహారెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/దేవరకొండ :** ఎండుతున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం రోజుకు కనీసం 16 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండ ఎడిఇ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్ద ఎత్తున జరిగిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఒకవైపు ఎల్‌నిఒ ప్రభావం, మరోవైపు విద్యుత్ కొరత రోజుకు 7 నుండి 9 గంటల వరకు మాత్రమే కరెంటు ఇస్తున్న కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించి నీటిని ఆదాచేసి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లను నింపి ఉంటే ప్రస్తుతం రైతులకు ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి వచ్చేది కాదన్నారు. వ్యవసాయానికి అవసరమైన మేరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరయాయాలు ఏర్పడటంతో రైతుల మోటార్లు కాలిపోతున్నాయని, మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. క్రాప్ హాలిడే ప్రకటించడం పరిష్కారం కాదని, పంటల సాగుకు అవసరమైన నీరు, విద్యుత్ అందించి వ్యవసాయాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దేశంలోని అనేక ప్రాంతాలలో ఎల్‌నిఒ ప్రభావం ఉన్నప్పటికి తెలంగాణలో రైతులు పంటలు సాగు చేయకుండా క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడడం ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక లోపానికి నిదర్శనమన్నారు. వ్యవసాయానికి రోజుకు కనీసం 16 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ సరఫరాలో తరుచూ




అంతరాయాలు లేకుండా నిరంతర సరఫరా చేయాలన్నారు. విద్యుత్ కోతల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రత్యేక పరిహారం ప్యాకేజీ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్షాభావ పరిస్థితులలో ఎండలు తీవ్రంగా ఉన్నాయని విద్యుత్ వినియోగం పెరుగుతుందన్నారు. ప్రజల కోసం అవసరమైతే ఇతర రాష్ట్రాల నుండి విద్యుత్ కొనుగోలు చేయాలన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరమణ, సుదర్శన్‌రెడ్డి, కనకాచారి, వెంకటయ్య, వెంకటయ్య, జయరాములు, విజేందర్ రెడ్డి, శైలేష్, రామస్వామి, రంగారెడ్డి, నాయకులు రామాంజనేయులు, అంజల్‌రావు, ఆంజనేయులు, నవీన్, వినయ్, దేవీలాల్, వెంకటేశ్వర్లు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థపై పాలకుల నిర్లక్ష్యం

## ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/బోడుప్పల్(హైదరాబాద్) :** విద్యా వ్యవస్థపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, అన్నారు. శుక్రవారం బోడుప్పల్ సర్కిల్‌లో జరిగిన ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 4వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉప్పల్ డిపో వద్ద ఉన్న ది వ్యూ ఫంక్షన్ హాలు ప్రాంగణంలో జరిగిన మహాసభల్లో అరుణపతాకాన్ని సిపిఐ మేడ్చల్ కార్యదర్శి ఉమా మహేష్‌ఉ అవిష్కరించారు. మహాసభలో పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యా రంగ పరిరక్షణ కోసం నిర్వహించిన పోరాటాలను వివరించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్లల్లో వసతుల లేమి, నిరుద్యోగం వంటి అంశాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పరిష్కరించాలన్నారు. విద్య ప్రతి పేద విద్యార్థికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా నిర్మాణ బాధ్యులు ఉమా మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యల పరిష్కారించే వరకు విద్యార్థి నాయకులు విశ్రమించొద్దన్నారు. మహాసభలో సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్నబాబు, ఎండి అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు శ్రీకాంత్, బద్రి, సద్గురు చారి, శివమణి, ప్రణవ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## పింఛన్లకు లంచం డిమాండ్

### ముగ్గురు ఉద్యోగుల పై వేటు

**ప్రజాపక్షం / సూర్యాపేట:** పదవీ విరమణ పొందిన తోటి ఉద్యోగిణి పింఛను ప్రతిపాదనలు పంపడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు లంచం డిమాండ్ చేసిన ముగ్గురు ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్లాల్ పవార్ శుక్రవారం వేటు వేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. షెడ్యూల్ కులాల ( ఎస్ సి ) అభివృద్ధి శాఖలో విధులు నిర్వర్తించిన ఓ ఉద్యోగిణి గత మార్చి నెలలో పదవీ విరమణ పొందారు. అయితే ఆమెకు రావాల్సిన పెన్షన్ , ఇతర బెనిఫిట్స్ తాలూకు ఫైల్ (పెన్షన్ ప్రపోజల్) ఎప్పటికప్పుడు పై కార్యాలయానికి పంపించాల్సి ఉండగా.. గతంలో పని చేసిన అధికారిణితో పాటు సంబంధిత విభాగ ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించారు. ఆ శాఖకు చెందిన గతంలో పనిచేసిన సీనియర్ అధికారిణితో పాటు సీనియర్ అసిస్టెంట్ జి.రవివర్మ, జూనియర్ అసిస్టెంట్ బి.యాదగిరి, అటెండర్ బి.రాము పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. అడిగిన మొత్తం ఇస్తేనే ఫైలుపై సంతకాలు చేసి పైకి పంపుతామని చెప్పడంతో ఆ మొత్తం ఇచ్చేందుకు సదరు విశ్రాంత ఉద్యోగిని నిరాకరించడంతో నెలల తరబడి ఫైల్ ముందుకు కదల్లేదు. దీనితో ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఆయన సమగ్ర విచారణకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విచారణ లో ఉద్యోగులు లంచం డిమాండ్ చేసిన మాట వాస్తవమేనని, విధుల్లో తీవ్ర అలసత్వం, బాధ్యతారాహిత్యం ప్రదర్శించారని తేల్చారు. విచారణ నివేదిక ఆధారంగా ముగ్గురిని విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు ఎవరైనా విధుల్లో అలసత్వం వహించినా, ప్రజలను లేదా విశ్రాంత ఉద్యోగులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ లంచాల కోసం వేధించినా ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు.

## పన్నులు, చార్జీల పేరుతో సామాన్య ప్రజలపై మోయలేని భారాలు

### సిపిఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** పన్నుల చార్జీల పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలపై మోయలేని భారాలు మోపుతుందని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలో సిపిఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. యూపిఐపై విధించిన చార్జీల నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ఎన్నికల ముందు బిజెపి ధరలను నియంత్రిస్తామని పదేపదే ఉపన్యాసాలు ఇచ్చారని, గడిచిన 12 సంవత్సరాలుగా పెట్రోల్, డీజిల్, సిలిండర్ ధరలు విపరీతంగా పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అధిక భారాన్ని మోపారని విమర్శించారు. యుపిఐ చెల్లింపుల ద్వారా ఎటువంటి చార్జీలు విధించమని ఆనాడు తెలిపి ఒక ప్రణాళిక బద్ధంగానే ముందు ఉచితంగానే సేవలు అందిస్తామని ఆ తర్వాత విపరీతమైన చార్జీలు వసూలు చేయడం సర్వసాధారణంగా మారిపోయిందన్నారు. ఇప్పటికే జిఎస్‌టి పేరుతో వేల కోట్ల రూపాయలను ప్రజల నుంచి కేంద్రం వసూలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చిలక రాజు శ్రీను, కొమ్మరాజు వెంకట్, ఊదర వెంకన్న, బత్తిని శ్రీనివాస్ గౌడ్, వజ్రపు వెంకటేశ్వర్లు, బండి శ్రీనివాస్, బి. సైదా, నన్నెపంగ నగేష్, బెల్లంకొండ గణేష్, మాధవరెడ్డి, మైక్ వెంకన్న పాల్గొన్నారు.

## చదువుతోనే ఉన్నత శిఖరాలు

### రాష్ట్ర ఎస్‌టి, ఎస్‌సి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** చదువుతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం చైర్మన్ బక్కి వెంకటయ్య కమిషన్ సభ్యులతో కలిసి మండల పరిధిలోని దంజిలాల్‌తండా గేటు వద్ద గల ఎస్టి గురుకుల పాఠశాలను సందర్శించారు. వంట గది, స్టోర్ రూం పరిసరాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న కూరగాయలు, వంటనూనె, పండ్లు, గుడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో గల సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కంపౌండ్ వాల్, వాష్ రూం, బోర్ అవసరం అని విద్యార్థులు చైర్మన్‌కు తెలిపారు. కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. కమిషన్ సభ్యుడు నేనావత్ రాంబాబునాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెరుగైన విద్యను సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్సి, ఎస్టి కమిషన్ సభ్యులు రేణిగుంట ప్రవీణ్, లక్ష్మీ నారాయణ, జిల్లా శంకర్, స్థానిక సంస్థల ఇంచార్జీ అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్‌థియాన్ మావి, డిటిడివో కమలాకర్‌రెడ్డి, ఆర్‌సివో శ్రీనివాసరావు, ఏసిఎంవో వెంకటేష్‌నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ అడ్డగోలు హామీలతో పట్టభద్రులను మభ్యపెట్టే ప్రయత్నం

### యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సెప్టెంబర్ 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొని అత్యధిక సంఖ్యలో పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహాయ ఇంచార్జి భవ్యతో కలిసి యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను యువజన కాంగ్రెస్ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు బిఆర్‌ఎస్ పార్టీ అడ్డగోలు హామీలతో పట్టభద్రులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అయితే పట్టభద్రులు గత పాలనను దృష్టిలో ఉంచుకుని తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని ప్రతి నియోజక వర్గం, ప్రతి మండలం, ప్రతి పట్టభద్రుడి వరకు యువజన కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గూడూరు నిఖిల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జి సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జోహార్, నవీన్ ఆచారి, కొత్త విద్యరెడ్డి, శ్రావ్యరెడ్డి పాల్గొన్నారు.

# పిఎసిఎస్‌లో రూ.23 లక్షల అక్రమాలు

### దొంగలను వదిలేది లేదు

### సర్వసభ్య సమావేశంలో సిఇఒను నిలదీసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

### అవినీతిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే ఫిర్యాదు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అర్థ వార్షిక సర్వసభ్య సమావేశంలో యూరియా బస్తాల అవినీతి వెలుగు చూసింది. శుక్రవారం నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పిఎసిఎస్‌లో జరిగిన రూ.23 లక్షల భారీ అవినీతి, అక్రమాలపై తీవ్రంగా మండిపడ్డారు. సొసైటీ పరిధిలో 450 బస్తాల యూరియా, 700 బస్తాల డీఏపీ అమ్మకాలకు సంబంధించిన రూ.23 లక్షల సొమ్ము బ్యాంకులో జమ కాకపోవడంపై ఎమ్మెల్యే నేరుగా సీఈవో ఆంజనేయులను సభలోనే నిలదీశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సేల్స్ పాయింట్స్ వద్ద ఈ అక్రమాలు జరిగాయని సీఈవో ఇచ్చిన వివరణపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఎక్కడికి వెళ్లాయి ఈ రూ.23 లక్షలు? ఎందుకు బ్యాంకులో జమ చేయలేదు? ఏ ఊరికి, ఎంతమంది రైతులకు ఎరువుల బస్తాలు ఇచ్చారో కనీస జాబితా ఎందుకు నిర్వహించడం లేదు?' అని ప్రశ్నించారు. గత పాలకవర్గం చేసిన అక్రమాలను దాచిపెట్టే ప్రయత్నం చేయవద్దని, దొంగలను దాచకుండా వారి పేర్లు బహిర్గతం చేయాలని సీఈవోకు హితవు పలికారు. 'గతంలో జరిగిన అవినీతి వల్ల ప్రస్తుత పాలకవర్గానికి చెడ్డ పేరు వస్తోంది, వారి తప్పులకు మీరు బాధ్యులు కావద్దు' అని పేర్కొన్నారు. దీనికి సీఈవో జవాబిస్తూ... సొసైటీలో పనిచేస్తున్న అందరం కలిసి అమ్మామని, అందరమూ బాధ్యులమేనని, సంఘానికి నష్టం వాటిల్లకుండా ఆ డబ్బును బ్యాంకులో కడతామని సభ దృష్టికి తెచ్చారు.

**వ్యవసాయ శాఖ మంత్రికి ఫిర్యాదు :** పిఎసిఎస్‌లో జరిగిన ఈ భారీ కుంభకోణంపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెంటనే స్పందిస్తూ, వేదిక పైనుంచే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, నిజనిర్ధారణ కమిటీ ద్వారా బాధ్యులను కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'నేను పక్కా రైతు బిడ్డను, రైతుల సొమ్ము రూపాయి కూడా పోనివ్వను. రైతుల కష్టార్జితాన్ని తిన్నవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు, వారి పొట్టలో చెయ్యి పెట్టి మరీ ఆ సొమ్మును కక్కిస్తాం' అని హెచ్చరించారు. డీసీసీబీ అధికారుల పర్యవేక్షణలో రెండు రోజుల్లో విచారణ పూర్తవుతుందని తెలిపారు. పిఏసిఎస్ చైర్మన్ చీర్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## త్రిపురారం పిహెచ్‌సి భవనం ఖాళీ.. గ్రంథాలయంలోకి వైద్య సేవలు

### 'ప్రజాపక్షం' కథనంతో కదిలిన అధికార యంత్రాంగం



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/త్రిపురారం:** శిథిలావస్థకు చేరిన త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనం పరిస్థితిపై 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రచురించిన కథనంతో అధికార యంత్రాంగం కదిలింది.గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పిహెచ్‌సి భవనం పైకప్పు నుంచి పెద్ద ఎత్తున పెచ్చులు ఊడిపడుతుండటంతో సిబ్బంది,రోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన నెలకొన్న నేపథ్యంలో అధికారులు తక్షణ చర్యలకు ఉపక్రమించారు.

**గ్రంథాలయంలోకి వైద్య సేవలు :** పిహెచ్‌సి భవనం పరిస్థితిని సంబంధిత అధికారులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాహుల్ ఆదేశాల మేరకు ప్రస్తుత పిహెచ్‌సి భవనాన్ని వెంటనే ఖాళీ చేసి,మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనంలో వైద్య సేవలు కొనసాగించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎంపీడీవో విజయకుమారి,మండల వైద్యాధికారి డాక్టర్ వనితతో కలిసి సాగర్ రోడ్డులోని ఎంఆర్‌సీ కార్యాలయ సమీపంలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు.ఇకపై అక్కడి నుంచే పిహెచ్‌సి వైద్య సేవలను కొనసాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.దీంతో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పాత భవనంలో వైద్య సేవలు నిర్వహించాల్సిన పరిస్థితికి తాత్కాలికంగా పరిష్కారం లభించింది.

## గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

### ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు




**ప్రజాపక్షం/యాదాద్రి :** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి గ్రామ వనరుల మ్యాప్ ద్వారా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో వీజీపీపీ గ్రామ సభల ద్వారా విబిజీరామ్‌జీ పనుల గుర్తింపుపై జిల్లాలోని మండలాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వికసిత్ గ్రామాల అభివృద్ధి ప్లాన్ తయారీ అమలు పై అవగాహన కార్యక్రమం లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అందుబాటులో ఉన్న సామాజిక, ఆర్థిక, మౌలిక వసతులు, మానవ వనరులను గుర్తించి, వాటి ఆధారంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా వీబీజీరామ్‌జీ పథకం కింద 375 పనులకు 125 రోజుల పనులను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రణాళికలను ప్రజల ముందుంచి ఆమోదం పొందిన అనంతరం పనులను అమలు చేయాలన్నారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు, నీటి సంరక్షణకు సంబంధించిన పనులను వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికలో ఎక్కువగా గుర్తించి అమలు చేయాలని తెలిపారు.ఫామ్ పాండ్, ఇంకుడు గుంతలు తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ పిఎంఒ సరిత, జెడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఆడిషనల్ డిఆర్‌డిఓ సురేష్, డిప్యూటీ సిఈఓ శ్రీనివాస్, ఏపీడీ నవీన్, జిల్లా రిసోర్స్ పర్సన్ రాజశేఖర్, జిల్లా స్థాయి అధికారులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ నూకల జానకి సేవలు చిరస్మరణీయం

### రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఉపాధ్యాయురాలుగా, కామ్రేడ్‌గా, తెలంగాణ ఉద్యమకారిణిగా నూకల జానకి చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని షాదిఖానాలో కామ్రేడ్ నూకల జానకి సంతాప సభను నిర్వహించారు. ఈ సంతాప సభకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్ సభ అధ్యక్షత వహించగా, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వక్కంతుల కోటేశ్వరరావు సంతాప సభను ఉద్దేశించి మాట్లాడారు. కామ్రేడ్ నూకల జానకి విద్యార్థి దశ నుండి విప్లవ విద్యార్థి భావాలను పునికి పుచ్చుకుని డిఎస్‌వోలో పని చేశారని అన్నారు. తోటి విప్లవ విద్యార్థి సంఘమైన పిడిఎస్‌యు అప్పటి జిల్లా నాయకులు నూకల నరేంద్రను ఆదర్శ కులాంతర, మతాంతర వివాహం చేసుకున్నారని గుర్తు చేశారు. విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య మాట్లాడుతూ అనారోగ్యంతో సుదీర్ఘకాలం బాధపడుతూనే తెలంగాణ ఉద్యమంలో తను ఉపాధ్యాయురాలిని అనే విషయం కూడా మరిచిపోయి వంటావార్పు, సకలజనుల సమ్మె అనేక పోరాటాలలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య పాఠశాల కరస్పాండెంట్ మేరెడ్డి ఎల్లారెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, ఎల్లావుల రాములు, వెంకటేశ్వర్లు, మేకల నాగేశ్వరరావు, సైదిరెడ్డి, పాండు, కెఎల్‌ఎన్‌రావు, కాకి అజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, పశ్య శ్రీనివాసరెడ్డి, బిక్షం, చందర్‌రావు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి




సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఎంఆర్ఐ స్కానింగ్,గుండె,న్యూరో సర్జరీ,కిడ్నీ,లివర్ సంబంధిత ప్రత్యేక వైద్య విభాగాలను ఏర్పాటు చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో గంట సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సిపిఐ నల్లగొండ నియోజకవర్గ సమావేశంలో పబ్బు వీరస్వామి మాట్లాడారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు,ఆధునిక వైద్య పరికరాలు,నిపుణులైన వైద్యులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల వైద్యం కోసం హైదరాబాద్ కు వెళ్తున్న సందర్భంలో మార్గం మధ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా నల్లగొండ పట్టణంలో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు దోటి అక్కయ్య, అంబాల నరసింహ, జోగు సురేందర్, పి.సుజాత, వీరయ్య, అన్నిమల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో తాత్కాలిక ప్రాతిపదికన నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నైట్ వాచ్ వుమెన్1 పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణతతో పాటు సెక్యూరిటీ ఏజెన్సీ శిక్షణ, హెడ్ కుక్1 పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణతతో పూర్తి స్థాయి వంట అనుభవం, అసిస్టెంట్ కుక్1 పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణతతో వంట అనుభవం ఉండాలని పేర్కొన్నారు.18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను 28వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు కేజీబీవీ వలిగొండలో అందజేయాలని సూచించారు.

# ఇసుక పాలసీకి తూట్లు!

### ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి...!!

### అక్రమ రవాణాదారులకు అండగా అధికార పార్టీ నేతలు!!

### నెలవారీ మామూళ్ళతో సరిపెడుతున్న పోలీసులు?






**ప్రజాపక్షం/సూర్యాపేట :** అక్రమ ఇసుక రవాణాను అరికట్టి భవన నిర్మాణదారులకు సరసమైన ధరకు అందించడంతోపాటు ఖజానాకు ఆదాయం సమకూరేలా ప్రభుత్వం జిల్లాలో ఇసుక పాలసీని గత ఏడాది క్రితం అమల్లోకి తెచ్చింది. మన ఇసుక మన వాహనం పేరుతో ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి అనుకున్న చోటుకే ఇసుకను సరఫరా చేయడం జరుగుతుంది. ఇసుకను రవాణా చేసేందుకు మైనింగ్ అధికారులు ట్రాక్టర్ యజమానుల నుండి దరఖాస్తులు స్వీకరించి రూ.20వేల డిపాజిట్‌తో అనుమతులు ఇవ్వడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఇసుక పాలసీ ద్వారా ఇసుకను రవాణా చేసేందుకు దాదాపు 700కు పైగా వాహనాలు అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంతో పాటు ఇతర వాగులు ఎక్కువగా ఉండడంతో ఇసుక లభ్యత లభ్యత ఎక్కువగా ఉన్న తుంగతుర్తి నియోజక వర్గంలోని జాజిరెడ్డిగూడెం మండలం తుంగగూడెం, నాగారం మండలంలోని పేరబోయినగూడెం, తిరుమలగిరి మండలంలోని తాటిపాముల, నూతనకల్ మద్దిరాల మండలాలలోని గుండ్లసింగారం వాగు, కోదాడ నియోజక వర్గంలోని అనంతగిరి మండలంలోని వాగుకు ఇసుక రవాణా చేసేందుకు మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారు. అక్రమ ఇసుక రవాణాదారులు ఇసుక పాలసీకి తూట్లు పొడిచి ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్నారు. మైనింగ్ అధికారులు అనుమతి ఇచ్చిన ప్రాంతాల నుండి కాకుండా అనుమతులు లేని ఇసుక లభ్యమయ్యే ప్రాంతాల నుండి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. సూర్యాపేట నియోజక వర్గం పెన్‌పహాడ్ మండలంలో ఉన్న నాగులపాటి అన్నారం, దోసపహాడు, సూర్యాపేట మండలంలోని కెటి అన్నారం, యండ్లపల్లి, రాయినిగూడెం, కాసరబాద, నేరేడుచర్ల మండలం చిల్లకల్, సోమారం, పాలకీడ మండల పరిధిలో ప్రవహిస్తున్న మూసీ పరివాహక ప్రాంతంలో ఇసుక నిల్వలు ఉన్నా అధికారులు మాత్రం ఇసుక లభ్యత తక్కువగా ఉందనే సాకుతో ఈ ప్రాంతాల్లో ఇసుక పాలసీని తీసుకురాలేదు. దీనితో అక్రమ ఇసుక రవాణాదారులకు అక్రమ ఆదాయ మార్గంగా మారింది. సూర్యాపేట, పెన్‌పహాడ్ మండలాల పరిధిలోని యండ్లపల్లి, రాయినిగూడెం, కాసరబాద, కెటిఅన్నారం, నాగులపాటి అన్నారం, దోసపహాడ్ ప్రాంతాల్లో అక్రమార్కులు మూసీలో నీరు ప్రవహిస్తున్నా ఇసుకను తోడుతూ తెప్పల సహాయంతో బయటకు తెస్తున్నారు. ఇలా సేకరించిన ఇసుకను ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున డంప్‌లు చేసి ఇసుక అవసరం ఉన్న వారికి సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామాల్లో వేలాది ట్రాక్టర్ల ఇసుక డంప్‌లు అడుగడుగునా కనపడుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

అక్రమ ఇసుక రవాణాదారులకు అధికార పార్టీ నేతలు అండగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను అధికారులు గుర్తించి పట్టుకోగానే తక్షణమే దానిని వదలాలని ఒత్తిడి తేవడంతో వదిలేస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొంతమంది పోలీసు అధికారులు అక్రమ ఇసుక రవాణాదారులతో సెటిల్‌మెంట్ చేసుకొని నెలవారీ మామూళ్ళు తీసుకొని సరిపెడుతున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. దాదాపు ఒక్కొక్క పోలీస్ స్టేషన్ పరిధిలో 60 నుండి 100 వరకు ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండగా ఒక్కొక్క దానికి రూ.15వేలు ఖరారు చేసుకొని వీటి వసూళ్ళకు ప్రత్యేక దఫేదారి వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఇకనైనా ఉన్నతాధికారులు ఈ అక్రమ ఇసుక రవాణాను అరికట్టి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మానవత్ తండాలో కత్తుల కలకలం...

### కడుపులో కత్తిపోటుతో వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం మానవత్‌తండాలో గురువారం రాత్రి కత్తులు, కర్రలతో జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. గణేష్ నిమజ్జనం అనంతరం కొందరు మద్యం సేవిస్తుండగా చిన్నపాటి వివాదం తలెత్తి ఇరువర్గాల మధ్య ఘర్షణగా మారినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో నలుగురికి గాయాలైనట్లు సమాచారం, ఘర్షణలో రమావత్ సందీప్‌పై కత్తితో దాడి జరగడంతో కడుపులో తీవ్ర గాయమైంది. గాయం తీవ్రంగా ఉండడం పరిస్థితి విషమించంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మరోవైపు రమావత్ కళ్యాణ్‌పై కర్రలతో దాడి జరగడంతో ఆయనకు కూడా గాయాలయ్యాయి. ఇరువర్గాల మధ్య ఒక్కసారిగా కత్తులు, కర్రలతో ఘర్షణ జరగడంతో తండాలో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఘటనపై ఇరువర్గాలు చందంపేట పోలీసులకు ఫిర్యాదులు చేయగా రెండు వర్గాల ఫిర్యాదులు ఆధారంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. ఘర్షణకు దారితీసిన కారణాలు, ఘటనలో పాల్గొన్న వ్యక్తులు, గాయపడిన వారి వివరాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.



## ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలంలోని పట్టాదారు రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషణ్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు సూచించింది. రెవెన్యూ, అటవీ పట్టాదారు పాస్‌బుక్‌లు కలిగిన రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. రైతులు తమ సమీప మీ సేవ కేంద్రానికి వెళ్ళి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించింది. పంటలను విక్రయించే సమయంలో ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉంటుందని పేర్కొంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం రైతుల పట్టా భూములకు సంబంధించిన సర్వే నంబర్లు , భూ విస్తీర్ణం వివరాలు ఎఫ్ఎఫ్ఎస్(కొత్త ఎరువుల యాప్)లో కనిపిస్తాయని తెలిపింది. పట్టా భూములు కలిగిన రైతులు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా నేరుగా ఎరువులు బుక్ చేసుకోవచ్చని, ఇందుకోసం వ్యవసాయ శాఖను సంప్రదించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పట్టా లేని భూములు సాగు చేస్తున్న రైతులు మాత్రం తమ భూమి వివరాలను ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో నమోదు చేసి, ఆమోదం కోసం వ్యవసాయం శాఖను సంప్రదించాలని సూచించింది. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నెక్కొండ మండల వ్యవసాయశాఖ కోరింది.

## నాజీతండా పాఠశాలలో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ఖానాపురం:** మండలంలోని నాజీతండా ప్రాథమిక పాఠశాలను ఎంపిడిఒ అద్వైత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్ణీత మెనూ ప్రకారం అందించాలని నిర్వాహకురాలికి సూచించారు. అనంతరం బండమీది మామిడితండా గ్రామ పంచాయతీ పరిధిలోని వార్డుల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఎంఇఒ వెంకటరామ్, నాజీతండా పంచాయతీ కార్యదర్శి సతీష్, బండమీది మామిడితండా సర్పంచ్ పాల్గొన్నారు.

## పొంగులేటి పర్యటన విజయవంతం చేయాలి: కొమ్మూరి



**ప్రజాపక్షం /జనగామ:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం జనగామలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నందున కాంగ్రెస్ శ్రేణులు అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కోరారు. శుక్రవారం పొంగులేటి సభ జరిగే ప్రెస్టన్ గ్రౌండ్ మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నందున కాంగ్రెస్ శ్రేణులు సైతం అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు కడకంచి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సన్ని వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ శ్రీనివాస్, చెంచారపు కరుణాకర్‌రెడ్డి, శివరాజ్ యాదవ్, కొత్త కరుణాకర్‌రెడ్డి, మాజిద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్న పోలీస్‌లు



**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** రఘునాథపల్లి మండల కేంద్రం లోని ప్రతిభ స్కూల్లో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే పోలీసులకు అందిన పక్కా సమాచారం అందడంతో వెంటనే గణేష్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఉన్న పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా అక్కడ కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతూ పోలీస్‌లకు కనిపించారు. పోలీస్‌లను చూసిన వెంటనే కొంతమంది అక్కడి నుండి పారిపోయేందుకు ప్రయత్నించగా మరో ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అందులో రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన చెరుకు అజయ్, కోళ్ల రాజు, మరాఠీ శ్రీశైలం, ఎండి రహీం, కర్మికొండ నాగరాజు, శాతరాశి నరేష్, మర్కాల మహేందర్, దుబ్బాక హరీష్‌లు ఉన్నారు. పేకాట స్థావరంలో పోలీసులకు 6,400 నగదు,9 మొబైల్ ఫోన్స్,ఏడు మోటర్ సైకిళ్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అంతేకాకుండా వీరికి సహకరించిన దుబ్బాక నరసింహులు అనే వ్యక్తిపై కూడా పోలీసులు కేసు నమోదు చేసిన్నట్టు ఎస్ఐ తెలిపారు.

## 28 గూడూరు పిఎసిఎస్ మహాజన సభ

**ప్రజాపక్షం/గూడూరు;** స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పిఎసిఎస్) ఆధ్వర్యంలో ఈనెల 28 వ తేదీ సోమవారం ఉదయం 11;00 గంటలకు మహాజన సభ సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం పాలకవర్గం ప్రకటించింది. సంఘం కార్యాలయ ప్రాంగణంలో జరిగే ఈ మహాజన సభకుపిఎసిఎస్ చైర్మన్ చల్ల తింగారెడ్డి అధ్యక్షతన వహిస్తారు. సంఘం పరిధిలోని రైతుల సంక్షేమం పరపతి ప్రణాళికలు అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈమహాజన సభ సమావేశానికి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎబి బర్ధన్‌కు ఘన నివాళులు



**ప్రజాపక్షం/ వరంగల్ :** సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబి బర్ధన్ 102వ వర్థంతి సందర్భంగా ఖిలా వరంగల్ మండలం మార్కండేయ నగర్ పార్టీ కార్యాలయంలో ఏబి బర్ధన్ చిత్రపటానికి సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు, ఎండి అక్బర్ పాషా, సుంకరి భవాని, శాఖ కమిటీ సభ్యులు ధూమాల పద్మ, బాశెట్టి రంజిత్, ఎండి తస్లీమ్, కార్యకర్తలు ధూమల భాను, హరి, అజీమ్, బానోతు సోగ్యా తదితరులు పాల్గొన్నారు

# అక్టోబర్ 25 నుంచి హామ్ రోడ్ల పనులు ప్రారంభం

> గ్రామాల అభివృద్ధికి రూ.50 లక్షలు
> గ్రామ ప్రజలే పనులు నిర్ణయించాలి
> రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హనుమకొండ :** అక్టోబర్ 25 నుంచి హామ్ రోడ్ల పనులు ప్రారంభం కానున్నాయని, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి సీతక్క తెలిపారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న హామ్ రోడ్ల పనులను అక్టోబర్ 25 నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ములుగు జిల్లాలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా హామ్ రోడ్ల పైలాన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ రంగంపై దాని ప్రభావం తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయ కూలీలకు రాంజీ పథకం ద్వారా సుమారు రూ.8 వేల కోట్ల విలువైన పనులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలపై సర్పంచ్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో తాగునీటికి సరిపడా నీటి లభ్యత ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతులు ఏ పంటలు సాగు చేయాలనే అంశంపై ముందుగానే అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇదే తరహాలో రేపు రంగారెడ్డి జిల్లాలో కూడా సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.గుత్తికోయ గూడాల్లో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. దానకిశోర్ సూచనల మేరకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని గుత్తికోయ గూడాలకు తాగునీరు అందించే అంశంపై దివ్య దేవరాజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ పేదరికాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం రూ.67 వేల కోట్లతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే 553 మండలాల్లో ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాలకు అందించినట్లు పేర్కొన్నారు. రాంజీ పథకం ద్వారా ప్రతి గ్రామానికి రూ.50 లక్షలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో ఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నది గ్రామ ప్రజలే నిర్ణయించుకునే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మైనింగ్ స్టాఫ్ హక్కుల పరిరక్షణకు సిద్ధం కావాలి

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ మోట పలుకుల రమేష్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణిలో రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించేందుకు మైనింగ్ స్టాఫ్ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని, అనుకోకుండా జరిగే ప్రమాదాలను సాకుగా చూపి మైనింగ్ సిబ్బందిపై యాజమాన్యం చర్యలు తీసుకోవడం మానుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ మోట పలుకుల రమేష్ యాజమాన్యాన్ని కోరారు. శుక్రవారం భూపాలపల్లి ఏరియాలోని కెటికె వన్ గనిలో మైనింగ్ స్టాఫ్ సిబ్బందిని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్‌ను కలిసి మైనింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారం కోసం చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గనుల్లో సురక్షితమైన పని వాతావరణం కల్పించడంతో పాటు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో మైనింగ్ స్టాఫ్ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారం కోసం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎల్లప్పుడూ వారి వెన్నంటే ఉంటుందని రమేష్ తెలిపారు. మైనింగ్ స్టాఫ్ సిబ్బంది ఒక కమిటీగా ఏర్పడి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకొని తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

**సింగరేణి ఫంక్షన్ హాల్ లోమైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సమావేశం**

భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఆదివారం సింగరేణి ఫంక్షన్ హాల్, సుభాష్ కాలనీలో సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్న మైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసిబ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ పిలుపునిచ్చారు. కావున ఆదివారం జరిగే మైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సమావేశానికి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు జి.శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తోట రామచందర్, పిట్ సెక్రటరీ సద్దానందం పాల్గొన్నారు.

## సీతక్క సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న అనిశెట్టి



**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** పసర గ్రామానికి చెందిన రైస్‌మిల్లు యజమాని అనిశెట్టి రామకృష్ణ బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా అనిశెట్టి రామకృష్ణ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలు విధానాల పట్ల ఆకర్షితులై వివిధ వర్గాల ప్రజలు పార్టీలో చేరుతున్నరని నాయకులు పేర్కొన్నారు. అనిశెట్టి రామకృష్ణ కాంగ్రెస్‌లో చేరడం పార్టీకి మరింత బలం చేకూర్చుతుందని నాయకులు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ములుగు జిల్లా కార్మిక శాఖ అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి కాసర్ల రాంబాబు గుండెబోయిన అనిల్ యాదవ్ కాడబోయిన రవి దేపాక కృష్ణ గొంది కిరణ్ తొడుసు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టెవాడలో గిరిజన ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/గూడూరు;**గూడూరు మండల పరిధిలోని మట్టేవాడ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను (బాలురు) శుక్రవారం జిల్లా కలెక్టర్ స్నే హ శబరీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన డై ట్ మెనూ పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ తదిత ర వివరాలను విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. స్వయంగా విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించిన అనంతరం వారికి యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడు తూ విద్యార్థులకు ప్రభుత్వం నిర్ధేశించిన డైట్ మెనూ ప్రకారం పక్కాగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు.విద్యార్థులతో పాటు వంట సిబ్బందికి కూడా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు సిబ్బందితో పాటు విద్యార్థుల హాజరు వంద శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకొవాలన్నారు. ఇంగ్లీష్ భాషతో పాటు ఇతర సబ్జెక్టులు సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ తరగతులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల వసతి ఆహారం విద్యావిషయాల్లో ఎలాంటి అలసత్యం ప్రదర్శించినా సహించేది లేదని బాధ్యులపై కఠన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశిరామ్ నాయక్ గూడూరు తహశిల్ధార్ నాగభవని పాఠశాల ఉపాధ్యాయులు సంబంధిత అదికారులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



**ప్రజాపక్షం /జనగామ:** రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి పర్యటనను పకడ్బందిగా ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంత్రి పొంగులేటి శనివారం జనగామలో పర్యటించనుండగా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులతో సమీక్షించారు. కార్యక్రమాలు జరిగే మున్సిపల్ కార్యాలయం, ప్రెస్టన్ గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ మంత్రి పర్యటణ సందర్భంగా జనగామ మున్సిపాల్టీకి చెందిన 16 చెత్త సేకరణ నూతన ఆటోలను జెండా ఊపి ప్రారంభిస్తారని, మున్సిపల్ డంపింగ్ యార్డ్ షెడ్, మురుగు నీటి శుద్ధి ప్లాంట్, తహాసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. 174 డబుల్ బెడ్‌రూం ఇళ్ల గృహ ప్రవేశాలు, 500 ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పత్రాలు అందజేస్తారని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం, ప్రెస్టన్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించే ప్రజా సమావేశానికి ఏర్పాట్లు నిర్ణీత గడువులో పుసిస్టమ్, ఎల్ఇడి వీడియో వాల్స్, విద్యుత్ సరఫరా, జనరేటర్లు, ఎయిర్ కండిషనింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, అగ్నిమాపక ఏర్పాట్లు, పార్కింగ్, బారికేడింగ్, వీడియో ఎన్‌క్లోజర్, హెల్ప్ డెస్క్, గ్రీన్ రూమ్, రవాణా, దిశా నిర్దేశక బోర్డుల ఏర్పాట్లు పకడ్బందిగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం మండలాల వారిగా సీటింగ్ బ్లాకులు, కౌంటర్ల ఏర్పాటు చేయాలని, తహాసీల్దార్లు, ఎంపిడిఇలు, ఎంపిఇలు సమన్వయంతో లబ్ధిదారులకు టోకెన్లు ఆధారంగా తీసుకువచ్చి క్రమశిక్షణతో పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం మొత్తానికి ఆర్‌డిఒ పర్యవేక్షించాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా, జనరేటర్, బ్యాకప్, లైటింగ్ ఏర్పాట్లను విద్యుత్ శాఖ అధికారి పూర్తి చేయాలన్నారు. వేదికకు వెళ్లె రహదారులు, బ్యారికేట్లు, మార్గ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. డిసిపి రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక డైవర్షన్ అమలు చేయడం, విఐపి, అధికారులు, మీడియా ప్రజల కోసం వేర్వేరు పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డిఓ గోపిరాం, ఎసిపి భీమ్‌శర్మ, మున్సిపల్ కమీషనర్ రాజశేఖర్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హనుమకొండ వడ్డేపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

అగ్నికి ఆహుతైన సరస్వతి ఎంటర్ ప్రైజెస్ ,సుమారు రూ.4కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా




**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లాలో వడ్డేపల్లి జవహర్ నగర్ క్రాస్ వద్ద భూక్య బద్రు నాయక్ కు సంబంధించిన సరస్వతి ఎంటర్ ప్రైజెస్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది.అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నుంచి అగ్ని పొరలు బయటికి వచ్చి ప్రమాదం సంభవించినట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నారు.వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది అధికారి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో అర్ధరాత్రి నుంచి ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులో తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.విషయం తెలుసుకున్న సుబేదారి సర్కిల్ ఇన్ స్పెక్టర్ రంజిత్ కుమార్ వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితులను అదుపులో వచ్చేలా చేస్తున్నారు.దాదాపు నాలుగు కోట్ల ఆస్తినట్టం జరిగినట్టు అంచనా సామాన్య గిరిజన కుటుంబం నుంచి మారుమూల తండా నుంచి వచ్చిన భూక్య బద్రు నాయక్ వ్యాపారం ఒక్కసారిగా కుప్ప కూలిపోవడంతో కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు అందరూ తీవ్ర ఆందోళన చెందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ నేత ఆంగోత్ వినోద్ లోక్ నాయక్, మాజీ ఎంపి అజ్మీరా సీతారాం నాయక్, కాకతీయ యూనివర్సిటీ జెఎసి నేత రాజు నాయక్ వెంటనే ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకుని ఈ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ విచారణ చేసి తక్షణమే ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బద్రునాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** వర్ధన్నపేట నియోజకవర్గంలోని 2వ డివిజన్ గుండ్లసింగారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన నూతన గృహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐఏఎస్ అధికారి కెఆర్ నాగరాజు ప్రారంభించారు. రెండో డివిజన్ పరిధిలోని గుండ్లసింగారంలో మాదాసి దయాకర్–సుజాత దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు స్వయంగా వెళ్లి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన ఇంటిని ప్రారంభించి, దయాకర్–సుజాత దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని, నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.తమకు సొంత ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే కెఆర్ నాగరాజుకు దయాకర్–సుజాత దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. 2వ డివిజన్ అధ్యక్షులు పుట్ట తిరుపతి,వర్ధన్నపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గడిపి జీవన్,వంగపహడ్ మాజీ పాక్స్ చైర్మన్ అనిల్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ బోడ డిన్న,డివిజన్ ప్రధాన కార్యదర్శి వంశీ,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

మహిళ సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట* రానున్న పది రోజుల్లో రాష్ట్రంలో కొత్త పింఛన్ల పంపిణీ * మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి మండలం, పెద్దాపూర్ రైతు వేదికలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందు కు మాత్రమే కాకుండా ఆరోగ్యశ్రీ సేవలు, ఆదాయ ధ్రు వీకరణ తదితర అవసరాలకు కీలకమైన అధికారిక పత్ర ంగా ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలకు గౌర వం, స్వేచ్ఛతో పాటు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను మహిళల పేరిటే మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్య లు చేపడుతోందని, రానున్న 10 నుంచి 15 రోజుల్లో కొ త్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వయం ఉపాధి పొందేందుకు, వ్యా పారాలు ప్రారంభించేందుకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంఘాల ద్వారా రూ.లక్ష వరకు రుణం అంది ంచేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపా రు. విబిజి రాంజీ పథకం కింద గ్రా మాల్లో సుమారు 37 0 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ కి సగటున రూ.5 0 లక్షల వరకు నిధులు వచ్చే అవకాశం ఉ న్నందున మేకల షెడ్లు, కోళ్ల ఫారాలు, ఫామ్ పాండ్లు, డ్రైనేజీలు, కా లువలు తదితర పనులను చేపట్టి గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మా ణం చేపట్టడంతో పాటు వివొ భవనాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**పారదర్శకంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా, సురక్షితంగా నిత్యావసర సరుకులు అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆగస్టు 15 నుంచి జిల్లా వ్యాప్తంగా పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1, 39,530 స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా 3,95,962 మంది లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు. భూపాలపల్లి మండల పరిధిలోని పెద్దాపూర్, బావుసింగ్‌పల్లి, మూలపల్లి, లంబాడితండ, సుబ్బక్కపల్లి గ్రామాల్లో మొత్తం 1,993 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నకిలీ, డూప్లికేట్ కార్డులకు తావులేకుండా హోలోగ్రామ్, ఇష్యూయింగ్ అథారిటీ ముద్ర, హిడెన్ ఇమేజ్ తదితర తొమ్మిది రకాల భద్రతా ఫీచర్లను ప్రభుత్వం కార్డుల్లో పొందుపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులను టిరేషన్ మొబైల్ యాప్‌తో అనుసంధానం చేసినట్లు స్పష్టంచేశారు. దీని ద్వారా ప్రజలు తమ రేషన్ కార్డు వివరాలను డిజిటల్‌గా వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'నారీ నారీ నడుమ మురారీ', 'బైకర్' విజయాలతో జోష్‌లో ఉన్న శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్లతో తొలిసారిగా చేతులు కలిపారు. వీరి కాంబినేషన్‌లో 'జార్జ్ క్రిష్' పండుగ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరించబోతోంది.

# రీల్

## 'శివ ట్రాన్స్' సాంగ్ రిలీజ్




హాయ్ జాయ్ కమర్షియల్స్ బ్యానర్‌పై డా.చింతాడ హేమారావు నిర్మాతగా, వింటేజ్ ఐకానిక్ పిక్చర్స్ నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన దర్శకత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ 'చకోర'. శ్రవణ్, మలైకా టి. వాసుపల్ ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ ప్రేమ కథ చిత్రం శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా అక్టోబర్ 9న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి 'శివ ట్రాన్స్..' వీడియో సాంగ్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'శివ ట్రాన్స్..' వీడియో సాంగ్ ను ర్యాప్ బీట్‌తో ప్రిన్స్ హెన్రీ ఎనర్జిటిక్ గా కంపోజ్ చేశారు. సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి సాహిత్యాన్ని అందించారు. రితేష్ రావ్ పాడారు. 'శివ ట్రాన్స్..' వీడియో సాంగ్ ను ప్రమోషనల్ సాంగ్‌గా రూపొందించారు. వైజాగ్ బీచ్‌లో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో ఈ పాటను కలర్ ఫుల్‌గా తెరకెక్కించారు. ర్యాప్ బీట్‌తో శివుడిని స్తుతిస్తూ పాట డిజైన్ చేయడం కొత్త ప్రయత్నంగా చెప్పుకోవచ్చు. ఈ పాటలో మూవీ టీమ్ మెంబర్స్ పాల్గొనడం విశేషం. శ్రవణ్, మలైకా టి వాసుపల్, అనుష్క లూహార్, యామిని, ఎల్ బి శ్రీరామ్, సుమన్, ఆకెళ్ళ గోపాల కృష్ణ, వంగపండు,వంశీ, సుమంత్, భాను, సూర్య మాకిరెడ్డి, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : లాలం కన్నాజీ, పాటలు : రామ జోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్ యాక్షన్ కొరియోగ్రఫీ రామ్ కిషన్, ప్రొడక్షన్ డిజైనర్ రామ్ చరణ్ తేజ్ లాభాని, డీవోపీ రుప్ప గోపీకృష్ణ, ఎడిటర్ : మార్తాండ కె వెంకటేష్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రిన్స్ హెన్రీ, నిర్మాత డా. చింతాడ హేమారావు, రచన, దర్శకత్వం మంగా శ్రీనివాస్.

## నిజ జీవిత ప్రేమ కథ 'జాన్'




ఎమోషనల్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న 'జాన్' ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతూ, ప్రేమ, అనుబంధం, తోడుగా నిలిచే బంధం చుట్టూ సాగే కథను పరిచయం చేస్తోంది.ఆర్యన్ గౌర రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆర్యన్ గౌర, మోనిషా మోహన్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. రావు రమేష్, బాబా భాస్కర్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో వీల్‌చైర్‌లో కూర్చున్న మోనిషా వెనుక ఆర్యన్ నిలబడి, వీల్‌చైర్ హ్యాండిల్స్‌పై చేతులు ఉంచి కనిపిస్తున్నారు. మోనిషా చిరునవ్వు, అందమైన ప్రకృతి నేపథ్యం, అలాగే ఫరెవర్ అనే పదం పోస్టర్‌కు మరింత ఎమోషనల్ టచ్‌ను అందిస్తున్నాయి. వీల్‌చైర్‌ను టైటిల్ డిజైన్‌లో క్రియేటివ్‌గా భాగం చేయడం ఫస్ట్ లుక్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక పోస్టర్‌లో కనిపించే క్యూట్ డాగ్ కూడా తనదైన శైలిలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రానికి మూడు సార్లు నేషనల్ అవార్డ్ విజేత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. అమరన్ చిత్రానికి ఇటీవల అందుకున్న నేషనల్ అవార్డ్‌తో ఆయన మూడు నేషనల్ అవార్డులను సొంతం చేసుకున్నారు. గతంలో సూరరై పొట్రు, వాతి చిత్రాలకు కూడా ఆయన నేషనల్ అవార్డులు అందుకున్నారు. లక్ష్మీ నరసింహా మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'జాన్' చిత్రం నిజ జీవిత సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది తెరకెక్కుతోంది. ప్రేమ, అనుబంధం, జీవిత ప్రయాణంలో ఒకరికొకరు తోడుగా నిలిచే భావోద్వేగాలను ఈ చిత్రం ఆవిష్కరించనుంది.

## సై ఫై థ్రిల్లర్‌గా 'కిల్లర్'



జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్న ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్‌పై పూర్వాజ్, పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'కిల్లర్' సినిమా అక్టోబర్ 30న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ రాబోతోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఓవర్సీస్ లో 'కిల్లర్' మూవీ గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఓఎంజి పిక్చర్స్ ఈ సినిమాను ఓవర్సీస్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ సంస్థ 'కిల్లర్' సినిమాను అమెరికా, యూరప్, కెనడా, అరబ్ దేశాలు, మలేషియా, న్యూజిలాండ్ రష్యా వంటి దేశాల్లో విడుదల చేయబోతోంది. జ్యోతి పూర్వజ్, పూర్వాజ్ , మనీష్ గిలాడ, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ ఆశీర్వాద్, సుమన్ జీవ, ఆర్ట్ డైరెక్షన్ మణి, యాక్షన్ కొరియోగ్రఫీ రాజ్ కుమార్ గంగపుత్ర, లైన్ ప్రొడ్యూసర్స్ దశరథ మాధవ్, సీతారామారావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డిఎస్ బాష.

## 'జార్జ్ క్రిష్' హీరోయిన్‌గా మానస వారణాసి

నారీ నారీ నడుమ మురారీ', 'బైకర్' విజయాలతో జోష్‌లో ఉన్న శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్లతో తొలిసారిగా చేతులు కలిపారు. వీరి కాంబినేషన్‌లో 'జార్జ్ క్రిష్' పండుగ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరించబోతోంది. ఏటీవీ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తుండగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 14న సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. గతంలో విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కలర్‌ఫుల్ ఫెస్టివ్ లుక్ ఆకట్టుకుంది. అందులో శర్వానంద్ హీరోయిన్‌ను ఎత్తుకున్న కటౌట్ ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమాలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'కపుల్ ఫ్రెండ్లీ'తో సూపర్ హిట్




అందుకున్న మానస వారణాసి.. 'జార్జ్ క్రిష్'లో శర్వానంద్‌కు జోడీగా కనిపించనున్నారు. టైటిల్ పోస్టర్‌ను బట్టి సినిమాలో లవ్ స్టోరీకి కీలక ప్రాధాన్యత ఉండబోతోంది. మానస పాత్ర కథలో కీలకంగా ఉండనుంది. ఫస్ట్ బూస్టర్‌ను రేపు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కెవి గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ రైటింగ్ డిపార్ట్‌మెంట్‌లో భాగం కాగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది.

## భిన్సాలీ గొప్ప దర్శకుడు : అలియాభట్




రణబీర్ కపూర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన తర్వాత సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న 'లవ్ అండ్ వార్' చిత్రంలో అలియా భట్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో అలియా ఇంతకుముందెన్నడూ కనిపించని గ్లామరస్ లుక్‌లో మెరిసింది. ఈ సినిమాలో సంజయ్ లీలా భన్సాలీ తన గత చిత్రాలకు భిన్నమైన ఆధునిక ప్రపంచాన్ని చూపించబోతున్నారు. మేకర్స్ సోషల్ మీడియాలో అలియా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన ఈ పోస్టర్‌లో అలియా స్లిట్ స్కర్ట్, ప్రత్యేకమైన హెడ్‌పీస్‌తో కుర్చీలో కూర్చుని కనిపించింది. ఆమె లుక్, స్టైలింగ్, హావభావాలు రెట్రో ఫీల్‌ను అందిస్తున్నాయి. ఈ పాత్రలో అలియా పూర్తిగా కొత్త అవతార్‌లో కనిపించనుందని పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'లవ్ అండ్ వార్'లో రణబీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 21న హిందీ, తమిళం, తెలుగు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సంజయ్ లీల బన్సాలి అద్భుతమైన దర్శకుడని ఈ సందర్భంగా అలియా భట్ కొనియాడారు.

## అంతుచిక్కని నిజం 'పూజా మేరీ జాన్'




ప్రతి కథ కూడా సులభంగా అందరికీ అర్థమయ్యేలా ఉండదు. కొన్ని కథలు మనలను అసౌకర్యానికి గురిచేస్తాయి.. మనం సహజంగా అంగీకరించే విషయాలను కూడా ఆ కథలు ప్రశ్నించేలా చేస్తాయి.. చూడకూడదనుకునే నిజాలను ఎదుర్కొనేలా మనలను సిద్ధం చేస్తాయి. అలాంటి కథే 'పూజా మేరీ జాన్'. నవ్‌జోత్ గులాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దినేశ్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. మ్యాడాక్ ఫిలిమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన 'పూజా మేరీ జాన్' అక్టోబర్ 2న హిందీ జీ5లో ప్రీమియర్ కానుంది. పూజా అనే అమ్మాయి చుట్టూ కలవరపరిచే ఘటనల నేపథ్యంలో సాగుతుంది. తిరస్కరణ, వ్యామోహం, నిజాన్ని అంగీకరించటం, అసలు ఏం జరిగిందనే నిజం వంటి అంశాలపై ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతుందీ చిత్రం. ఈ సందర్భంగా నటి మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ 'మొదటి నుంచే పూజ పాత్ర నన్ను ఎంతగానో ఆకర్షించింది. నటిగా నాలోని విభిన్న కోణాలను ఆవిష్కరించుకునే అవకాశం ఈ పాత్రతో కుదురుతుందని, కొత్తదనాన్ని చూపించగలనని అనిపించింది. లోతైన, ఎన్నో భావోద్వేగ కోణాలు ఉన్న పాత్ర. పాత్ర చుట్టూ ఉన్న సంక్లిష్టత కారణంగా నన్ను సినిమా నన్ను ఆకట్టుకుంది. నటించే సందర్భంలో ఎన్నో రకాల భావోద్వేగాలను పలికించాల్సి వచ్చింది అని అన్నారు.

# ఐరాసపై అసంతృప్తి

### భారత విదేశాంగ మంత్రి జైశంకర్



**ఐరాస సర్వసభ్య సమావేశం హైలైట్స్**

న్యూయార్క్ : ఐక్యరాజ్యసమితి సంస్కరణలు జరగకపోవడంపై అంతర్జాతీయ సమాజంలో అసంతృప్తి పెరుగుతోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. సంస్కరణలను వ్యతిరేకిస్తున్న దేశాలు ఐరాసను తమ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని, సంస్థ పట్ల నిజమైన ఆసక్తి లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఐరాస సంస్కరణలపై చర్చ ప్రతి ఏడాది జరుగుతున్నప్పటికీ, ఇప్పుడు ఆ డిమాండ్ మరింత బలపడుతోందని జైశంకర్ చెప్పారు. సంస్కరణలపై అర్థవంతమైన చర్చ జరగాలంటే ముందుగా చర్చించేందుకు ఒక లిఖితపూర్వక ప్రతిపాదన ఉండాలని స్పష్టం చేశారు. ఏకాభిప్రాయంతో సంస్కరణ సాధ్యం కాదని, అభిప్రాయాలను చర్చించిన తర్వాత ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ ద్వారా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా ఐరాస మారాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా భద్రతా మండలి ప్రస్తుత భౌగోళిక, రాజకీయ వాస్తవాలను ప్రతిబింబించడం లేదని భారత్ చాలాకాలంగా వాదిస్తోంది. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెష్ కూడా భద్రతా మండలి సంస్కరణలకు పిలుపునిచ్చారు.

ఐక్యరాజ్య సమితి (ఐరాస) సర్వసభ్య సమావేశాల్లో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, పాలస్తీనా నేత మహ్మూద్ అబ్బాస్ ప్రసంగాలు ప్రధానంగా నిలిచాయి. అమెరికా వీసా నిరాకరించడంతో అబ్బాస్ సమావేశానికి వ్యక్తిగతంగా హాజరు కాలేకపోయారు. కొలంబియా అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా విదేశీ పర్యటనలు చేయకుండా దేశంలోని నేరాలు, హింసపై దృష్టి పెట్టాలన్న ఎన్నికల హామీ మేరకు న్యూయార్క్ రాలేదు. ఆయన తరఫున ఉపాధ్యక్షుడు జోస్ మాన్యుయెల్ రెస్ట్రెపో ప్రసంగించారు.బొలీవియా అధ్యక్షుడు రోడ్రిగో పాజ్ పెరీరా దేశంలో రాజకీయ సంక్షోభాలు, అవినీతి ఆరోపణలు, ఇంధన కొరత మధ్య తన ప్రభుత్వ విధానాలను సమర్థించుకున్నారు. సోషలిజం ప్రజల ఆకలి తీర్చదని చెబుతూ, మార్పు కోసం ప్రజలు తనను ఎన్నుకున్నారని అన్నారు. ఘనా అధ్యక్షుడు జాన్ మహామా మానవ నాగరికతలో ఏ దేశాన్నీ నిర్మూలించకూడదని వ్యాఖ్యానించారు. అట్లాంటిక్ బానిస వాణిజ్య నేరాలను గుర్తించే తీర్మానానికి మద్దతిచ్చిన 123 దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు.ఇదిలా ఉండగా, న్యూయార్క్‌లో చలి పెరగడంతో ఐరాస ప్రధాన కార్యాలయంలోని మీడియా సమావేశ మందిరం అత్యంత చల్లగా ఉందని జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు.పరాగ్వే అధ్యక్షుడు శాంటియాగో పెనా తైవాన్‌కు తమ దేశ మద్దతును పునరుద్ఘాటించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో పెనా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో జరిగే పరిణామాలు సెమీకండక్టర్ల సరఫరాతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయని అన్నారు.

## రూ.39 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)



ఏటా వేలంలో పాల్గొనే భక్తుల సంఖ్యతో పాటు ధర పరంగానూ మైలురాళ్లను దాటుకుంటూ వస్తోంది. పంటలు బాగా పండటానికి,వ్యాపారాల్లో శుభాలు కలగడానికి ఈ లడ్డూ ప్రసాదం దివ్యౌషధంగా భావిస్తారు. ఈ నమ్మకంతోనే ప్రతీ ఏడాదీ కొత్త రికార్డులు నమోదవుతూ వస్తున్నాయి. ఈ సారి సాధించిన రూ.39 లక్షల చారిత్రాత్మక మార్కు భాగ్యనగర్ గణేష్ ఉత్సవాల చరిత్రలోనే ఒక కొత్త రికార్డుగా నిలిచింది. లడ్డూను గెలుచుకున్న సామ ప్రణీత్ రెడ్డి దంపతులకు ఉత్సవ సమితి సభ్యులు, ఊరేగింపులో పాల్గొన్న వేలాది మంది భక్తులు ఘనంగా అభినందనలు తెలిపారు.ప్రతిష్ఠాత్మక బాలాపూర్ లడ్డూ దక్కడం తమ కుటుంబానికి లభించిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రణీత్ రెడ్డి వెల్లడించారు. గణేష్ లడ్డూ వేలానికి బాలాపూర్ కొత్త గ్లామర్ తీసుకు వచ్చింది. తరవాత అంత కంటే ఎక్కువ ధరలతో లడ్డూలను ఇతర సొసైటీలు, కాలనీల్లో పాడుకునేవారు ఉన్నారు. అయితే బాలాపూర్ లడ్డూ ప్రత్యేకత మాత్రం ఎప్పుడూ హైలెట్ అవుతూనే ఉంటుంది.

## మళ్లి రా!

(మొదటి పేజీ తరువాయి)



చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, చార్మినార్, ఎం.జె.మార్కెట్ మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరుకుని క్రేన్ నెంబర్12 వద్ద నిమజ్జనం పూర్తి చేసుకుంది. పటిష్ఠ బందోబస్తు, పకడ్బందీ ఏర్పాట్లు నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు పోలీసులు, మున్సిపల్ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. 4 కమిషనరేట్లకు చెందిన 45 వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. నగర వ్యాప్తంగా 10 వేల సిసిటివి కెమెరాలు, 24 డ్రోన్‌లు, హైరైజ్ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచారు. శుక్రవారం ప్రార్థనలు, నిమజ్జన ఊరేగింపు ఒకే రోజు రావడంతో చార్మినార్ పరిసర ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించి, బాంబ్ స్క్వాడ్ తనిఖీలతో కట్టుదిట్టమైన భద్రతను నిర్వహించారు. నగరవ్యాప్తంగా 141 నిమజ్జన కేంద్రాలలో 275 క్రేన్‌లను అందుబాటులో ఉంచగా, ఒక్క హుస్సేన్‌సాగర్ వద్దనే 12 క్రేన్‌ల ద్వారా నిమజ్జనాలు కొనసాగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టడంతో భాగ్యనగర వినాయక నిమజ్జన ఘట్టం అత్యంత శోభాయమానంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తయింది.

## జాతీయ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)



నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ స్టేట్స్, యుటిస్ స్కిల్ సెక్రటరీస్ ఫర్ ప్రగతి రివ్యూలో వెల్లడైంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంతో, శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పర్యవేక్షణలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. పిఎం సేతులో భాగంగా ఎంపికైన పారిశ్రామిక క్లస్టర్లలో నాలుగు యాంకర్ ఇండస్ట్రీ పార్ట్నర్స్ కోసం ప్రత్యేక ప్రయోజన సంస్థలు ఏర్పాటు చేసి కార్యకలాపాలు ప్రారంభించారు. మేడ్చల్ క్లస్టర్‌కు జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్, ఓల్డ్ సిటీ క్లస్టర్‌కు అపోలో మెడికల్స్ లిమిటెడ్, పటాన్‌చెరు క్లస్టర్‌కు శ్రీ సిద్ధార్థ ఇన్ఫ్రాటెక్ అండ్ సర్వీసెస్, సంగారెడ్డి క్లస్టర్‌కు న్యూలాండ్ ఫౌండేషన్ యాంకర్ ఇండస్ట్రీ పార్ట్నర్‌గా ఉన్నాయి. పరిశ్రమల భాగస్వామ్యంతో ఐటిఐల్లో ఆధునిక సాంకేతికతలకు అనుగుణంగా శిక్షణ అందించి, అప్రెంటిస్‌షిప్, ఆన్ దిజాబ్ ట్రైనింగ్, ఉద్యోగ అవకాశాలకు అనుసంధానం చేస్తున్నారు.

**అప్రెంటిస్‌షిప్‌లో 92 శాతానికి పైగా ప్లేస్‌మెంట్..**

అప్రెంటిస్‌షిప్ ఆధారిత ఉపాధిలో తెలంగాణ 92 శాతానికి పైగా ప్లేస్‌మెంట్ రేషియో నమోదు చేసినట్లు సమీక్షలో వెల్లడైంది. పరిశ్రమలకు భవిష్యత్తులో అవసరమయ్యే నైపుణ్యాలను ముందుగానే గుర్తించి యువతకు శిక్షణ ఇవ్వడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. అలాగే దేశీయ ఉపాధితోపాటు విదేశీ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా టామ్‌కామ్ ద్వారా యువతకు విదేశీ భాషల్లో శిక్షణ అందిస్తున్నారు. జర్మనీలో ఉద్యోగాల కోసం రాష్ట్రవ్యాప్తంగా జర్మన్ భాషా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మందమర్రి, కొడంగల్‌లో ఉచిత జర్మన్ భాషా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి నర్సులు, నర్సింగ్ అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఐటిఐల ఆధునీకరణ, కొత్త టెక్నాలజీలపై శిక్షణ, పరిశ్రమల భాగస్వామ్యం, అప్రెంటిస్‌షిప్‌తో ప్రాక్టికల్ అనుభవం కల్పించడంతోపాటు రాబోయే స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. యువతకు నైపుణ్యాలు.. పరిశ్రమలకు నిపుణులైన మానవ వనరులు.. దేశీయ, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com